సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 4
బుధవారం 27-3-2024



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



నేడు 'హైకోర్టు'కు భూమిపూజ
శంకుస్థాపన చేయనున్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ - 3లో



బిలియనీర్ల నగరం ముంబై
బిలియనీర్ల విషయంలో ముంబై బీజింగ్‌ను అధిగమించింది. - 13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మరో యాత్రకు సిద్ధం
మరోసారి చారిత్రక విజయమే లక్ష్యంగా ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నుంచి ఎన్నికల ప్రచారభేరి మోగించనున్నారు.
- వివరాలు 10లో



జస్టిస్ సుజోయ్ పాల్ ప్రమాణం
తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్ పాల్ బాధ్యతలు చేపట్టారు. సీజే జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం చేయించారు.
- వివరాలు 3లో



103 మందికి నో టికెట్
టికెట్ల కేటాయింపులో బీజేపీ.. గెలుపు చాన్స్ లేని వారిని పక్కన పెట్టేస్తోంది. సిట్టింగ్ ఎంపీల్లో 103 మందికి టికెట్ 'నో' చెప్పింది.
- వివరాలు 6లో



బ్రిడ్జిని ఢీకొట్టిన భారీ నౌక
అమెరికాలోని పటాప్‌స్కో నదిలో ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జిని కంటైనర్లతో వెళ్తున్న నౌక ఢీకొట్టింది. వంతెన కొంతభాగం కూలింది.
- వివరాలు 6లో



జ్యుడీషియల్ కస్టడీకి ఎమ్మెల్సీ కవిత

14 రోజుల కస్టడీకి ప్రత్యేక కోర్టు ఆదేశం

ఢిల్లీ మద్యం పాలసీ స్కాంలో కవితది కీలకపాత్ర: ఈడీ

- బెయిల్ ఇస్తే సాక్ష్యాలు తారుమారు చేస్తారంటూ అభ్యంతరం
- ఏప్రిల్ 1న బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపడతామన్న జడ్జి
- కడిగిన ముత్యంలా బయటకు వస్తా: ఎమ్మెల్సీ కవిత

5లో

నచ్చినోళ్లు జేబులో.. నచ్చనోళ్లు జైలులో

బీజేపీ తీరుపై హరీశ్ ధ్వజం

5లో

170 మండలాల్లో కరువు ఛాయలు

భూగర్భ శోకం

భారీగా తగ్గిన రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టాలు

గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఫిబ్రవరిలో 4.5 అడుగుల మేర క్షీణత

రాష్ట్రవ్యాప్తంగా 8% భూభాగంలో 65 అడుగులకుపైగా పతనమైన నీటిమట్టాలు



సాలి చెరువు ఖాళీ
యాచారం: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నక్కర్తమేడి పల్లిలో నెర్రెలుబారిన సాలి చెరువు. దీని చుట్టు పక్కల భూగర్భ జలాలు పడిపోతున్నాయి

- వికారాబాద్ జిల్లాలో అత్యంత ప్రమాదకర స్థాయిలో తగ్గుదల
- కృష్ణా బేసిన్ జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో నల్లగొండ జిల్లాపై ప్రభావం
- ఒక్క జగిత్యాల జిల్లాలో మాత్రమే సురక్షిత స్థాయిలో భూగర్భ జలాలు
- 33 జిల్లాల స్థితిగతులపై భూగర్భజల శాఖ నివేదికలో ఆందోళనకర అంశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అత్యంత ప్రమాదకర స్థాయిల్లోకి పతనమయ్యాయి. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా 170 మండలాల్లో కరువు పరిస్థితులు గోచరిస్తున్నాయి. బోరుబావుల్లో నీళ్లు అడుగంటడంతో లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయే దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో 7.34 మీటర్లు (24.08 అడుగులు) ఉన్న రాష్ట్ర మిగతా 2వ పేజీలో ▶

త్వరలో పంటల పరిశీలనకు కేసీఆర్



- ముషంపల్లి నుంచి షురూ
- భువనగిరి, ఆలేరులో పర్యటన

2లో

రీల్ కాదు.. 'కాల్' నాయక్!



నాయక్ సినిమాలోలా వ్యవహరించిన శివారు కమిషనరేట్ ఉన్నతాధికారి

ట్యాపింగ్ టీమ్ సేకరించిన సమాచారం ఆధారంగా కొందరికి పిలుపులు

విడివిడిగా సమావేశాలు ఏర్పాటు.. రియల్టర్లు, బిల్డర్ల నుంచి వసూళ్లు

5లో

ఎర్రబెల్లిపై ఫిర్యాదు కేసులో విచారణ

సీఎం, డీజీపీలకు వ్యాపారి శరణ్ చౌదరి ఈ–మెయిల్ 5లో



పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలా?

ఏం చేశారని మోదీకి మూడోసారి ఓటేయాలి?

బీజేపీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్న

పదేళ్లలో ప్రధాని మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదు

గుజరాత్‌కు బుల్లెట్ ట్రైన్ తీసుకెళ్లి, వికారాబాద్‌కు ఎంఎంటీఎస్ ఎందుకు తేలేదు?

- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధి జరుగుతుంది
- రంగారెడ్డి నుంచే పార్టీ పార్లమెంటు ఎన్నికల శంఖారావం
- ఏప్రిల్ 6 లేదా 7న తుక్కుగూడ సభలో జాతీయ స్థాయి గ్యారంటీల ప్రకటన

2లో



రేవంత్‌ను చూసి ఎవరూ భయపడరు

లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలో తొలి చేరిక రేవంత్‌దే..: కేటీఆర్

- అక్రమ వసూళ్లు చేసి ఢిల్లీకి రూ.2,500 కోట్ల కప్పం
- దానం అనర్హతపై అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం...

సాక్షి, హైదరాబాద్: 'అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అంటున్నడు. ఎక్కడ జరిగిందో చెప్పకుండా యూట్యూబ్ చానళ్లు, మీడియాకు లీకులు ఇస్తూ ఏదో జరిగిందనే ప్రచారం చేస్తున్నడు. నీ చేతిలో అధికారం ఉంది కదా.. విచారణ చేసి తప్పులు ఎక్కడ జరిగాయో బయటపెట్టి బాధ్యులపై చర్యలు తీసుకో. ఎవడికీ భయపడేది లేదు. నువ్వు వెంట్రుక కూడా పీకలేవు. ఇలాంటి వాటిని చూసి కేడర్ ఆగం కావద్దు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సెక్రటేరియట్‌లో లంకె బిందెలు లేవని చెబుతున్న రేవంత్ గతంలో ఏం చేసెటోడో తెలియదు. జేబులో కత్తెరలు పెట్టుకుని మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

పంట నష్టం 40 వేల ఎకరాల్లోనే

టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇటీవలి అకాల వర్షాల కారణంగా ప్రాథమిక అంచనా ప్రకారం 10 జిల్లాల్లోని 40 వేల ఎకరాల్లో మాత్రమే పంట నష్టం వాటిల్లిందని, కానీ మాజీ మంత్రి హరీశ్‌రావు మాత్రం 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్తున్నారని టీపీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో అన్వేశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రజల చీత్కారానికి గురై అధికారం కోల్పోయిన తర్వాతైనా హరీశ్‌రావు నిజాలు చెప్పడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఆయన ఏ లెక్కల ఆధారంగా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. 2016, 2017, 2019, 2020 సంవత్సరాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే ఎంతమంది రైతులకు పరిహారం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎంపీగా గెలిచిన తర్వాతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా


దానం నాగేందర్ వెల్లడి



బంజారాహిల్స్ (హైదరాబాద్): జూన్ 4న లోక్‌సభ ఎన్నికల్లో తాను ఎంపీగా గెలిచిన తర్వాతే ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ చెప్పారు. అప్పుడే ఖైరతాబాద్ నియోజక వర్గంలో ఉప ఎన్నిక వస్తుందన్నారు. మంగళవారం ఆయన బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను పార్టీ మారిన విషయంలో ఎటువంటి పొరపాటు చేయలేదని, బీఆర్‌ఎస్‌లో చేరిన నాటి నుంచి సిన్సియర్‌గా పని చేశానని, అయితే వారు తనను గుర్తించలేదని తెలిపారు. కేసీఆర్ ఎంతో గొప్పవారని అయితే, ఆయన చుట్టూ కొంతమంది చేరి భ్రష్టుపట్టించారన్నారు. పార్టీ ఫిరాయింపుపై ఎవరైనా కోర్టుకు వెళ్లొచ్చని తాను సరైన సమయంలో కోర్టుకు జవాబు చెప్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గత మూడు నెలల్లో బిల్డర్లను బెదిరించి 3 వేల కోట్లు సంపాదించారని అంటున్నారని, అయితే గత తొమ్మిదిన్నరేళ్ల లెక్కలు కూడా తేల్చాలని ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో తన గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు.

పదేళ్లుగా ఖజానాను ముట్టడించారు

మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: పదేళ్లలో రాష్ట్ర ఖజానాను ముట్టడించిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు సచివాలయాన్ని ముట్టడిస్తామని అంటున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రైతు సమస్యలతో పాటు నీటిపారుదల ప్రాజెక్టులు, బీఆర్‌ఎస్ అవినీతిపై చర్చించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధమా అని సవాల్ చేశారు. హరీశ్‌రావు ఇందుకు సిద్ధమైతే సమయం, తేదీ, వేదిక ఏదో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, ఈర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడుతూ, పంటలకు నష్ట పరిహారం ఇవ్వకపోతే రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను ఖండించారు. గత పదేళ్లలో ఎప్పుడైనా బీఆర్‌ఎస్ హయాంలో పంట నష్టపరిహారం ఇచ్చారా? ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాను అమలు చేశారా అని ప్రశ్నించారు. రైతులు, వ్యవసాయం గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్ నేతలకు లేదన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని నివేదిక రాగానే ఎకరానికి రూ.10 వేల పరిహారం చెల్లిస్తామని తెలిపారు. తాను బీఆర్‌ఎస్‌కు దూరమయ్యాక తనతో మాట్లాడేందుకు కేసీఆర్ ప్రయత్నించారని, ఎనిమిదిసార్లు తనకు ఫోన్ చేసినా తాను మాట్లాడలేదని జూపల్లి చెప్పారు.

ఇదంజగత్



పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలా?

ఏం చేశారని మోదీకి మూడోసారి ఓటేయాలి?

- బీజేపీకి సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలా? అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. గత పదేళ్లలో తెలంగాణకు బీజేపీ ఏం చేసిందని ఆ పార్టీ అభ్యర్థులకు లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లేయాలని నిలదీశారు. ప్రస్తుతం తెలంగాణను అభివృద్ధి చేసుకునేందుకు చక్కటి అవకాశం వచ్చిందని, ఇక్కడి నుంచి ఎక్కువ మంది కాంగ్రెస్ అభ్యర్థులను లోక్‌సభకు పంపిస్తే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఏం చూసి మోదీకి ఓటేయమంటారు?

'గత పదేళ్లలో మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేయలేదు. బుల్లెట్ ట్రెన్‌ను గుజరాత్‌కు తీసుకెళ్లిన మోదీ, వికారాబాద్‌కు ఎంఎంటీఎస్ ఎందుకు తేలేదు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకున్న మోదీ, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులెందుకు ఇవ్వలేదు? రీజినల్ రింగు రోడ్డు రాకుండా బీజేపీ ఎందుకు మోకాలడ్డుతోంది. ఏం చూసి మూడోసారి మోదీకి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారు..' అంటూ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

అన్నీ బేరీజు వేసిన తర్వాతే అభ్యర్థుల ఎంపిక

'రాష్ట్రంలో ఈసారి 14 లోక్‌సభ స్థానాల్లో గెలవాలన్న పట్టుదలతో పనిచేస్తున్నాం. క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేలు అన్నీ బేరీజు వేసిన తర్వాతనే పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానితో మరొకదానికి సంబంధాలున్నాయి. ఇలాంటివన్నీ ఆలోచించిన తర్వాతే ఈ మూడు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేశాం. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ వందరోజుల పాలనకు రెఫరెండం లాంటివి. తెలంగాణలో 14 స్థానాలు గెలిచి సోనియాకు కృతజ్ఞతలు చెబుదాం..' అని సీఎం అన్నారు.

6 లేదా 7న రాష్ట్రానికి ఖర్గే, రాహుల్

'కార్యకర్తలకు అండగా నిలబడడంతోపాటు దేశాన్ని కాపాడుకునేందుకు రాహుల్‌గాంధీ వేల కిలోమీటర్లు నడిచారు. రాహుల్, సోనియాగాంధీల నాయకత్వాన్ని బలపరిచే బాధ్యత అందరిపై ఉంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుక్కుగూడలో ఆరు గ్యారంటీలు ప్రకటించుకున్నాం. మళ్లీ అదే తుక్కుగూడలో ఏప్రిల్ 6 లేదా 7వ తేదీల్లో జాతీయ స్థాయి గ్యారంటీలను ప్రకటించుకోబోతున్నాం. రంగారెడ్డి జిల్లా నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం పూరించబోతున్నాం. ఈ జనజాతర సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతోపాటు పలువురు జాతీయ స్థాయి నేతలు హాజరవుతారు..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

డోర్లు తెరిచి దొంగల్ని కూడా తీసుకొస్తే కష్టం

కేఎల్లార్ వ్యాఖ్యలు వైరల్

ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. 'డోర్ తెరుస్తాం ... డోర్ తెరుస్తాం అని అంటున్నారు. మీరు డోర్లు తెరిచి కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన దొంగలను కూడా లోపలికి తీసుకొస్తే మా లాంటోళ్లు, కార్యకర్తలు చచ్చిపోయే పరిస్థితి వస్తుంది. కేఎల్లార్‌కు, రేవంత్‌రెడ్డికి పడదేమో అని అక్కడక్కడా కార్యకర్తలు అనుకుంటున్నారు. మనమిద్దరం దగ్గరి మిత్రులం అనే విషయం వాళ్లకు తెలియదు. నేను చెప్పినా నమ్మేటట్టు లేరు. కాబట్టి మీరు చెప్పాలి..' అని కేఎల్లార్ వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు.

రేవంత్‌ను చూసి ఎవరూ భయపడరు

▶ మొదటి పేజీ తరువాయి

తిరుగుతున్న జేబుదొంగ రేవంత్.. పేగులు మెడలో వేసుకునేందుకు నువ్వేమైనా బోటీ కొట్టెటోడివా. మున్సిపల్ శాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి మూడు నెలలుగా భవన నిర్మాణ అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదు. పార్లమెంటు ఎన్నికల డబ్బుల కోసం రైస్ మిల్లర్లు, రియల్టర్లు, బిల్డర్లపై దాడులు చేసి బెదిరించి రూ.2,500 కోట్లు జమ చేసి ఢిల్లీకి కప్పం కట్టిండు. ఇది దోపిడీ సొమ్ము కాదా. ఇలాంటివి బయటకు రాకుండా బర్లు, గొర్ల స్కీమ్‌లంటూ ప్రజల మెదళ్లలో తప్పుడు సమాచారం నింపేందుకు చానళ్లలో కేసీఆర్‌ను తిడుతూ దొంగ మాటలు చెప్తున్నడు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు, కరెంటు, మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేలు, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇవ్వలేని ఇతనా మన సీఎం అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

బీజేపీలో మొట్టమొదట చేరేది రేవంత్

'కేంద్రంలో బీజేపీని ఆపే శక్తి, ధైర్యం కాంగ్రెస్‌కు లేవు. ఎన్నికల రేసులో ఎవరూ ఉండొద్దని మోదీ ప్రయత్నిస్తున్నారు. దేశంలో బలంగా ఉన్న ప్రాంతీయ నాయకులు కేసీఆర్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్ వంటి నేతలకు మాత్రమే బీజేపీని అడ్డుకునే శక్తి ఉంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మోదీని చౌకీదార్ అంటే రేవంత్ మాత్రం బడేభాయ్ అంటున్నడు. అదానీ మంచివాడు కాదని రాహుల్ అంటే, రేవంత్ మాత్రం కౌగిలించుకుని ఫొటోలు తీసుకుంటుండు. లిక్కర్ స్కామ్ ఏమీ లేదు, కేజ్రీవాల్ అరెస్టు అక్రమం అని రాహుల్ అంటే, కవిత అరెస్టును ఇక్కడి సీఎం సమర్థిస్తాడు. కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, రేవంత్‌కు నడుమ పొంతన కుదరడం లేదు. దేశంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ 40 సీట్లకు మించి గెలవదు. 40 సీట్లు దాటకుంటే వెంటనే తనతోపాటు మరికొందరిని మూటగట్టుకుని బీజేపీలో చేరే మొదటి వ్యక్తి రేవంత్‌రెడ్డి. ఈ విషయంలో ఎన్నిమార్లు ఆయనపై విమర్శలు చేసినా స్పందించకపోవడం వెనుక మతలబు ఇదే. జీవితకాలమంతా కాంగ్రెస్‌లో కొనసాగుతానని రేవంత్ చెప్పకపోవడమే దీనికి నిదర్శనం' అని కేటీఆర్ పేర్కొన్నారు.



సమావేశంలో పద్మారావు గౌడ్‌తో ముచ్చటిస్తున్న కేటీఆర్

కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదు..

'కాంగ్రెస్ కొన్ని యూట్యూబ్ చానళ్లను అడ్డుపెట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తుంటే.. బీజేపీ రాముడి పేరును చెప్పి నాటకం ఆడుతోంది. ప్రతిపక్షాల నేతలపై కేసులతో గొంతు నొక్కి జైలుకు పంపి మానసికంగా వేధిస్తోంది. లిక్కర్ స్కామ్ బయటపెడతానని అంటున్న కిషన్‌రెడ్డి ఆధారాలను కోర్టుకు సమర్పించాలి. ఐదేళ్లుగా కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు చేసిందేమీ లేదు. పార్టీ మారిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు కోసం అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భూగర్భ శోకం

▶ మొదటి పేజీ తరువాయి

సగటు భూగర్భ జలమట్టాలు ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 8.7 మీటర్ల (28.54 అడుగులు)కు పడిపోవడమే అందుకు కారణం. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏకంగా 1.36 మీటర్ల (4.46 అడుగుల) మేర భూగర్భ జలాలు పడిపోయాయి. ముఖ్యంగా గత జనవరిలో 7.72 మీటర్లు ఉన్న భూగర్భ జలాలు నెల వ్యవధిలోనే ఒక మీటర్ మేర క్షీణించి 8.7 మీటర్లకు చేరాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గత నెలలో ఉన్న భూగర్భ జలాల స్థితిగతులపై భూగర్భజల శాఖ రూపొందించిన నివేదికలో ఈ ఆందోళనకర అంశాలు వెలుగు చూశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,718 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ఆ శాఖ ప్రతి నెలా సమీక్షించి మరుసటి నెలలో నివేదికలను విడుదల చేస్తోంది.

11 జిల్లాల్లో 10 మీటర్ల కంటే ఎక్కువ...

జిల్లా స్థాయిల్లో భూగర్భ జలమట్టాలను 0–5 మీటర్లు, 5–10 మీటర్లు, 10 మీటర్లకుపైన అనే కేటగిరీలుగా భూగర్భజలశాఖ వర్గీకరించింది. దీని ప్రకారం రాష్ట్రంలో అత్యంత ప్రమాదకర స్థాయిలో వికారాబాద్ జిల్లాలో 13.07 మీటర్ల (42.8 అడుగులు)కు భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. మొత్తం 33 జిల్లాలకుగాను కేవలం జగిత్యాల జిల్లా 4.93 మీటర్ల (16.17 అడుగులు) భూగర్భ జలమట్టంతో 0–5 మీటర్ల కేటగిరీలో నిలిచింది. అంటే ఈ ఒక్క జిల్లాలోనే భూగర్భ జలాలు సురక్షిత స్థాయిలో ఉన్నట్లు దీని ద్వారా అర్థం అవుతోంది. 21 జిల్లాల్లో 5–10 మీటర్ల మధ్యన, మరో 11 జిల్లాల్లో 10 మీటర్లకన్నా ఎక్కువగానే భూగర్భ జలమట్టాలు తగ్గిపోయాయి. భూగర్భ జలమట్టం 10 మీటర్లకు (32.8 అడుగులు)పైనే పడిపోతే పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నట్లు భావిస్తారు.

30 జిల్లాల్లో క్షీణత నమోదు..

గతేడాది ఫిబ్రవరితో పోల్చితే ఈ ఏడాది ఫిబ్రవరిలో 30 జిల్లాల్లోని భూగర్భ జలమట్టాల్లో క్షీణత నమోదైంది. నాటితో పోలిస్తే ప్రస్తుత భూగర్భ జలమట్టాల్లో 0.15 మీటర్ల నుంచి 3.91 మీటర్ల వరకు వ్యత్యాసం కనిపించింది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 3.91 మీటర్ల వ్యత్యాసం కనిపించింది. గతేడాది ఫిబ్రవరిలో నల్లగొండ జిల్లాలో భూగర్భ జలమట్టం 6.15 మీటర్లు ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 10.06 మీటర్లకు పడిపోయింది. కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోవడంతో నల్లగొండ జిల్లాపై తీవ్ర దుష్ప్రభావం పడినట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

170 మండలాల్లో దశాబ్ద కాల కరువు

రాష్ట్రంలోని మొత్తం 612 మండలాలను గత దశాబ్ద కాల (2014–2023) సగటు భూగర్భ జలమట్టాలతో పోల్చినప్పుడు ఫిబ్రవరిలో 170 (28%) మండలాల్లో భూగర్భ జలమట్టాలు 0.01 మీటర్ల నుంచి 17.08 మీటర్ల వరకు క్షీణించాయి. గత దశాబ్ద కాలంతో పోల్చినప్పుడు 442 (72%) మండలాల్లో మాత్రం నామమాత్ర స్థాయి నుంచి 15.52 మీటర్ల వరకు వృద్ధి చెందాయి. అంటే రాష్ట్రంలోని 170 మండలాల్లో గత దశాబ్దకాలంలో లేని కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ జిల్లాల్లో అత్యంత ప్రమాదకరం..



సిద్దిపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని దక్షిణాది ప్రాంతాలు, వికారాబాద్ జిల్లాలోని దక్షిణమధ్య, ఉత్తరాది ప్రాంతాలు, కామారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లోని మధ్య, ఉత్తరాది ప్రాంతాలు, భద్రాద్రి జిల్లాలోని ఆగ్నేయా ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర స్థాయిల్లోకి భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. ఈ జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు 15–20 మీటర్ల మోస్తారు లోతు (మోడరేట్లీ డీప్), 20 మీటర్లకుపైన తీవ్ర లోతు (వెరీ డీప్)ల్లో ఉన్నట్టు నిర్ధారించారు. రాష్ట్ర భూభాగంలో 8 శాతం ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. 24 శాతం ప్రాంతం పరిధిలో 10–15 మీటర్లు, 53 శాతం ప్రాంతం పరిధిలో 5–10 మీటర్లు, 15 శాతం ప్రాంతం పరిధిలో 5 మీటర్ల కంటే తక్కువగా భూగర్భ జలమట్టాలు నమోదయ్యాయి.

గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో క్షీణించిన భూగర్భ జలమట్టాలు ఇలా..

జిల్లా	ఫిబ్రవరి 2023	ఫిబ్రవరి 2024
వికారాబాద్	10.93	13.07
మెదక్	12.16	12.98
కామారెడ్డి	10.64	12.92
రంగారెడ్డి	8.19	11.87
మేడ్చల్	8.97	11.45
సంగారెడ్డి	11.04	11.36
నిజామాబాద్	10.61	11.34
సిద్దిపేట	8.63	10.07
మహబూబ్‌నగర్	6.93	10.19
సిరిసిల్ల	7.94	10.18
నల్లగొండ	6.15	10.06
నాగర్‌కర్నూల్	6.57	9.52
నిర్మల్	8.40	9.11
యాదాద్రి	6.06	8.59
భద్రాద్రి	8.86	8.66
భూపాలపల్లి	7.98	8.61
నారాయణపేట	5.76	8.44
సూర్యాపేట	5.21	8.28
హైదరాబాద్	7.98	8.22
కరీంనగర్	7.13	7.99
గద్వాల	5.04	7.98
కుమురంభీం	7.13	7.64
ములుగు	7.13	7.60
ఆదిలాబాద్	8.00	7.40
జనగామ	6.90	7.37
హనుమకొండ	6.44	6.74
మంచిర్యాల	5.95	6.26
ఖమ్మం	5.11	6.22
వనపర్తి	4.54	6.20
మహబూబాబాద్	4.94	5.59
వరంగల్	4.74	5.11
పెద్దపల్లి	5.47	5.09
జగిత్యాల	4.78	4.93
తెలంగాణ సగటు	7.34	8.7

(గణాంకాలు మీటర్లలో)

కృష్ణా బేసిన్‌లో కరువు తీవ్రం..

కృష్ణా, గోదావరి బేసిన్‌లలోని జలాశయాల్లో నిల్వలు అడుగంటిపోవడంతోనే భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతున్నాయి. రాష్ట్రంలో గత వానాకాలం సాధారణ వర్షపాతానికి మించి వర్షాలు కురిసినా కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రధానంగా కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు ఎగువ నుంచి ఆశించిన రీతిలో వరదలు రాకపోవడమే దీనికి కారణమని చెప్పవచ్చు. రాష్ట్రంలోని 28 లక్షల వ్యవసాయ బోరుబావుల కింద రబీ పంటల సాగుకు పెద్ద ఎత్తున భూగర్భ జలాలను వినియోగిస్తున్నారు. మరో రెండు వారాల్లో రబీ పంటలు చేతికి వచ్చే అవకాశముంది. ఆలోపే బోరుబావులు ఎండిపోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో పంటల పరిశీలనకు కేసీఆర్

- బోర్లు వేసి నష్టపోయిన ముషంపల్లి నుంచి షురూ
- భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో పర్యటన
- రూట్‌మ్యాప్ ఖరారు చేసే బాధ్యత జగదీశ్‌రెడ్డికి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించేందుకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. సాగునీరు అందక భూగర్భ జలవనరులు కూడా అడుగంటిన పరిస్థితిలో రైతులతో ప్రత్యక్షంగా భేటీ కావాలని కేసీఆర్ భావిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులతో భేటీ అవుతారు. ఏప్రిల్ మొదటి వారంలో కేసీఆర్ పర్యటన ఉంటుందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం మీడియా ప్రతినిధులకు సూచనప్రాయంగా చెప్పారు. అత్యధికంగా బోర్లు వేసి నష్టపోయిన ముషంపల్లి నుంచి ఈ పర్యటన ప్రారంభమయ్యేలా కేసీఆర్ పర్యటన షెడ్యూలు ఉండే అవకాశముంది. కేసీఆర్ పర్యటన షెడ్యూల్‌తోపాటు రూట్‌మ్యాప్ ఖరారు చేసే బాధ్యతను జగదీశ్‌రెడ్డికి అప్పగించారు.

మొదలైన లోక్‌సభ నియోజకవర్గ భేటీలు

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఖరారైన నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా మంగళవారం భేటీలు ప్రారంభమయ్యాయి. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నేతలతో సోమవారం రాత్రి మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో కీలక భేటీ జరగ్గా, మంగళవారం ఉదయం సికింద్రాబాద్ నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. నల్లగొండ నియోజకవర్గ నేతల సమన్వయ భేటీ కూడా జగదీశ్‌రెడ్డి నివాసంలో మంగళవారం రాత్రి జరిగింది. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో బుధవారం తెలంగాణ భవన్‌లో భేటీ జరగనుంది. ఈ భేటీకి కేటీఆర్ హాజరవుతారు. ఇదిలాఉంటే మెదక్, చేవెళ్ల, పెద్దపల్లి తదితర లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోనూ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశాలు ప్రారంభమయ్యాయి.

సాగునీరు ఇవ్వకుంటే ఆత్మహత్యలే

మంథని–గోదావరిఖని ప్రధాన రహదారిపై ధర్నా



గోదావరిఖని - మంథని రోడ్డుపై పురుగు మందు డబ్బాలతో బైఠాయించిన రైతులు

మంథని: నీరు లేక కళ్లెదుటే పంటలు ఎండిపోతుంటే అన్నదాతలు అరిగోస పడుతున్నారు. 'అధికార యంత్రాంగం స్పందించి ఇప్పటికైనా నీరు అందించి చేతికొచ్చే పంటలను కాపాడాలి.. లేదంటే మాకు చావుతప్ప మారోమార్గం లేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తూ పెద్దపల్లి జిల్లా మంథని – గోదావరిఖని ప్రధాన రహదారిపై మంగళవారం వేలాది మంది రైతులు రాస్తారోకో చేశారు. చేతుల్లో పురుగులమందు డబ్బాలు, వరి గంటలు పట్టుకొని రోడ్డుపై రోడ్డుపై బైఠాయించారు. గంట పాటు ఉండిపోయారు. వరి పొట్టదశకు చేరిందని, నీరు అందక పంట కళ్లముందే ఎండిపోతుంటే గుండెలు తరుక్కుపోతున్నాయని కన్నీటిపర్యంతమయ్యారు. కాలువ నీరే ఆధారంగా పంటలు సాగుచేస్తే ఎగువన ఉన్న కొందరు రైతులు మోటార్లు పెట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు అందకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి నెలకొందని ఆరోపించారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో రోడ్డుకు ఇరు వైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న మంథని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని రైతులను కోరారు. నీటిపారుదల శాఖ ఈఈ బలరాం అక్కడకు చేరుకొని అక్రమంగా విద్యుత్ వినియోగించడంతోపాటు, కాలువలో విద్యుత్ మోటార్లు బిగిస్తున్న విషయంపై తమకు ఫిర్యాదు చేయాలన్నారు. విచారణ జరిపి వాటిని తొలగించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

తాగునీటికి ఆందోళన వద్దు

జలాశయాల్లో సరిపడా నిల్వలున్నాయి

- సీఎస్ శాంతికుమారి స్పష్టీకరణ
- తాగునీటి సరఫరాపై కలెక్టర్లతో సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రధాన మూడు జలాశయాలైన శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, నాగార్జునసాగర్‌లలో గతేడాది తరహాలోనే ఈ ఏడాదీ సరిపడా నీటి లభ్యత ఉన్నందున ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లతో మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తాగునీటి సరఫరాను సమీక్షించారు. రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా 'వేసవి కార్యాచరణ ప్రణాళిక'ను రూపొందించి జిల్లాలకు తగు నిధులను కూడా విడుదల చేసినట్లు సీఎస్ తెలిపారు. తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందన్నారు. నిరంతర నీటి సరఫరా కొనసాగింపునకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి రోజూ గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లోని తాగునీటి సమస్యను మన రాష్ట్రానికి కూడా అన్వయిస్తూ ఆందోళనకరమైన వార్తా కథనాలు రాయడం సరికాదన్నారు. ఏప్రిల్ రెండో వారం అనంతరం రిజర్వాయర్ల నుంచి ఎమర్జెన్సీ పంపింగ్‌ను చేపడతామని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో కూడా సరిపడా నీటి సరఫరా చేస్తున్నామని, వాణిజ్య అవసరాల నిమిత్తం డిమాండ్ ఎక్కువగా ఉందని జలమండలి అధికారులు వెల్లడించారు.

మీ పార్టీనే బీజేపీలో విలీనం చేస్తారు

- కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ రామ్మోహన్‌రెడ్డి ధ్వజం
- బీజేపీలోకి వెళ్లే ఖర్మ రేవంత్‌కు పట్టలేదని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినుద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. కేటీఆర్‌కు మతిభ్రమించి సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. రామ్మోహన్‌రెడ్డి మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు లింగం యాదవ్, కమల్‌తో కలిసి మాట్లాడారు. చెల్లెలు కవిత జైలుకు పోయి కేసులు చుట్టుముడుతుంటే కేటీఆర్‌కు బుర్ర పనిచేయడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను, కేటీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించారని, పార్లమెంటు ఎన్నికల్లో చేయడానికి కేటీఆర్ దగ్గర ఏమీ లేదని వ్యాఖ్యానించారు. జేబుదొంగ ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, ప్రజల జేబులు కొట్టి దోచుకున్న రూ.వేల కోట్లను కల్వకుంట్ల కుటుంబం నుంచి కక్కిస్తామని చెప్పారు. 'దొంగలు కాబట్టే చెల్లి తీహార్ జైల్‌లో ఉంది. నువ్వు కూడా చంచల్‌గూడ జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండు. ఫోన్‌ట్యాపింగ్ విచారణ జరుగుతుంటే నువ్వు, నీ కుటుంబం ఎందుకు వణుకుతోంది. ఫోన్ ట్యాపింగ్‌తో బెదిరించి మీరు చేసిన వసూళ్ల జాబితా వస్తుంది సిద్ధంగా ఉండు' అని వ్యాఖ్యానించారు. బీజేపీలోకి వెళ్లాల్సిన ఖర్మ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టలేదని, లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడం ఖాయమన్నారు.

నేడు హైకోర్టు నిర్మాణానికి భూమిపూజ

- శంకుస్థాపన చేయనున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్
- పాల్గొననున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు


హైకోర్టు భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కోసం మంగళవారం భూమిని చదును చేస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై. చంద్రచూడ్ బుధవారం సాయంత్రం 5.30 గంటలకు భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతోపాటు హైకోర్టు ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు. గత డిసెంబర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, హైకోర్టు సీజేతో భేటీ సందర్భంగా హైకోర్టుకు నూతన భవన నిర్మాణ అంశం ప్రస్తావనకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవనాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను ప్రధాన న్యాయమూర్తి, న్యాయవాదులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి సకల హంగులతో 100 ఎకరాల్లో రాజేంద్రనగర్‌లో భవనాన్ని నిర్మించి ఇస్తామని, త్వరలో శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను అదే రోజు ఆదేశించారు. అలాగే హైకోర్టును ఇక్కడి నుంచి తరలించినా.. ఇప్పుడున్న భవనాన్ని హెరిటేజ్ బిల్డింగ్‌గా పరిరక్షించాల్సిన బాధ్యత తీసుకుంటామని రేవంత్ చెప్పారు. ఆ భవనాన్ని ఆధునీకరించి సిటీ కోర్టుకు లేదా ఇతర కోర్టులకు వినియోగించుకునేలా చూస్తామని చెప్పిన విషయం విదితమే. ఆ తర్వాత మంత్రులు, న్యాయమూర్తులు భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కోర్టు నిర్మాణానికి భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం గత జనవరిలో జీవో జారీ చేసింది. ఇదిలాఉండగా, బుధవారం శంకుస్థాపన కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాల్గొంటుండటంతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్ పాల్ ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్ పాల్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఉదయం 10 గంటలకు హైకోర్టు ఆవరణలోని ఫస్ట్ కోర్టు హాల్‌లో ఆయనతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణ స్వీకారం చేయించారు. మధ్య ప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ సుజోయ్ పాల్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జస్టిస్ సుజోయ్ పాల్ కుటుంబసభ్యులతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు పాల్గొన్నారు. జస్టిస్ సుజోయ్ పాల్ చేరికతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 27కు చేరింది. మరో న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్య 28న బాధ్యతలు చేపట్టనున్నారు.


జస్టిస్ సుజోయ్ పాల్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే

ఫామ్‌ల్యాండ్‌పై విచారణ

'సాక్షి' కథనంపై స్పందించిన అధికార యంత్రాంగం

- ఫామ్‌ల్యాండ్‌లో అక్రమాల గుర్తింపు

ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని ధర్మారం రెవెన్యూ శివారులో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన రాయల్ గార్డెన్–2 ఫామ్‌ల్యాండ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం సందర్శించారు. రాయల్ గార్డెన్–2 ఫామ్‌ల్యాండ్‌లో అక్రమాలపై మంగళవారం 'ఫామ్‌ల్యాండ్ బురిడీ' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. ఈ మేరకు స్పందించిన ఆర్ఐ మల్లికార్జునరావు, ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్‌కుమార్‌లు ఫామ్‌ల్యాండ్‌ను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఫామ్‌ల్యాండ్ కోసం 2016 నుంచి భూమిని కొనుగోలు చేసినట్లుగా డాక్యుమెంట్లను అధికారులకు అందజేశారు. ఫామ్‌ల్యాండ్‌లో డ్రిప్ వేసి, శ్రీగంధం చెట్లు నాటినట్లు అధికారులు గుర్తించారు. నాలా కనెక్షన్ గురించి తెలుసుకుంటామని అధికారులు తెలిపారు.

గ్రూప్–1 దరఖాస్తుల సవరణకు నేడు ఆఖరు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులో తప్పులుంటే సవరణలకు బుధవారం సాయంత్రం 5 గంటల వరకు వీలుందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కమిషన్ వెబ్‌సైట్ https:// www. tspsc. gov. in లో సవరణ చేసుకోవచ్చు. నిర్ణీత సమయం దాటాక సవరణ ఆప్షన్‌ను మూసివేస్తామని పేర్కొన్నారు. గడువు తేదీ తర్వాత, ఎట్టి పరిస్థితుల్లోనూ తదుపరి పొడిగింపు ఉండదని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు కమిషన్ అందిస్తున్న ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

లోకోక్యాబ్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వే ప్రథమం



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి రైల్వే లోకో క్యాబ్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వే మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. పాటియాలాలోని లోకోమోటివ్ వర్క్స్‌లో జరిగిన లోకో క్యాబ్ పోటీల్లో భారతీయ రైల్వేలోని వివిధ జోనల్ రైల్వేల నుంచి 13 లోకోమోటివ్‌లు పాల్గొన్నాయి. ఈ పోటీలో దక్షిణ మధ్య రైల్వేకు చెందిన లాలాగూడ ఎలక్ట్రిక్ లోకోషెడ్, పశ్చిమ రైల్వేకు చెందిన డీజిల్ లోకోషెడ్ సంయుక్తంగా మొదటి బహుమతిని అందుకున్నాయి. రైలు ఇంజిన్‌ను నడిపే సిబ్బందిపై ఒత్తిడిని తగ్గించేందుకు, ఎక్కువ గంటలు పనిచేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఎలక్ట్రిక్ లోకోల క్యాబ్‌లను అభివృద్ధి చేయాలని రైల్వేబోర్డు అన్ని జోనల్ రైల్వేలకు సూచించింది. ఈ మేరకు లాలాగూడలోని ఎలక్ట్రిక్ లోకోషెడ్‌కు చెందిన పదేళ్ల నాటి పాత డబ్ల్యూఏజీ 9హెచ్‌సీ ఇంజిన్‌ను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. సరికొత్త మెటీరియల్, అత్యాధునిక సాంకేతిక అంశాలతో క్యాబ్‌ను విజయవంతంగా అభివృద్ధి చేశారు. క్యాబ్‌లో ఎలాంటి శబ్ద కాలుష్యం లేకుండా నాయిస్ ఐసోలేషన్ ద్వారా 13 డెసిబుల్స్‌కు తగ్గించారు. థర్మల్ ఐసోలేషన్ ద్వారా క్యాబ్ ఉష్ణోగ్రతను 12.4 డిగ్రీలకు తగ్గించారు. సిబ్బంది కూర్చున్నప్పుడు నిర్వహణకు వీలుగా స్విచ్‌లను పునర్వ్యవస్థీకరించారు. అత్యవసర బ్రేక్ వాల్వ్ లోకోపైలట్‌కు అనుకూలంగా ఉండేలా మార్చారు. ఇలా వివిధ అంశాల్లో సాధించిన విజయాల ఆధారంగా ఈ అవార్డు లభించినట్లు అధికారులు తెలిపారు.



నిజమైన సంతోషం అనేది
దాని సహజగుణం కారణంగా అంతటా వ్యాప్తి చెందుతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 27 మార్చి 2024

అసమానతల భారతం

ప్రపంచం ముందుకు పోతోంది... దేశం శరవేగంతో సాగిపోతోంది... అని పాలకులు భుజాలు ఎగరేస్తున్న వేళ కళ్ళు తిరిగే గణాంకాల లెక్క ఇది. అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో కొందరు అంతెత్తున ఉంటే, అనేకులు అధఃపాతాళంలోనే ఉన్నారని తేలింది. భారతదేశంలో ఆదాయం, సంపదల్లో అసమానతలు గడచిన శతాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా తారస్థాయికి చేరాయని 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్' అధ్యయన పత్రం వెల్లడించింది. నోబెల్ బహుమతి గ్రహీత థామస్ పికెట్టీ సహా నలుగురు ప్రసిద్ధ ఆర్థికవేత్తలు రూపొందించిన ఈ పత్రం ప్రపంచంలో అసమానత అధికంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటని తెలిపింది. ఆదాయ అసమానతలో మన దేశం దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాలను సైతం వెనక్కి నెట్టేసింది. బ్రిటీషు పాలనలో కన్నా ఇప్పుడే భారత్‌లో అసమానతలు ఎక్కువయ్యాయట. ఇది ఆందోళన రేపుతోంది. పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది.

'భారతదేశ ఆదాయం, సంపదల్లో అసమానత 1922 – 2023: బిలియనీర్ల రాజ్య ఆవిర్భావం' అనే ఈ పత్రం అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది. 2000ల నుంచి దేశంలో అసమానతలు తారాపథానికి దూసుకుపోయాయి. ప్రస్తుతం దేశ సంపదలో 40 శాతం పైగా కేవలం ఆర్థిక బలసంపన్నులైన అగ్రశ్రేణి 1 శాతం మంది దగ్గరే పోగుబడింది. దేశ ఆదాయం లెక్కన చూస్తే 22.6 శాతం ఈ కొందరి వద్దే ఉంది. ఇక, కింది 50 శాతం జనాభా జాతీయ ఆదాయం మాత్రం 15 శాతమే. వెరసి, గడచిన ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేనట్టు అత్యధిక స్థాయిలో ఒకేచోట సంపద పోగుబడుతోంది. మరో ముఖ్య విషయమేమంటే, భారత్‌లో ఆర్థిక సమాచార నాణ్యత అంతంతే గనక వాస్తవిక అసమానతా స్థాయులతో పోలిస్తే పత్రంలో పేర్కొన్న అంచనాలు ఇంకా తక్కువేనట. పైనున్న వర్గాలు పైపైకి పోతుంటే, కింది వర్గాలు ఇంకా కిందకు పోయేలా ఆర్థిక అసమానతలు పెరగడం ఆందోళన రేపుతోంది. సమాజంలో అశాంతి, అస్థిరత పెచ్చరిల్లే ముప్పుంది.

ఇలాంటి అంతర్జాతీయ నివేదికలే కాదు దేశంలోని స్థానిక నివేదికలు సైతం అసమానతల్ని పట్టిచూపుతున్నాయి. కర్ణాటకలోని ప్రగతివాద బృందాల సమ్మేళనమైన 'బహుత్వ కర్ణాటక' సైతం దేశంలో, ముఖ్యంగా కన్నడ సీమలో పెరుగుతున్న ఆదాయ అసమానతల్నీ, ఉపాధి రంగంలోని ఆందోళనకరమైన ధోరణుల్నీ ఈ మధ్యే తన నివేదికలో వివరించింది. ఆర్థికాభివృద్ధి, ఉపాధి వృద్ధి, ఆదాయ సమానత అంటూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న 'గ్యారెంటీ' ప్రకటనలకూ, క్షేత్రస్థాయి వాస్తవాలకూ మధ్య ఉన్న అంతరాన్ని వెల్లడించింది. నిజానికి, కేంద్రంలోని ప్రస్తుత పాలకులు పదేళ్ళ క్రితం అభివృద్ధి, ఆర్థిక సంస్కరణల అజెండాతో గద్దెనెక్కారు. తమ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ 8.4 శాతం వంతున వృద్ధి చెందిందనీ, ముఖ్యంగా 2023లో ఆఖరి మూడు నెలల్లో అత్యంత వేగంగా ఈ పురోగతి సాగిందనీ వారు జబ్బలు చరుస్తున్నారు. అయితే, వారు అధికారంలో ఉన్న ఈ రెండుసార్లలోనే బీద, గొప్ప తేడా బాగా పెరిగిందనేది ప్రతిపక్షాల ప్రధాన విమర్శ. పైపెచ్చు, ఢిల్లీ సర్కార్ శతకోటీశ్వరులకు సన్నిహితంగా మెలుగుతోందని ఆరోపణలు సరేసరి.

గమనిస్తే 1991నాటి ఆర్థిక సరళీకరణ ఆసరాగా దేశంలో బిలియనీర్ల సంఖ్య పెరిగింది. 1991లో వారి సంఖ్య కేవలం 1 కాగా, 2022 నాటికి 162కు పెరిగిందని ఫోర్బ్స్ పత్రిక కథనం. పికెట్టీ తాజా పత్రం ఫోర్బ్స్‌తో పాటు పలు పత్రికలనూ, ఇతర అధ్యయనాలనూ ఉటంకించింది. అవన్నీ దేశంలో ధనికులకూ, గ్రామీణ నిరుపేదలకూ మధ్య అంతరం పెరుగుతోందని నిర్ధారిస్తున్నాయి. అయితే, ప్రపంచంలో అసమానత అధికంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటనే మాట సత్యదూరమనే వారూ లేకపోలేదు. పికెట్టీ అధ్యయన విధానం పారదర్శకంగా లేదనీ, అసమానతల్ని పెంచి చూపేలా ఫోర్బ్స్ వగైరా నుంచి సంపన్నుల జాబితాలను ఎంచుకుంటున్నారనీ దశాబ్ద కాలంగా విమర్శకుల అభ్యంతరం. అయితే ఎంత ఎక్కువనే మాట పక్కనపెడితే... దేశంలో ఆర్థిక అసమానతలు ఇప్పటికీ గణనీయంగా ఉన్నాయనేది ఎవరూ కాదనలేనిది. వాటిని తగ్గించడానికి ప్రయత్నించడమే కర్తవ్యం.

దారిద్ర్యాన్ని తగ్గించడానికి వీలుగా వృద్ధిపై పెట్టడం వల్ల ఇటు ఆదాయ, సంపదల్లో అసమానతలు పెరిగినప్పటికీ అదే పంథాను అనుసరించాలా అన్నది మరో ప్రాథమిక ప్రశ్న. 1960 – 80ల మధ్య పై శ్రేణిలోని 10 శాతంతో పోలిస్తే, దిగువనున్న 90 శాతం మంది గణనీయంగా వృద్ధి సాధించారు. ఆర్థికసరళీకరణ అనంతరం మాత్రం మిగతా జనాభా కన్నా అగ్రశ్రేణి వర్గమే పైకెదిగింది. ఇక, 2014–2022 నడుమ దిగువ 50 శాతంతో పోలిస్తే, మధ్య 40 శాతం జనాభా వృద్ధి నిదానించింది. అగ్రస్థాయి 10 శాతం వారి పురోగతేమో ఆపలేని వేగం అందుకుంది. ధనిక, పేద తేడాకు ఇది ప్రధాన కారణం. మొత్తానికి గత దశాబ్దిన్నరలోనే అసమానతలు హెచ్చాయనేది నిర్వివాదాంశం.

శతకోటీశ్వరుల సంఖ్య పెరిగిందనే వాస్తవాన్ని గుర్తిస్తే... ఆర్థిక వ్యత్యాసాల్ని చక్కదిద్దడానికి తాజా పత్ర రచయితలు చేసిన కొన్ని విధాన సూచనల్ని కొట్టిపారేయలేం. సంపద పంపిణీ దృష్ట్యా చూస్తే, పేదలతో పోలిస్తే ధనికులు తక్కువ పన్నులు కట్టే ఇప్పటి విధానంలో మార్పు తేవాలి. ఆదాయం, సంపదలు రెంటినీ పరిగణించేలా పన్ను షెడ్యూల్‌ను పునర్వ్యవస్థీకరించి, భారత్‌లోని బిలియనీర్ల పైన సూపర్ ట్యాక్స్ విధించాలని వారు సూచిస్తున్నారు. అలాగే, బీదాగొప్ప తేడాల్ని తగ్గించేందుకు వ్యూహాత్మక దీర్ఘకాలిక విధానాలపై దృష్టి సారించాలి. స్వల్పకాలిక వరాల కన్నా సుస్థిర, దీర్ఘకాల దారిద్ర్య నిర్మూలన పథకరచన సాగించాలి. సంక్లిష్టమైన ఈ వృద్ధి, దారిద్ర్యం, ఆర్థిక అసమానత లాంటి అంశాలపై మరింత లోతైన అధ్యయనం చేయాలి. ప్రజాస్వామ్య భారతం ధనికస్వామ్యంగా మారితేనే కష్టం, నష్టం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.విదియ ప.3.12 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** చిత్త ప.2.41 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.8.44 నుండి 10.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.1142 నుండి 12.30 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.40 నుండి 9.23 వరకు

సూర్యోదయం: 6.02
సూర్యాస్తమయం: 6.07
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

ఆప్ ముందున్న అసలు సవాలు

విశ్లేషణ



ఆశుతోష్

మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కావడం పరిహాసాస్పదం! అవినీతి వ్యతిరేక ఉద్యమంలో నుంచి నాయకుడిగా ఎదిగి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని స్థాపించిన కేజ్రీవాల్ భారత రాజకీయాల్లో ఒక ఆశాకిరణంగా కనబడ్డారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ ఐసీయూలో ఉందంటే దానికి కారణం కేజ్రీవాల్. అలాంటిది... ఇప్పుడు ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడమే ఆప్ ముందున్న పెద్ద సవాలు. రెండవ వరుస నాయకులను ఎదగనివ్వకపోవడం ఆప్ వైఫల్యాలలో ఒకటి. ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ జైలు నుండే నడుపుతారని ఆప్ చెబుతోంది. ఈ వాదన ఆచరణలో నిలబడదు. చివరకు ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించేలా కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను అమలు చేయడానికి ఇది తగిన సందర్భమయ్యే ముప్పుంది.

ఇది ఎంత పరిహాసాస్పద విషయం! అవినీతి వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన వ్యక్తి ఇప్పుడు అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్నారు. మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

పార్టీ నిలబడేనా?

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఆప్, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఢిల్లీలో పోటీ చేయాలని నిర్ణయించుకున్న తర్వాత జరిగిన కేజ్రీవాల్ అరెస్టు ఉదంతం... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం గణనీయ స్థాయిలో రిస్క్ తీసుకున్నట్లు చూపిస్తోంది. ఈడీ చర్య వెనక్కి తన్నడమే కాదు, ఆఖరికి ఢిల్లీలో బీజేపీ ఎన్నికల అవకాశాలను దెబ్బతీసే అవకాశం కూడా ఉంది. అయినప్పటికీ అవినీతికి వ్యతిరేకంగా పోరాడటంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోగల దూతగా తనను తాను చూపించుకోవాలనే నరేంద్ర మోదీ గేమ్ ప్లాన్‌లో భాగంగానే ఈ అరెస్టు జరిగినట్టు తెలుస్తోంది. తాను ప్రధాని అయినప్పటి నుండి మోదీ... తాను అవినీతికి పాల్పడని వ్యక్తిగానే కాదు, ఇతరులను కూడా అలా చేయడానికి అనుమతించనివాడిగా తన ఇమేజ్‌ను ఒక తెలివిడితో నిర్మించుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ సహా ప్రతిపక్షాలను అవినీతిలో కూరుకుపోయిన రాజకీయ పార్టీల సమాహారంగా చిత్రీకరించడానికి ఆయన ఏ మార్గాన్నీ వదిలిపెట్టలేదు. ఎన్నికలు సమీపంలో ఉన్న కాలంలోనే ఇద్దరు ముఖ్యమంత్రులను (జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్, ఢిల్లీలో కేజ్రీవాల్) అరెస్టు చేయడం చూస్తే, అవినీతి అనేదాన్ని ఎన్నికల్లో పెద్ద అంశంగా మోదీ కోరుకుంటున్నారని రుజువు. ఈ వ్యూహం విజయవంతమవుతుందో లేదో కానీ, కేజ్రీవాల్ అరెస్ట్ మాత్రం కచ్చితంగా ఆప్‌కు అస్తిత్వ సంక్షోభాన్ని సృష్టించే అవకాశం ఉంది.

అవినీతికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం తాలూకు పరిణామం ఆమ్ ఆద్మీ పార్టీ. రాజకీయ పార్టీని ప్రారంభించడానికి ముందు దాని నాయకులకు క్రియాశీల రాజకీయాల్లో అనుభవం లేదు. ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా కాకుండా, ఆప్‌కి వెనక్కి మరలడానికి సంస్థాగత స్మృతి లేదు. పైగా ఇంతటి సంక్షోభాన్ని ఎదుర్కొనే సంస్థాగత పటిష్ఠత కూడా దానికి లేదు. ఇటువంటి సంక్షోభాలు తరచుగా ఇతర నాయకులను ముందు వరసలోకి నెడుతుంటాయి. కానీ ప్రస్తుతానికి, ఇది ఆప్‌కు అసంభవంగా కనిపిస్తోంది. కేజ్రీవాల్ లేనప్పుడు శూన్యతను భర్తీ చేయగల మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ ఇప్పటికే నిర్వీర్యులై జైలులో మగ్గుతున్నారు. ఈ ముగ్గురూ లేకపోవడంతో పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆఫీస్ బేరర్లు, క్యాడర్‌లందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడు ఎవరూ లేకుండాపోయారు. రెండవ



మద్యం కుంభకోణంలో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

వరుస నాయకులను ఎదగనివ్వకపోవడం ఆప్ అతిపెద్ద వైఫల్యాలలో ఒకటి. పార్టీ కేజ్రీవాల్ చుట్టూ కేంద్రీకృతమై నడిచింది. ఎవరికీ స్వయంప్రతిపత్తి, స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం లేదు.

పోరాట యోధుడు

అయితే, ఆమ్ ఆద్మీ పార్టీ దాని ప్రారంభం నుండి పోరాట పటిమను కలిగి ఉంది. ఇది అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిత్వానికి ప్రతిబింబం. భారత రాజకీయాలలో సంక్షోభాలను ఎదుర్కోవడాన్ని ఆనందించడమే కాదు, మోదీలా అందరినీ ఏకతాటి మీదకు తెచ్చే నాయకుడు కేజ్రీవాల్. ఆయన్ని ఇష్టపడవచ్చు లేదా ద్వేషించవచ్చు, కానీ ఎప్పుడూ విస్మరించలేం. ఆయన మేధావితనం లక్ష్యం కోసం ఒకే దీక్షగా సాగిన సాధనలో ఉంది. ఆయన ఫీనిక్స్ పక్షిలా బూడిద నుండి లేచే అరుదైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు. ఆయన అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమ రూపశిల్పి. అది మొత్తం రాజకీయ వ్యవస్థను కదిలించింది, కాంగ్రెస్ పార్టీ పతనానికి దారితీసింది. ఈరోజు కాంగ్రెస్ పార్టీ ఐసీయూలో ఉందంటే దానికి కారణం కేజ్రీవాల్. అయితే, కేజ్రీవాల్ సృష్టించిన పరిస్థితిని బీజేపీ నేర్పుగా ఉపయోగించుకుని కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

2014లో 49 రోజుల అధికారం తర్వాత కేజ్రీవాల్ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసినప్పుడు ఆయన రాజకీయ జీవితం పట్ల అనేక సంస్మరణ గీతాలు రాసేశారు. ఆ తర్వాత, 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆప్ మొత్తం ఏడు స్థానాలను కోల్పోయింది. దీంతో 2015లో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ గెలుపొందుతుందనే ఆశను ఆఖరికి దాని నాయకులు కూడా కోల్పోయినప్పుడు ఇది జరిగింది: అపూర్వమైన తీర్పుతో పార్టీ తిరిగి పుంజుకుని, 70 అసెంబ్లీ సీట్లలో 67 గెలుచుకుంది. కేజ్రీవాల్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలతో కనెక్ట్ అవ్వడం వల్ల ఇది సాధ్యమైంది. కానీ నేడు పార్టీ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, దానిని నడిపించడానికి ఆయనకు స్వేచ్ఛ లేదు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)లోని నిబంధనలతో ఆయనపై అభియోగాలు మోపారు. బెయిల్ అంత సులభం కాదు. పైగా ఆయన నెలలపాటు జైలులో గడపవలసి ఉంటుంది.

రాజీనామా చేయడమే మేలు!

ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడమే ఆప్ ముందున్న మొదటి, అతిపెద్ద సవాలు. అయితే ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ జైలు నుండే నడుపుతారని ఆప్ చెబుతోంది. ఈ వాదన మంచి వాక్చాతుర్యానికి పనికొస్తుందికానీ, ఆచరణలో నిలబడటానికి చట్టపరమైన ప్రాతిపదికలు లేవు. కేజ్రీవాల్ తన సహచరుల్లో ఎవరినీ విశ్వసించరనీ లేదా రాజ్యాంగ చట్రంపై ఆయనకు అంతగా అవగాహన లేదనీ సూచిస్తూ, పార్టీలోని అంతర్లీన బలహీనతను ఇది బహిర్గతం చేస్తుంది. ఒక ముఖ్యమంత్రి ప్రభుత్వం మొత్తానికి మూలాధారం. కానీ ఆయనే జైలులో ఉంటే, అన్ని ఆచరణాత్మక ప్రయోజనాల కోసం పరిపాలనను నడపలేరు. ఈ స్థితిని చేపట్టడం అంటే బీజేపీ,మోదీ ప్రభుత్వం చెప్పుచేతల్లో ఆడటమే అవుతుంది. ఇది రాజ్యాంగ విచ్ఛిన్నానికి దారి తీస్తుంది. ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను అమలు చేయడానికి తగిన సందర్భం అవుతుంది. మాజీ ముఖ్యమంత్రులు లాలూప్రసాద్ యాదవ్, జయలలిత అరెస్ట్ అయినప్పుడు చేసినట్టుగానే కేజ్రీవాల్ రాజీనామా చేసి, తాను లేనప్పుడు సీఎం కాగల కొత్త నాయకుడిని పార్టీ ఎన్నుకోనివ్వాలి. హేమంత్ సోరెన్ కూడా అరెస్టు కావడానికి ముందు, తన స్థానంలో చంపయీ సోరెన్‌కు మార్గం సుగమం చేశారు.

అలా కాదంటే, ఆప్ ప్రస్తుత వ్యూహానికి ఎదురుదెబ్బ తగులుతుంది. పైగా ఢిల్లీకున్న డీమ్డ్ రాష్ట్ర హోదాను ఉపసంహరించుకునే పరిస్థితికి కూడా దారితీయవచ్చు. పైగా అది ఎన్నుకున్న ప్రభుత్వం లేదా అసెంబ్లీ లేకుండా 1993 పూర్వ స్థితికి తిరిగి వెళ్లవచ్చు. అది ఆమ్ ఆద్మీ పార్టీకి విపత్తే అవుతుంది.

ఆప్ ఆవిర్భావం ఒక ఆశాకిరణమై, భారత రాజకీయాల్లో ఆదర్శవాదం తిరిగి వచ్చినట్లు ప్రశంసలు పొందింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు జాతీయ ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించే అవకాశం ఉండింది. ఆప్ పాత భవనాన్ని ధ్వంసం చేసి కొత్త రాజకీయ నిర్మాణాన్ని నిర్మించాలనే చిత్తశుద్ధితో పాత వ్యవస్థ తిరస్కరణను ప్రబోధించింది. కానీ అయ్యో, దానికి చరిత్రపై స్పృహ లేకపోవడం, దేశాన్ని పునర్నిర్మించాలనే దృక్పథం లేకపోవడం వల్లే ఆప్ ఈనాటి నిరాశకు కారణమైంది.

వ్యాసకర్త 'ఆప్' మాజీ సభ్యుడు, పత్రికా సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సరైన పని



ఇండియా సరైన పని చేస్తోంది. తమ జాతీయ సార్వభౌమత్వాన్ని నిలుపుకోవడంలో ఫిలిప్పీన్స్‌కు మద్దతిస్తోంది (చైనా విషయంలో).

– సనా హాశ్మీ, ఫెలో

దారుణం



నేను బాల్టిమోర్ (యూఎస్) ప్రాంతంలో నివసించేవాడిని. ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన నాకు బాగా తెలుసు. ఇది చాలా ఘోరమైన విషాదం. (సరుకుల ఓడ ఢీకొట్టడంతో 2.6 కిలోమీటర్ల పొడవైన వంతెన కూలిన నేపథ్యంలో).

– రాబర్ట్ మెలోనీ, శాస్త్రవేత్త

ఈ కాలంలోనా?



బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ తన భర్త కునాల్ ఖేము, ఆరేళ్ల కూతురితో హోలీ జరుపుకొన్నట్టు పెట్టిన ఫొటోలకు చాలామంది ఇస్లామిస్టులు దూషిస్తూ కామెంట్లు పెట్టారు. ఆమెను ఏకంగా ముశ్రిక్' (బహుదేవతారాధకురాలు అని అర్థం) అని నిందించడమే కాకుండా, ఒక హిందువును ఎలా పెళ్లాడావని ప్రశ్నించారు.

– దివాకర్ దత్తా, జర్నలిస్ట్

పోటీగా ఆడాల్సిందే!



నా లెక్కలో ఇప్పటికిప్పుడు టీ20 ప్రపంచ కప్ ఆడే భారత జట్టులో నలుగురే నిశ్చితం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, బుమ్రా. మిగతా అన్ని స్థానాలకూ ఎక్కువమంది పోటీలో ఉన్నారు. అంటే ఈ ఐపీఎల్‌లో పోటీ మరింత తీవ్రంగా ఉండాలి!

– అయాజ్ మెమన్, క్రీడా వ్యాఖ్యాత

కొందరికే మేలు



ఆకర్షించిన కథనం: ఇప్పుడు ఆసియా బిలియనీర్ల రాజధాని ముంబయ్. 'హురూన్ రీసెర్చ్ గ్లోబల్ రిచ్ లిస్ట్' ప్రకారం, బీజింగ్(91) కంటే ఎక్కువమంది బిలియనీర్లు ముంబయి(92)లో ఉన్నారు. ఇక్కడ గమనించాల్సింది: 1 శాతం ధనవంతులు 40 శాతం సంపదను నియంత్రిస్తున్నారు. శ్రీమంతుల రాజ్యం అనేది వినడానికి బాగుంటుంది కానీ అది కొందరి దగ్గరే సంపద పోగుపడటం!

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

అరెస్ట్ అయితే చాలా?



దోషిగా తేలకుండానే, కేవలం అరెస్ట్ అయినంత మాత్రానే ఒక ముఖ్యమంత్రి రాజీనామా చేయాల్సివస్తే గనక కేంద్ర ప్రభుత్వం ఏ ముఖ్యమంత్రినైనా కేవలం ఒక్క రోజు కోసం అరెస్ట్ చేసి ఎవరినైనా పదవీచ్యుతుడిని చేయగలదు. అది పిచ్చితనం అవుతుంది. కాబట్టే అరెస్ట్ అయితే రాజీనామా చేయడం అనేది చట్టబద్ధం కాదు (అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ నేపథ్యంలో).

– శివమ్ శంకర్ సింగ్, రచయిత

ఒక జాగ్రత్త



ప్రియమైన స్కూళ్లకు వెళ్లే అమ్మాయిలూ! బ్యాక్‌ప్యాక్ అనేది మీ బ్యాక్(వీపు) మీదే ఉండాలి కానీ పిరుదుల మీదకు దిగకూడదు. శరీర భాగాలను దాయడం అనేది అబ్బాయిల, పురుషుల నుంచి మంచి ప్రవర్తన అనిపించుకుంటుందేమోగానీ, అది దీర్ఘకాలంలో వెన్ను, మెడ, తల నొప్పులకు కారణం అవుతుంది.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇన్ బాక్స్

నాటకం అతి ప్రాచీనం

'కావ్యేషు నాటకం రమ్యం' అని ఆర్యోక్తి. ఇది భారతీయ సాహిత్యపు రమణీయ వాక్యం. ఇది కావ్యాలలో నాటకానికి ఉన్న ప్రాధాన్యతనీ, ప్రాచుర్యాన్నీ వివరిస్తుంది. 1961 మార్చి 27న వియన్నాలో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారు 'ప్రపంచ రంగస్థల దినోత్సవా'న్ని నిర్వహించాలని ప్రతిపాదించారు. ఆ మరుసటి ఏడాదే ఫ్రాన్స్‌లో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. నాటకాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం, ప్రజలకు నాటక ప్రాముఖ్యం మీద అవగాహన కలిగించడం, విస్తృత స్థాయిలో నాటక రంగ సంస్థలను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కలిగించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

రంగస్థల దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో విస్తరించి ఐక్యరాజ్య సమితి, యునెస్కో వంటి సంస్థల ఆమోదం పొందింది. ఈ వేడుకలలో భాగంగా వివిధ దేశాలలో ప్రదర్శించే నాటక ప్రదర్శనలు, ప్రక్రియల ప్రమాణాలను గూర్చి పరిశీలకులు, నాటక మేధావులు సమీక్షిస్తారు. ప్రతి సంవత్సరం నాటకరంగంలో నిష్ణాతులైన ఒకరిని సమన్వయకర్తగా ఎంపిక చేసి, నాటక రంగంపై వారి మనోగతాన్ని ఆ సంవత్సరపు సందేశంగా రంగస్థల ప్రపంచానికి అందిస్తారు.

నాటక కళ వివిధ దేశాల్లో ఏ ప్రేరణా, ప్రమేయం లేకుండా విడివిడిగా అభివృద్ధి చెందిన కళా ప్రక్రియ. నాలుగో శతాబ్దంలో 'ది పెర్షియన్స్' అనే నాటికను గ్రీకులు ప్రదర్శించారనీ, ప్రపంచంలో మొట్టమొదటి నాటకాన్ని ఏథెన్స్ నగరంలో 'డైనోసిస్' అనే థియేటర్‌లో ప్రదర్శించారనీ చరిత్రకారులు భావిస్తారు. భారతదేశంలో క్రీ.పూ. నాల్గవ శతాబ్దంలో భరతముని రాసిన నాట్యశాస్త్రమే నాటకానికి స్ఫూర్తి అనే వాదన ఉంది. భారతీయ రంగస్థలం ఋగ్వేద కాలం నాటిదని కొందరి అభిప్రాయం. క్రీ.శ. 80 – 150 కాలానికి చెందిన అశ్వఘోషుడు సంస్కృతంలో రచించిన 'సారిపుత్ర ప్రకరణం' తొలి నాటకంగా భావిస్తున్నారు.

– ర్యాలి ప్రసాద్, కాకినాడ
(నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం)

మరోసారి అవకాశం ఎందుకివ్వాలి?

అభిప్రాయం



డా॥ జి. వెన్నెల గద్దర్

ఎన్నికల కోడ్ రానే వచ్చింది. వలస పక్షులు ఇప్పుడిప్పుడే గూళ్లను వెతుక్కుంటూ కుదుట పడుతున్నాయి. అలాగే బీజేపీ కూటమి 400 లోక్‌సభ సీట్లు గెలిచి అధికారంలోకి రావాలని కోరుకుంటోంది. అయితే ఆ పార్టీని ఎందుకు గెలిపించాలి?

అధికారంలోకి రాక ముందు రూ. 370 ఉన్న గ్యాస్ సిలెండర్ అమాంతంగా 2022 నాటికి 1,200 రూపాయలైంది. అరవై రూపాయలున్న పెట్రోల్–డీజిల్ రేట్లు 110 కి పెంచి... గత వారంలో గ్యాస్ ధర రెండు రూపాయలు తగ్గించి భారీ వితరణ చాటుకున్నట్లు మోదీ చూపుతున్నారు. పది సంవత్సరాల క్రితం ఇతర దేశాల్లో ఉన్న నల్ల డబ్బు తెచ్చి ఒక్కో మనిషికి 15 లక్షలు ఇస్తానన్న సంగతి మరచి పోయారు. కేంద్ర విశ్వవిద్యాలయాలలో, పేరెన్నిక గల సంస్థలలో ఉద్యోగ క్షీణత నలభై శాతం దాటింది.

రాజ్యాంగం నుండి లౌకికవాదాన్ని తొలగిస్తారన్న భయాన్ని తొలగించలేదు. స్వతంత్ర భారత్ 67 ఏళ్ళ అప్పులు 55 లక్షల కోట్లు ఐతే... మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన 80 లక్షల కోట్ల అప్పుల గురించి మాట్లాడరు. మూతపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థల గురించి ఏనాడూ చింతించలేదు. గిట్టుబాటు ధరలు లేక ప్రతిరోజు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా చీమ కుట్టినట్లు లేదు.

దేశంలో ఓబీసీల్లో 983 కులాలకు ఐదేండ్లుగా ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రయోజనాలు అందటం లేదు. నిరుద్యోగం 8.4 శాతం పెరిగింది. మోదీ ఏదో చేస్తున్నారన్న భ్రమ నుంచి ప్రజలు బయట పడాలి. బహుజనుల లోని అన్ని కులాలు ఏక తాటిపైకి వచ్చి రాజకీయంగా బలపడాలి. దేశ జనాభాలో 54 శాతం బీసీలే ఉన్నప్పటికీ రాజకీయాల్లో మాత్రం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం బాధాకరం.




ఇక మోదీ భక్తుల చూపంతా దేవుడు, భవ్య రామ మందిరం, మతం, కులం, హలాల్, హిజాబ్, మసీదు, జట్కా, ఆవు, పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ వంటి వాటిపైనే! ఆంధ్రలో బీజేపీకి ఏమాత్రం బలం లేకపోయినా చంద్రబాబు నాయుడు ఆరు ఎంపీ సీట్లు, పది ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారు. టీడీపీలో ఉన్న ముస్లిం సోదరులు ఇప్పటికైనా కళ్ళు తెరవాలి. ఒక్కసారి బీజేపీ పరిపాలిస్తున్న రాష్ట్రాలను చూడండి. ముస్లిం మహిళలను ఎంత ఇబ్బంది పెట్టారో తెలుస్తుంది. హత్రాస్, బిల్కిస్ బానో కేసు విషయంలో, రెజ్లర్ల లైంగిక వేధింపుల విషయంలో బీజేపీ ధోరణి చూస్తూనే ఉన్నాము. బీజేపీ నేతలు తమకు 370 సీట్లు సొంతంగానే వస్తాయంటున్నారు. ఆర్టికల్ 370 రద్దు విషయాన్ని స్ఫురణకు తెస్తూ సొంతంగా 370 వస్తాయంటూ ఊదర గొడుతున్నారు. కేవలం ప్రతి పక్షాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ కొట్టడానికి చేస్తున్న వ్యాఖ్యలు తప్ప వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నం అని రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారందరికీ తెలిసిందే.

ఉత్తర భారతంలో రాష్ట్రాల పరిస్థితి గమనిద్దాం. రామమందిర నిర్మాణం చేశాం కాబట్టి 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌తో పాటూ మిగతా రాష్ట్రాల్లోనూ తమకే ప్రజలు పట్టం కడతారని బీజేపీ ఆశ. కానీ ప్రజలు గుడిని చూసి ఓటేసే పరిస్థితి లేదు. ఈ పదేళ్లలో అభివృద్ధి లేమి వల్ల ముసురుకొన్న సమస్యలే మోదీని ఓడిస్తాయి. యువత నిరుద్యోగంతో అల్లాడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల 60 వేల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే 50 లక్షల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పేదరికం తగ్గకపోగా ఉచిత బియ్యం పొందే జనాభా పెరిగింది. పులి మీద పుట్రలా నిత్యావసరాల ధరల పెరుగుదల జనాగ్రహానికి కారణమవుతున్నది. ఇక బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బెంగాల్, ఢిల్లీల్లో ఎదురు గాలి వీస్తున్న మాట నిజం. ఈ అన్ని పరిస్థితుల దృష్ట్యా చూసినప్పుడు ఈసారి భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తుందా లేదా అనేది ఊహించవచ్చు.

వ్యాసకర్త కాంగ్రెస్ నాయకురాలు

సమత్వ సాధన

అహంకారంతో నేను గొప్పవాణ్ణి అని విర్రవీగే వారికి సమాధానంలా గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు 'సమత్వం యోగ ఉచ్యతే' (2–48) – సమత్వమే యోగం అని నిర్వచించాడు. విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణుని యందు, గోవునందు, ఏనుగునందు, కుక్క యందు, కుక్క మాంసం వండుకొని తినేవాని యందు సమదృష్టి కలవాడే పండితుడని ఎలుగెత్తి శ్రీకృష్ణుడు చాటి చెప్పారు.



జ్యోతిర్మయం

సర్వ ప్రాణుల యందు తన (ఆత్మ)ను దర్శించి సమభావంతో చూసినవాడు యోగి శ్రేష్ఠుడు అని పదేపదే గీతలో అంటున్నారు శ్రీకృష్ణ భగవానుడు. ఇంతకన్నా సమతా ప్రబోధము ఇంకేముంటుంది! మానవాళి సంఘజీవనానికి దోహదపడే గీతలోని ఆత్మతత్వము అవగతం అయితే మానవ లోకమంతా కుటుంబంలా జీవిస్తుంది. అంతే కాకుండా తోటి మానవాళి పట్ల, కాదు కాదు సకల ప్రాణికోటి పట్ల వ్యవహరించాల్సిన తీరును కృష్ణ పరమాత్మ ఇలా బోధించారు. 'శత్రువు పట్ల, మిత్రుని పట్ల సమభావం కలవాడు తనకు ఇష్టమైన వాడని భగవానుడు గీతలో అంటున్నారు.

యుద్ధరంగంలో సారథిగా రథంతోలే పని చేపట్టినా, యుద్ధం ముగియగానే గుర్రాలను శుభ్రం చేసే పని చేస్తున్నా, ధర్మరాజు రాజసూయ యాగంలో అతిథుల పాదాలు కడిగే పని చేపట్టినా... గర్వం లేని కర్మయోగి శ్రీకృష్ణ పరమాత్మ లోకానికి చేసే సేవలో భాగంగానే ఈ పనులను చూడాలి అంటారు తన ఉపన్యాసాలలో శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామీజీ. చేసే పని చిన్నదా? పెద్దదా? గొప్ప వృత్తా? నీచ వృత్తా? అనే దృష్టి విడిచి సమత్వాన్ని ప్రదర్శించిన శ్రీకృష్ణుని ఆచరణ మానవ జాతి అంతటికీ అనుసరణీయం. పుట్టిన జాతి, కులాలను బట్టి గాక, తన సదాచారం వలన వ్యక్తి వందనీయుడు, పూజనీయుడు అవుతాడని శ్రీకృష్ణుని జీవితం ద్వారా, భగవద్గీత సందేశం ద్వారా గ్రహించవచ్చు.

– సాకి

రాష్ట్రంలో ఓటర్లు 3.3 కోట్లు

సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,30,13,318కు పెరిగింది. అందులో 1,64,14, 693 మంది పురుష ఓటర్లు, 1,65,95,896 మంది మహిళా ఓటర్లు, 2,729 మంది ట్రాన్స్‌జెండర్లు న్నారు. ఈనెల 15న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగా, ఆలోగా వచ్చిన ఓటర్ల తొలగింపు (ఫారం-7) దరఖాస్తులు, దిద్దుబాటు (ఫారం-8) దరఖాస్తులను ఈనెల 25లోగా పరిష్కరించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గడువులోగా 9,14,354 ఫారం-7 దరఖాస్తులు, 7,31,573 ఫారం-8 దరఖాస్తులను పరిష్కరించగా, రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3.3 కోట్లకు పెరిగినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్ల నమోదు (ఫారం-6), ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఓటు బదిలీ (ఫారం-8) దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. గడువులోగా దరఖాస్తు చేసుకున్న వారికి మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసే హక్కు కల్పించనున్నారు. రాష్ట్రంలో సర్వీసు ఓటర్లు 15,472 మంది, 18–19 ఏళ్ల యువ ఓటర్లు 8,72,116 మంది, 85 ఏళ్లు ఆపై వయసు ఉన్న ఓటర్లు 1,93,489 మంది, దివ్యాంగ ఓటర్లు 5,26,286 మంది, ప్రవాస ఓటర్లు 3,409 మంది ఉన్నారు.

డీసీఏ ల్యాబ్‌కు ఎన్‌ఏబీఎల్ అక్రెడిటేషన్

డీసీఏ డీజీ కమలాసన్ రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మిని స్ట్రేషన్ ల్యాబ్‌కు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలి బ్రేషన్స్ లేబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) అక్రెడిటేషన్ సర్టిఫికెట్ దక్కింది. ఈ విషయాన్ని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. డ్రగ్ కంట్రోల్ లేబొరేటరీలో నిర్వహించే నాణ్యత పరీక్షలు అత్యంత కచ్చితత్వంతో కూడినవి కావడంతో ఈ ఘనత దక్కినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వెంగళరావు నగర్‌లోని ఈ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ల్యాబ్‌లో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్లు, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్లు, జూనియర్ అనలిస్టులు ఉన్నట్టు కమలాసన్‌రెడ్డి తెలిపారు.

కూతురు సమాధి పక్కనే పడుకుని..

ఖననం చేసిన చోటనే గడిపిన తండ్రి



నారాయణపేట రూరల్: భౌతికంగా లేకపోయినా కూతురు జ్ఞాపకాలను మరిచిపోలేని ఓ తండ్రి.. ఆమెను పూడ్చిన చోట రాత్రి పొద్దుపోయే వరకు ఉన్నాడు. వివరాల్లోకి వెళితే..నారాయణపేట జిల్లాకేం ద్రంలోని గోపాల్‌పేటవీధికి చెందిన లక్ష్మీ ప్రణీత సోమవారం హోలీ వేడుకల్లో ప్రమాదవ శాత్తు మినీ వాటర్‌ట్యాంకు కూలి మృతి చెందింది. అయితే ఆమె మృతదేహానికి అదే రోజు సాయంత్రం పట్టణ శివారులోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్య క్రమం పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చిన తండ్రి రమేష్‌యాదవ్ స్నానం చేసిన వెంటనే బయటకు వెళ్లారు. రాత్రి 11.30 గంటలు దాటినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అనుమానం వచ్చి అమ్మాయిని పూడ్చిన స్థలానికి వెళ్లి చూడగా అక్కడే పడుకొని ఉండటంతో కుటుంబసభ్యులు, బంధువులు సముదాయించి ఇంటికి తీసుకొచ్చారు.

కల్వకుంట్ల కన్నారావుపై లుక్ అవుట్ నోటీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: కల్వకుంట్ల కన్నారావుపై సీబీఐ లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. భూ కబ్జా విషయంలో ఆయతోపాటు మరో 38 మందిపై ఈనెల 3న ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. వీరిలో పది మందిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడిగా ఉన్న కన్నారావు విదేశాలకు పారిపోయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయనపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. భూ వ్యవహారం కేసులో లుక్ అవుట్ నోటీసు జారీ అయిన మొదటి వ్యక్తి కన్నారావు కావడం గమనార్హం.

రీల్ కాదు.. 'కాల్' నాయక్!

నాయక్ సినిమాలో మాదిరి వ్యవహరించిన శివారు కమిషనరేట్ ఉన్నతాధికారి



సాక్షి, హైదరాబాద్: రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేసిన 'నాయక్' అనే సినిమాలో.. నాయక్ భాయ్‌గా మారిన కథానాయకుడు ఆ ప్రాంతానికి చెందిన అసాంఘిక శక్తుల్ని, రౌడీలను పిలిచి ఓ మీటింగ్ పెడతాడు. వారిని భయపెట్టి, దండించి వారు చేసిన నేరాలు, అలాగే వారు సంపాదించిన ఆస్తుల వివరాలు తెలుసుకుంటాడు. తర్వాత కొన్ని పత్రాలపై సంతకాలు చేయించడం ద్వారా వారి స్థిర చరాస్తులు అనాథాశ్రమాలకు చెందేలా చేస్తాడు. ఇందుకోసం ఓ స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసుకుంటాడు. ఈ రీల్ సీన్‌తో కొన్ని సారూప్యతలు ఉన్న రియల్ సీన్ ఒకటి గతంలో హైదరాబాద్ శివార్లలో చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. శివారు కమిషనరేట్ అప్పటి ఉన్నతాధికారి.. ఓ పార్టీకి విరాళాలు సేకరించి ఇచ్చేందుకు ఈ తరహా పద్ధతిని అనుసరించారు. నేను సైతం.. అనుకున్న ఈయన కూడా స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) నుంచి అందిన ఫోన్ ట్యాపింగ్ రికార్డుల్ని ఆధారంగా చేసుకున్నారు. పలువురు వ్యాపారులను వేర్వేరుగా తమ ప్రాంతానికి పిలిపించారు. ఎవరి రికార్డులు వారికి వినిపించి 'కప్పం' కట్టేలా చేశారు. ఇందులో ఓ అధికారి నేతృత్వంలోని స్పెషల్ టీమ్ కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది. దీనిపై సిట్ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారని సమాచారం.

టార్గెట్లు నిర్దేశించి మరీ..

ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌ల్లో ఓఎస్డీలుగా పని చేసిన టి.ప్రభాకర్‌రావు, పి.రాధాకిషన్‌రావు ట్యాపింగ్‌లో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా బెదిరింపు వసూళ్లకు, విరాళాల సేకరణకు తెగబడినట్టుగా సిట్ ఇప్పటికే గుర్తించింది. ఓపక్క వీరి వ్యవహారాలు ఇలా సాగుతుండగా.. శివారు ప్రాంత కమిషనరేట్ ఉన్నతాధికారి కూడా తన వంతుగా ఎంతోకొంత చేయాలని భావించారు. ప్రభాకర్‌రావు నుంచి తనకు అందిన ట్యాపింగ్ రికార్డులను విశ్లేషించి, అవతలి వ్యక్తులను సంప్రదించడానికి వీలుగా స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. వీరిలో ఫార్మా వ్యాపారులు, బిల్డర్లు, రియల్టర్లతో పాటు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన వాళ్లూ ఉన్నట్టు సమాచారం. కాగా స్పెషల్ టీమ్‌కు నేతృత్వం వహించిన అధికారి తన సిబ్బందితో ఆయా వ్యాపారులు, బిల్డర్లు, రియల్టర్లు నిర్దేశించిన సమయాల్లో మీటింగ్‌కు వచ్చేలా ఒత్తిడి చేసేవారు. ఇలా వచ్చిన వారితో సమావేశమయ్యే శివారు ఉన్నతాధికారి ట్యాపింగ్ ఆడియోలను వినిపించే వారు. అందులోని సున్నిత, వ్యక్తిగత అంశాలు ప్రస్తావించి వాళ్లు ఇవ్వాల్సిన మొత్తానికి సంబంధించి టార్గెట్లు ఇచ్చేవారు. వారు ఎప్పుడు? ఎలా? ఎవరికి? ఆయా మొత్తాలు చెల్లిస్తారో అప్పటికప్పుడే తెలుసుకునేవారు. ఇక వారి వెంటపడి వసూలు చేసే బాధ్యతల్ని స్పెషల్ టీమ్ ఇన్‌చార్జికి అప్పగించేవారు. కాగా ఇలా వసూలైన మొత్తం ఓ పార్టీకి విరాళంగా అందినట్లు సమాచారం.

తిరుపతన్నకు 'ద్వితీయ శ్రేణి' బాధ్యతలు

నాటి ప్రతిపక్ష నేత, ఆయన కుటుంబీకులతో పాటు మరికొందరు కీలక వ్యక్తులకు సంబంధించిన ఫోన్ల ట్యాపింగ్‌ను ప్రభాకర్‌రావు నేతృత్వంలోని ప్రణీత్‌రావు టీమ్ చేపట్టింది. అయితే ప్రతిపక్ష నేత లేదా ఆ స్థాయిలో ప్రాధాన్యం లేని, ద్వితీయ శ్రేణికి చెందిన వారి నంబర్లు ట్యాప్ చేసే బాధ్యతల్ని తిరుపతన్న తన బృందంతో కలిసి నిర్వర్తించినట్లు సిట్ చెప్తోంది. ఆ వ్యక్తుల్ని, వారి నంబర్లు గుర్తించే బాధ్యతల్ని టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న పి.రాధాకిషన్‌రావు నిర్వర్తించారు. తన టీమ్ ద్వారా ఇతర మార్గాల్లో వివరాలను సేకరించే ఈయన, వాటిని తిరుపతన్నకు అందించేవారు. వీటిపై ప్రభాకర్‌రావుకు సమాచారం ఇచ్చే తిరుపతన్న ట్యాపింగ్ రికార్డులను కూడా ప్రభాకర్‌రావుకే అందించేవారని తెలిసింది. ప్రాథమిక విచారణలోనే ఈ విషయం గుర్తించిన సిట్ అధికారులు తిరుపతన్న నేరాంగీకార వాంగ్మూలంలోనూ దాన్ని పొందుపరిచినట్లు సమాచారం. ప్రభాకర్‌రావు టీమ్ గత ఏడాది కర్ణాటక ఎన్నికల సమయంలో అక్కడి కాంగ్రెస్ నాయకుల ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు సమాచారం. దీనికోసం కొన్నాళ్లు బెంగళూరుతో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండి వచ్చినట్లు తెలిసింది.

పరిచయస్తులకు ప్రభాకర్‌రావు ఫోన్లు!

ప్రస్తుతం అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్‌రావు తనకు పరిచయం ఉన్న పలువురు అధికారులకు ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. ట్యాపింగ్ వ్యవహారంలో తన ఒక్కడినే బాధ్యుణ్ణి ఎలా చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారని సమాచారం. ట్యాపింగ్ జరిగిన సమయంలో తాను రెగ్యులర్ అధికారిని కాదని, పదవీ విరమణ తర్వాత ఎక్స్‌టెన్షన్‌పై ఉన్న ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) మాత్రమే అని చెప్తున్నట్లు సమాచారం. తాను ఓఎస్డీగా ఉన్న సమయంలో నిఘా విభాగాధిపతులుగా పని చేసిన అదనపు డీజీలు, అప్పటి డీజీపీలు సైతం బాధ్యులే అని, వారికి తెలిసే ఎస్ఐబీ కేంద్రంగా వ్యవహారాలు సాగినట్లుగా వాదిస్తున్నారని తెలుస్తోంది. కాగా ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్నల్ని తదుపరి విచారణ నిమిత్తం 5 రోజుల కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోరుతూ పంజగుట్ట పోలీసులు మంగళవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

పుత్రరత్నం లీలలు..

- ట్యాపింగ్ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించి, తన హవా చెలాయించిన ఉన్నతాధికారి పుత్రరత్నం లీలలు తాజాగా బయటకు వస్తున్నాయి. తన తండ్రి పలుకుబడిని వినియోగించి ఇతను తన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని భారీగా విస్తరించుకున్నట్లు తెలు స్తోంది. అంతేకాకుండా శివారు పోలీసులకు మన'శ్శాంతి' లేకుండా చేసినట్లు సమాచారం. నగరం వెలుపల ఇతను ఓ ఫామ్‌హౌస్ ఏర్పాటు చేసుకోగా.. అక్కడి నిర్మాణాలు, జనరేటర్‌తో పాటు నాటిన మొక్కలు సైతం పోలీసుల 'సౌజన్యమే' అని తెలుస్తోంది. ఏదైనా కావాలనుకున్నప్పుడు ఈ పుత్రరత్నం తండ్రికి ఫోన్ చేసి చెప్పేవాడు. ఆయన తన కార్యాలయం ల్యాండ్‌లైన్ నుంచి ఏదో ఒక పోలీసు అధికారికి ఫోన్ చేసి, తన కుమారుడు ఫోన్ చేస్తాడని చెప్పేవారు. ఆ తర్వాత వారికి ఫోన్ చేసే సుపుత్రుడు తన డిమాండ్ చెప్పి పీడించి మరీ నెరవేర్చుకునేవాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇతడికి ఓ డీఎస్పీ స్థాయి అధికారి షాక్ ఇచ్చాడని తెలిసింది. ఈయనకు ఫోన్ చేసిన సుపుత్రుడు ఐదు జేసీబీలు, ఐదు టిప్పర్లు ఫామ్‌హౌస్ వద్దకు పంపాలంటూ హుకుం జారీ చేశారని, దీంతో ఆ డీఎస్పీ 'డబ్బు ఎవరు ఇస్తారు? ఎంత డిస్కౌంట్ కావాలి?' అంటూ ప్రశ్నించడంతో ఫోన్ పెట్టేశారని సమాచారం.

ఎర్రబెల్లిపై ఫిర్యాదు కేసులో విచారణ

- సీఎం, డీజీపీలకు వ్యాపారి శరణ్ చౌదరి ఈ-మెయిల్
- ఎర్రబెల్లి ఆదేశాలతో పోలీసులు తన ఇంటిని ఆయన బంధువుల పేరిట రాయించారని ఆరోపణ
- బెదిరించి రూ.50 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి శరణ్ చౌదరి చేసిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ-మెయిల్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ రవి గుప్తాలకు అందిన ఈ ఫిర్యాదులోని అంశాలపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. ఎర్రబెల్లి ఆదేశాలతో పోలీసు అధికారులు తనను బెదిరించి, తన పేరిట ఉన్న ఇంటిని బలవంతంగా ఆయన బంధువుల పేరిట రాయించారని శరణ్ చౌదరి ఆరో పించారు. ఓ వైపు ఎస్ఐబీ అధికారుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో కొత్త అంశం బయటకు వస్తుండగా, మరోవైపు ఆ కేసుతో సంబంధం ఉన్న పోలీసు అధికారులపై శరణ్ చౌదరి ఫిర్యాదు చేయ డం కలకలం సృష్టిస్తోంది. ఇంటిని రాయించుకోవ డంతో పాటు బెదిరించి రూ.50 లక్షలు వసూలు చేశారని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు.

బూటు కాళ్లతో తన్నారు..

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు.. దయాకర్‌రావు ఆదేశాలతో తనను బూటు కాళ్లతో తన్ని, పలుమార్లు చెంపదెబ్బలు కొడుతూ హింసించినట్టు కూడా శరణ్ చౌదరి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. '2023 ఆగస్టు 21న నేను నా కార్యాలయానికి వెళుతుండగా ప్రైవేటు కారులో సివిల్ డ్రెస్‌లో వచ్చిన పోలీసులు బలవంతంగా సీసీఎస్ ఆఫీస్‌కు తీసుకెళ్లారు. నా కుటుంబానికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఎర్రబెల్లి దయాకర్‌రావు బంధువు విజయ్ పేరిట నా ఇంటిని రిజిస్టర్ చేయాలని అప్పటి హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వ రరావు బలవంతపెట్టారు. మాజీ డీసీపీ రాధాకిషన్ రావు నన్ను బూటు కాళ్లతో తన్నారు. రెండురోజులు అక్రమంగా నన్ను వారి కస్టడీలో పెట్టుకున్నారు. ఆ సమయంలో నా కుటుంబ సభ్యులను డబ్బుల కోసం ఒత్తిడి చేశారు. అప్పుడు నా స్నేహితుడు రూ.50 లక్షలు పంపాడు. చివరకు నా ఇంటిని విజయ్ పేరిట రాసేందుకు అంగీకరించిన తర్వాత నన్ను బయటకు పంపించారు. తర్వాత న్యాయం కోసం నేను హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తే పోలీసులను నా ఇంటి మీదకు పంపారు. రిట్ పిటిషన్ విత్‌డ్రా చేసుకోవాలని బెదిరించారు. ఏసీపీ ఉమామహేశ్వరావు ఒత్తిడి తట్టుకోలేక నేను నా రిట్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నా..' అని శరణ్ చౌదరి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

రాష్ట్రంలో జరుగుతున్న రాజ కీయ పరిణామాలను అడ్డుపెట్టుకుని లబ్ధి పొందడానికే వడ్డేపల్లి శరణ్ చౌదరి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శరణ్ చౌదరి, ప్రవాస భారతీయుడు విజయ్‌కు నడుమ జరిగిన వ్యాపార, రియల్ ఎస్టేట్ లావాదేవీలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఎర్రబెల్లి దయాకర్‌రావు మీడియాతో మాట్లాడారు.

నేడు ఫైనల్!

- మిగిలిన 8 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనున్న కాంగ్రెస్
- ఖర్గే అధ్యక్షతన భేటీ కానున్న కేంద్ర ఎన్నికల కమిటీ
- సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా ఇప్పటికే నిర్ణయం!

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో మిగిలిన 8 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానం బుధవారం అభ్య ర్థుల్ని ఖరారు చేయనుంది. ఇందుకోసం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) మరోమారు భేటీ కానుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో పార్టీ మాజీ చీఫ్‌లు సోనియాగాంధీ, రాహుల్‌తో పాటు కమిటీ సభ్యులు కేసీ వేణుగోపాల్, అంబికాసోనీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు పాల్గొననున్నారు. 8 స్థానాలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర, జిల్లా నేతలు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల అభిప్రాయాలను ఏఐసీసీ స్వీకరించింది. వారిచ్చిన సూచనలు, సలహాల మేరకు ఆశావహుల అభ్యర్థి త్వాలను పరిశీలించి తుది జాబితాను సీఈసీకి పంపింది. ప్రజల్లో బలం, కుల సమీకరణలు, పార్టీకి చేసిన సేవల ఆధారంగా అభ్యర్థుల పేర్లను నేతలు సిఫారసు చేశారు. కాగా సీఈసీ వివిధ సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా అభ్యర్థులపై ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

కరీంనగర్ తెరపైకి తీన్మార్ మల్లన్న

ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి తొలి నుంచి మాజీ ఎమ్మెల్యే ఎ.ప్రవీణ్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నప్పటికీ, అక్కడే బీజేపీ నుంచి బండి సంజయ్, బీఆర్ఎస్ నుంచి వినోద్‌కుమార్ పోటీలో ఉన్న నేపథ్యంలో అక్కడ మరో అభ్యర్థిని పరిశీలించాలని ఏఐసీసీ సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తీన్మార్ మల్లన్న పేరును తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, ఇతర రాష్ట్ర నేతలను కలిసిన మల్లన్న కరీంనగర్ నుంచి పోటీకి సానుకూలత వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆయన పేరును సీఈసీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. నిజామాబాద్ నుంచి సునీల్‌రెడ్డి, దిల్‌రాజు తదితరుల పేర్లు పరిశీలించినా, చివరికి టి.జీవన్‌రెడ్డి వైపే నేతల మొగ్గు ఉన్నట్లు తెలుస్తోంది. మెదక్ నుంచి బీసీ వర్గానికి చెందిన నీలం మధుకే ఎక్కువ అవకాశాలున్నాయని, ఆయనకు సీఎం వర్గం బలమైన మద్దతు ఇస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఇక భువనగిరి స్థానానికి అభ్యర్థుల ఎంపిక విషయంలో మాత్రం కొంత సందిగ్ధత కనిపిస్తోంది. ఇక్కడి నుంచి సీనియర్ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు కొన్ని పేర్లను ప్రతిపాదిస్తుంటే, ముఖ్యమంత్రి మాత్రం చామల కిరణ్ కుమార్‌రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఆయనకే టిక్కెట్ దక్కేలా రేవంత్ ఇప్పటికే ఏఐసీసీ కీలక నేతలను ఒప్పించినట్లు తెలుస్తోంది. ఇక ఆదిలాబాద్, హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ స్థానాల్లో ఒకరిద్దరు పేర్లను పరిగణనలోకి తీసుకుని విజయావకాశాల ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేయనున్నారు. గురువారం జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు.

రేవంత్‌తో మహేశ్‌గౌడ్ భేటీ

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్ వేదికగా 29న సాయంత్రం 5 గంటలకు జరిగే టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు, పార్టీ సీనియర్ నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశ ఎజెండాపై చర్చించేందుకు గాను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం సమావేశమయ్యారు. పార్లమెంటు ఎన్నికలు, తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు.

ఏప్రిల్ 6న తుక్కుగూడలో సభ

తుక్కుగూడలో వచ్చే నెల ఆరో తేదీన భారీ బహిరంగసభ నిర్వహించేందుకు టీపీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనజాతర సభకు రాహుల్, ఖర్గే లాంటి కీలక నేతలు రానుండడం, జాతీయస్థాయి మేనిఫెస్టోను విడుదల చేయనుండడంతో టీపీసీసీ ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

తీహార్ జైలుకు ఎమ్మెల్సీ కవిత

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపిన ప్రత్యేక కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ప్రమేయమున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. దీంతో కవితను ఈడీ అధికారులు తీహార్ జైలుకు తరలించారు. ఏప్రిల్ 9 వరకూ జ్యుడీషియల్ కస్టడీ కొనసాగనుంది. రెండోసారి ఈడీ కస్టడీ ముగియడంతో మంగళవారం ఉదయం కవితను ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపరిచారు. ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ ఆన్‌లైన్ ద్వారా వాదనలు వినిపిస్తూ ఈ కేసులో కవిత కీలక కుట్రదారు, లబ్ధిదారు అని ఆరోపించారు. ఇప్పటివరకు ఈడీ జరిపిన విచారణ ఆధారంగా సౌత్ గ్రూప్ లాబీలో కీలకంగా వ్యవహరించిన ఆమె... ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లోని అగ్రనేతలతో కలసి మద్యం కుంభకోణానికి కుట్రపన్నారని తేలిందన్నారు. రూ. 100 కోట్ల లావాదేవీలు, మద్యం విధానంలో మార్పులు, అమల్లో కవిత కీలకపాత్ర పోషించారన్నారు. కవిత చాలా ప్రభావవంతమైన వ్యక్తి అని.. ఆమెను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలు, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందని తద్వారా విచారణకు ఆటంకం కలగొచ్చని వాదించారు. కవిత పాత్రపై ఇంకా పరిశోధించాల్సిన అవసరం ఉందని... నేరంలో చేతులు మారిన మిగిలిన సొమ్ము గురించిన ఆధారాలు వెలికితీస్తున్నట్లు వివరించారు. నేరం ద్వారా వచ్చిన రాబడితో ప్రమేయం ఉన్న లేదా సంబంధం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించనున్నామని, ఆర్థిక నేరాలపై దర్యాప్తు సాధారణ నేరాల దర్యాప్తు కంటే క్లిష్టంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే కవితకు 15 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోరుతున్నామని చెప్పారు.

కుమారుడికి పరీక్షలున్నాయి.. మధ్యంతర బెయిలివ్వండి: కవిత లాయర్

కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా వాదనలు వినిపిస్తూ బెయిల్ పిటిషన్ త్వరగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. మంగళవారం నుంచి కవిత కుమారుడికి వార్షిక పరీక్షలు మొదలుకానున్నందున మధ్యంతర ఉపశమనం కల్పించాలని కోరారు. అలాగే ఈడీ కస్టడీలో నిర్వహించిన వైద్య పరీక్షల వివరా లను అందించాలన్నారు. దీనికి ఈడీ తరఫు న్యాయవాది అంగీకరించారు. అయితే బెయిల్ పిటిషన్‌కు సంబంధించి కౌంటర్ దాఖలు చేయడానికి వారం సమయం ఇవ్వాలని కోర్టును కోరారు. వాదనల అనంతరం కవితను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తున్నట్లు న్యాయమూర్తి కావేరి బవేజా ఆదేశాలు ఇచ్చారు. ఏప్రిల్ 9న ఉదయం 11 గంటలకు కవితను తిరిగి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న విచారిస్తామని, ఈలోగా ఈడీ కౌంటర్ దాఖలు చేయాలన్నారు. కవితకు ఇంటి భోజనం, పరుపు, దుప్పటి, చెప్పులు, బట్టలు, పుస్తకాలు, కలం, కాగితాలు, అవసరమైన మందులను నిబంధనల మేరకు అనుమతించాలని తిహార్ జైలు సూపరింటెండెంట్‌కు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కవితకు మద్దతుగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భర్త అనిల్, కొందరు జాగృతి నేతలు కార్యకర్తలు రౌస్ అవెన్యూ కోర్టుకు వచ్చారు.

ఇది పొలిటికల్ లాండరింగ్ కేసు: కవిత

కోర్టు హాల్లోకి వెళ్లే సమయంలో కవిత జై తెలంగాణ నినాదాలు చేశారు. 'ఇది తప్పుడు కేసు. మనీలాండరింగ్ కేసు కాదు.. పొలిటికల్ లాండరింగ్ కేసు. తాత్కాలికంగా నన్ను జైలులో పెట్టొచ్చు కానీ కడిగిన ముత్యంలా బయటకు వస్తా. ఈ కేసు నిందితుల్లో ఒకరు ఇప్పటికే బీజేపీలో చేరితే మరొకరికి బీజేపీ టికెట్ ఇచ్చింది. మరొకరు బీజేపీకి రూ. 50 కోట్ల నిధులు ఇచ్చారు. జై తెలంగాణ' అని కవిత వ్యాఖ్యానించారు.

న్యాయ విచారణ జరిపించాలి

ఫోన్‌ట్యాపింగ్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై న్యాయవిచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు బాధ్యత వహించాల్సింది ముఖ్యమంత్రే అని, దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులను పక్కన కూర్చోబెట్టుకొని కేసీఆర్ ఈ దుర్మార్గానికి పాల్పడ్డారని ఆరోపించారు. ట్యాపింగ్ సమయంలో డీజీపీగా ఉన్న వ్యక్తి పాత్రపైనా విచారణ జరిపించాలని, రాజకీయ నేతలవే కాకుండా అధికారులు, వ్యాపారస్తుల ఫోన్లు ట్యాప్ చేసి పోలీసులు మాఫియాగా వ్యవహరించారని మండిపడ్డారు. మంగళవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో బీఆర్ఎస్ పాలనలో ఒక వెలుగువెలిగిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. 'కవితపై రాజకీయపరమైన కక్షసాధింపు కేసు అయితే, కేసీఆర్ బహిరంగచర్చకు వచ్చి నిరూపించుకోవాలి. పదేపదే బీజేపీపై బీఆర్ఎస్ నేతలు రాజకీయంగా విమర్శలు గుప్పించడం సిగ్గుచేటు. బీజేపీని విమర్శిస్తే ఊరుకునేది లేదు. కేసీఆర్ కుటుంబం అవినీతిని ప్రజల ముందుంచుతాం' అని కిషన్‌రెడ్డి హెచ్చరించారు. హోలీ సందర్భంగా చెంగిచర్ల స్లాటర్‌హౌస్ దగ్గర గిరిజన మహిళలు వేడుకలు జరుపుకొంటుంటే గుర్తు తెలియని కొందరు వ్యక్తులు, గర్భిణులు, చిన్నపిల్లలపై దాడికి పాల్పడ్డారని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారే తప్ప దోషులపై చర్యలు తీసుకోలేదని, హిందువులపై, పేద మహిళలు, గిరిజన ఆడబిడ్డలపై దాడులు జరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. చెంగిచర్లలో 30 ఏళ్లుగా నేర సామ్రాజ్యం నడుస్తోందని, ఓ పార్టీ అక్కడి గూండాలకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు.

రాష్ట్ర స్థాయి సెల్ ఏర్పాటు చేయాలి

నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు: ఎమ్మెల్యే యెన్నం



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ బాధితులు ఉన్నందున రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ఫిర్యాదు సెల్ ఏర్పాటు చేయాలని డీజీపీ రవిగుప్తాను కోరినట్టు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తన ఫోన్‌ను సైతం ట్యాప్ చేశారని, అందుకు సంబంధించిన కీలక ఆధారాలను డీజీపీకి అందించినట్టు పేర్కొన్నారు. ఈ ట్యాపింగ్ కేసు పరిధిని రాష్ట్ర స్థాయిలో తీసుకుని దర్యాప్తు చేపట్టాలని కోరినట్టు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే యెన్నం మంగళవారం మధ్యాహ్నం లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ రవి గుప్తాకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ప్రభు త్వంలోని కొందరు రాజకీయ నాయకులు, కొందరు పోలీసు అధికారుల అపవిత్ర కలయికతో తెలంగాణను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ వందల మంది ఫోన్లను ఆనాటి జిల్లా మాజీ మంత్రి ఆదేశాలతో కొందరు ఎస్ఐబీ సిబ్బంది ట్యాప్ చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వంలోని సీఎం, మంత్రులు మొదలు ఏ స్థాయి వ్యక్తులు ఉన్నా చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

ట్యాపింగ్ ప్రధాన సూత్రధారి కేసీఆర్

సీబీఐకి కేసు అప్పగించాలని బీజేపీ నేత రఘునందన్‌రావు డిమాండ్



సంగారెడ్డి: ఫోన్ ట్యాపింగ్‌కు ప్రధాన సూత్రధారి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని, ఆయన చేసిన పనికి సీఎం రేవంత్‌తో సహా అమాయకులు బలయ్యారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో మొదటి నిందితుడిగా కేసీఆర్‌ను పరిగణించాలన్నారు. మంగళవారం సంగారెడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ తన హయాంలో ఉన్నతాధికారుల ద్వారా ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసు వ్యవహారంలో అప్పుడు టీడీపీ నేతగా ఉన్న రేవంత్‌రెడ్డిపై ఫోన్ ట్యాపింగ్ చేయించి జైలుకు పంపించారని గుర్తు చేశారు. ఈ కేసులో ఏ1గా ఆయన్ను చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌ను కోరారు. తాను దుబ్బాకలో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు కూడా తన ఫోన్‌తోపాటు కుటుంబసభ్యుల అందరి ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. ఇందులో మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి పాత్ర కూడా ఉందన్నారు. కేసీఆర్ కుటుంబంతో సహా వీరిని కూడా నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారులు, కేసీఆర్‌తోపాటు మరికొందరి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలన్నారు. ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌ను కాపాడేందుకు రాజకీయ కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు.

విమానంలో రేవంత్, హరీశ్‌రావు సయోధ్య ఏంటి ?

ఢిల్లీ అధిష్టానం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మార్చి 19న పిలుపు రాగా, వెంటనే ఆయన ప్రత్యేక విమానంలో బయలుదేరారని తెలిపారు. అదే విమానంలో మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా వెళ్లారన్నారు. రెండు గంటల ప్రయాణంలో ఇద్దరి మధ్య ఎలాంటి సయోధ్య కుదుర్చుకున్నారో బయటకు చెప్పాలని డిమాండ్ చేశారు

నచ్చినోళ్లు జేబులో... నచ్చనోళ్లు జైలులో

బీజేపీతో ఒప్పందం చేసుకుంటే కవిత అరెస్టయ్యేవారా?
ప్రతిపక్షనేతలపై కేంద్రానివి అక్రమ కేసులు
ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ది అక్రమ అరెస్టు
బీజేపీ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/మెదక్: నచ్చినోళ్లు జేబులో ఉండాలి నచ్చనోళ్లు జైలులో ఉండాలి అన్నట్లుగా కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరు ఉందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో బీఆర్ఎస్ ముఖ్య కార్య కర్తల సమావేశంలో హరీశ్‌రావు ప్రసంగించారు. దేశంలో ప్రతిపక్షపార్టీల మీద అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు బీజేపీతో బీఆర్ఎస్ ఒప్పందం చేసుకుని ఉంటే ఈరోజు ఎమ్మెల్సీ కవిత అరెస్టయి ఉండేవారా అని ప్రశ్నించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టును రాహుల్‌గాంధీ ఖండిస్తే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం సమర్థిస్తున్నా రని, రేవంత్‌రెడ్డి బీజేపీ ముఖ్యమంత్రా..? లేక కాంగ్రెస్ ముఖ్యమంత్రా అని నిలదీశారు. రాష్ట్రంలో పంటలు ఎండుతుంటే సీఎం రేవంత్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 180 మంది రైతులు, 38 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటే ఏ ఒక్కరినీ పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు.

చోటే భాయ్‌కి బడే భాయ్ ఆశీర్వాదం

చోటే భాయ్ సీఎం రేవంత్‌రెడ్డి.. బడే భాయ్ మోదీ ఆశీర్వాదం తీసుకున్నారని, బీజేపీ, కాంగ్రెస్‌లు ఒక్కటేనని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఒక్క ముస్లింను కూడా కేబినెట్‌లోకి తీసుకోలేదని విమర్శించారు. మైనార్టీల సంక్షేమ బడ్జెట్‌లోనూ కోత విధిస్తున్నారని, కనీసం రంజాన్ తోఫా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

103 మంది సిట్టింగులకు...
ఈసారి నో టికెట్

అభ్యర్థుల ఎంపికలో బీజేపీ కఠిన నిర్ణయాలు
- మూడో వంతు ఎంపీలకు ఈసారి మొండిచేయి
- ప్రభుత్వ వ్యతిరేకతకు చెక్ పెట్టేందుకే
- 2019లోనూ 119 మంది ఎంపీలకు టికెటివ్వని బీజేపీ

లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయంపై కన్నేసిన అధికార బీజేపీ అందుకోసం తీవ్రస్థాయి కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా టికెట్ల కేటాయింపులో నిర్మొహమాటంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటోంది. గెలుపు అవకాశాలు లేవనుకుంటే ఎవరినైనా పక్కన పెట్టేస్తోంది. ఎంతటి సీనియర్లయినా, ఎంత జనాదరణ ఉన్నా పట్టించుకోవడం లేదు. ఆ క్రమంలో మొత్తం 290 మంది సిట్టింగ్ ఎంపీల్లో ఇప్పటికే ఏకంగా 103 మందికి బీజేపీ టికెట్ నిరాకరించింది...! బీజేపీ ఇప్పటిదాకా ఆరు విడతల్లో 405 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు కూడా రాకముందే మార్చి 2న ఏకంగా 195 మందితో తొలి జాబితాను ప్రకటించడం తెలిసిందే. విపక్ష ఇండియా కూటమి పొత్తులపై, పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ఓవైపు మల్లగుల్లాలు సాగుతుండగానే భారీ జాబితా వెలువరించి దూకుడు కనబరిచింది. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా తదితర కేంద్ర మంత్రులు అందులో చోటుచేసుకున్నారు. తొలి జాబితాలో 33 మంది సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ మొండిచేయి చూపింది. ఇక 72 మందితో ప్రకటించిన రెండో జాబితాలో ఏకంగా 30 మంది సిట్టింగులపై వేటు పడింది! మూడో జాబితాలో 9 మంది, నాలుగో జాబితాలో 15 మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. తర్వాత మార్చి 24న 111 మందితో ప్రకటించిన ఐదో జాబితాలోనైతే 37 మంది సిట్టింగులకు టికెట్లు గల్లంతయ్యాయి! తాజాగా మంగళవారం ప్రకటించిన మూడు స్థానాల్లోనూ సిట్టింగులను పక్కన పెట్టి ఇతరులకు టికెట్లిచ్చింది. వీరిలో కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ కూడా ఉండటం విశేషం. ఈ లెక్కన ఇప్పటికే మూడో వంతుకు పైగా, అంటే 34 శాతం మంది బీజేపీ సిట్టింగులను టికెట్లు దక్కలేదు. మరో 30 నుంచి 40 స్థానాల్లో పార్టీ అభ్యర్థులను బరిలో దించేలా కన్పిస్తోంది. వాటిలోనూ మరింతమంది సిట్టింగులను మార్చడం ఖాయమంటున్నారు! 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా 282 మంది బీజేపీ సిట్టింగుల్లో 119 మందికి టికెట్లివ్వలేదు. అంటే ఏకంగా 42 శాతం మందిని మార్చేసింది! తద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను విజయవంతంగా అధిగమించగలిగామన్నది బీజేపీ అగ్ర నాయకత్వం అభిప్రాయం. అందుకే ఇప్పుడూ అదే వ్యూహాన్ని అనుసరిస్తోంది.



టికెట్లు దక్కని ప్రముఖులు

హర్షవర్ధన్, వరుణ్‌గాంధీ, ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, వీకే సింగ్, అనంత్‌కుమార్ హెగ్డే, రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్, అశ్వినీ చౌబే, ప్రతాప్ సింహా... ఇలా ఈసారి టికెట్లు దక్కని బీజేపీ సిట్టింగుల్లో పలువురు సీనియర్లు, ప్రముఖులున్నారు. వీరిలో కేంద్ర మంత్రి హర్షవర్ధన్ అయితే పార్టీ నిర్ణయంతో తీవ్ర నిరాశకు గురై ఏకంగా రాజకీయాలకే గుడ్‌బై చెప్పేశారు. ఇక ప్రజ్ఞాసింగ్, రమేశ్ బిధురి, అనంత్‌కుమార్ హెగ్డే, పర్వేష్ సాహిబ్‌సింగ్ వంటి ఎంపీలపై వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా వేటు పడింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాల్ అరెస్టును నిశితంగా గమనిస్తున్నాం

అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వ్యాఖ్య

వాషింగ్టన్: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరెస్టుపై అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి స్పందించారు. కేజ్రీవాల్ అరెస్టు అంశాన్ని నిశితంగా గమనిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన పట్ల వచ్చిన ఆరోపణపై నిష్పక్షపాతమైన, పారదర్శకమైన, చట్టపరమైన దర్యాప్తును కోరుకుంటున్నామని వెల్లడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇదే అంశంపై గతవారం జర్మనీ సరిగ్గా ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పుడు, భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే.


అమెరికాలోని బాల్టిమోర్‌లో పటాప్‌స్కో నదిలో నౌక ఢీకొనడంతో పాక్షికంగా కూలిపోయిన వంతెన (ఇన్‌సెట్లో క్లోజప్)

బ్రిడ్జిని ఢీకొట్టిన భారీ నౌక

కుప్పకూలిన వంతెన • నదిలో పడిపోయిన వాహనాలు • కనీసం ఆరుగురు దుర్మరణం!

అమెరికాలోని బాల్టిమోర్‌లో ఘటన
నౌక సిబ్బంది అంతా భారతీయులే
వారి హెచ్చరికలతో తప్పిన పెను ప్రమాదం

బాల్టిమోర్: అమెరికాలో మేరీలాండ్ రాష్ట్రంలోని బాల్టిమోర్ నగరంలో ఘోర ప్రమాదం సంభవించింది. పటాప్‌స్కో నదిలో వాహన కంటైనర్లతో వెళ్తున్న ఓ భారీ నౌక పవర్ ఫెయిల్యూర్‌కు గురైంది. అదుపు తప్పి నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జిని శరవేగంగా ఢీకొంది. దాంతో వంతెన కుప్పకూలింది. దానిపై ప్రయాణిస్తున్న వాహనాలు నీటిలో పడి మునిగిపోయాయి. వాటిలో ప్రయాణిస్తున్నవారు గల్లంతయ్యారు. ప్రమాద సమయంలో బ్రిడ్జిపై గుంతలు పూడుస్తున్న ఆరుగురు సిబ్బంది కూడా నదిలో పడిపోయారు. అధికారులు ఇద్దరిని రక్షించారు. కనీసం ఆరుగురి దాకా గల్లంతైనట్టు తెలుస్తోంది. ప్రమాద స్థలంలో నది 15 మీటర్ల లోతుంది. నీళ్లు కూడా బాగా చల్లగా ఉండటంతో వారంతా దుర్మరణం పాలై ఉంటారని భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి 1.30 దాటాక ఈ దుర్ఘటన జరిగింది. నౌకలోని సిబ్బంది మొత్తం భారతీయులే. నౌక అదుపు తప్పిన వెంటనే వారు హుటాహుటిన ప్రమాద హెచ్చరికలు (మేడే) జారీ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు అప్రమత్తమై వాహనాలేవీ బ్రిడ్జి పైకి వెళ్లకుండా నియంత్రించారు. దానికి తోడు ప్రమాదం జరిగింది అర్ధరాత్రి వేళ కావడంతో బ్రిడ్జిపై ట్రాఫిక్ కూడా భారీగా లేదు.

ఇలా జరిగింది...

ప్రమాద సమయంలో నౌక గంటకు 15 కి.మీ. వేగంతో వెళ్తోంది. పవర్ ఫెయిల్యూర్‌తో అదుపు తప్పి శరవేగంగా బ్రిడ్జికేసి దూసుకొచ్చి దాని తాలూకు పిల్లర్‌ను ఢీకొట్టింది. పిల్లర్ విరగడంతో 2.6 కిలోమీటర్ల పొడవున్న వంతెన ఒక్కసారిగా కుంగిపోయింది. సెకండ్ల వ్యవధిలో పాక్షికంగా కుప్పకూలింది. ఆ వెంటనే నౌకలో మంటలు చెలరేగి దట్టమైన పొగ వెలువడింది. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రమాద వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది కనీవినీ ఎరగని ప్రమాదమని మేరీలాండ్ గవర్నర్ వెస్ మూర్ అన్నారు. ప్రమాద హెచ్చరికకు అధికారులు శరవేగంగా స్పందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారంటూ కొనియాడారు. ప్రమాదం జరిగిన తీరు యాక్షన్ సినిమా సీన్‌ను తలపించిందని బాల్టిమోర్ మేయర్ బ్రాండన్ స్కాట్ అన్నారు. నగరంలో అత్యవసర పరిస్థితి విధించి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పవర్ ఫెయిల్యూరే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తేలినా మరింత లోతుగా దర్యాప్తు సాగుతోంది.

భారత సిబ్బంది క్షేమం

ప్రమాదానికి గురైన నౌక పేరు డాలీ. గ్రేస్ ఓషియన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఈ నౌక ప్రస్తుతతం సినర్జీ మెరైన్ గ్రూప్ నిర్వహణలో ఉంది. ప్రఖ్యాత డెన్మార్క్ షిప్పింగ్ కంపెనీ 'మెర్స్క్'కు చెందిన సరుకుతో బాల్టిమోర్ రేవు నుంచి శ్రీలంక రాజధాని కొలంబోకు వెళ్తుండగా దుర్ఘటన జరిగింది. 985 అడుగుల పొడవు, 157 అడుగుల వెడల్పున్న ఈ నౌకలో ఇద్దరు పైలట్లు సహా మొత్తం 22 మంది సిబ్బందీ భారతీయులేనని సినర్జీ మెరైన్ గ్రూప్ వెల్లడించింది. వారంతా క్షేమంగానే ఉన్నారని పేర్కొంది. ప్రమాదం నేపథ్యంలో అమెరికా తూర్పు తీరంలో అత్యంత బిజీ ఓడరేవుల్లో ఒకటైన బాల్టిమోర్‌కు నౌకల రాకపోకలు కనీసం కొద్ది నెలల పాటు స్తంభించనున్నాయి. గతేడాది బాల్టిమోర్ రేవు గుండా ఏకంగా 5.2 కోట్ల టన్నుల మేరకు సరుకు, దాదాపు 5 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలు జరిగాయి! పోర్టుకు నౌకల రాకపోకలను వీలైనంత త్వరగా పునరుద్ధరిస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. దుర్ఘటన ఉగ్రవాద చర్య కాదని స్పష్టం చేశారు.

ఎలక్షన్ బీట్

వడగాడ్పులతో జాగ్రత్త

- పోలింగ్ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయండి
- ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రాలకు ఈసీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి– జూన్ మధ్య వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండనుందంటూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) జారీ చేసిన హెచ్చరిక నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) అప్రమత్తమయింది. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఈసీ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు మంగళవారం లేఖలు రాసింది. పోలింగ్ స్టేషన్లలో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, ఇతర వసతులకు సంబంధించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సీఈసీ కోరింది. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, సరైన నీడ, మెడికల్ కిట్ వంటివి తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలంది. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు వీలుగా భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక ప్రవేశాలు, నిష్క్రమణలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. పోలింగ్ స్టేషన్లలో తాగునీటి కోసం కుళాయిని ఏర్పాటు చేయాలని, 'పర్యావరణ అనుకూల'డిస్పోజబుల్ గ్లాసులను అందుబాటులో ఉంచాలని కోరింది. పోలింగ్ సిబ్బందితోపాటు ఓటర్లకు అవసరమైన పక్షంలో వాడుకునేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం ఉంచాలని తెలిపింది. పోలింగ్ ఏజెంట్లు, సీనియర్ సిటిజన్లు, గర్భిణీలకు సరైన ఫర్నిచర్ ఉండేలా చూసుకోవాలని పేర్కొంది. పోలింగ్ స్టేషన్లలో స్త్రీ, పురుష ఓటర్లకు తగిన సంఖ్యలో ప్రత్యేక టాయిలెట్‌లు ఉండాలని ఈసీ ఆదేశించింది. రోజంతా టాయిలెట్లలో పరిశుభ్రత కోసం ఒక ఉద్యోగిని నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

మీరొక శక్తి స్వరూపిణి



సందేశ్‌ఖాలీ బాధితురాలు, బీజేపీ అభ్యర్థి రేఖా పాత్రాను ప్రశంసించిన మోదీ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేత షాజహాన్ షేక్ అరాచకాలకు గురైన సందేశ్‌ఖాలీ గ్రామస్తురాలు, షాజహాన్ అకృత్యాలపై పోరాడి నిలిచిన బాధితురాలు రేఖా పాత్రాను ప్రధాని మోదీ పొగిడారు. సందేశ్‌ఖాలీలో షాజహాన్ ఆగడాలకు ఎదురునిలిచి పోలీసులకు ఫిర్యాదుచేయడంతోపాటు షాజహాన్ వ్యతిరేక ఉద్యమంలో రేఖ కీలక పాత్ర పోషించారు. పేదింటి మహిళ తెగువ చూసి ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బసిర్‌హట్ నియోజకవర్గ టికెట్‌ను బీజేపీ ఈమెకే ఇచ్చింది. ఈ సందర్భంగా రేఖతో ప్రధాని మోదీ మాట్లాడి, ఆమెను ప్రశంసించారని బీజేపీ నేతలు మంగళవారం వెల్లడించారు.



రాముడే అండగా ఉన్నట్లుంది: 'నాకు మద్దతుగా మోదీ నిల్చున్నందుకు చాలా ఆనందంగా ఉంది. స్వయంగా రాముడే మాకు తోడుగా నిలబడినట్లు ఉంది. ధైర్యం పెరిగింది. ఇక్కడ దారుణ పరిస్థితుల కారణంగా మేం 2011 నుంచి ఓటు హక్కు కూడా వినియోగించుకోలేకపోయాం. పోటీకి దిగుతున్నానని తెల్సి మొదట్లో టీఎంసీ మద్దతుదారులను నన్ను తప్పుబట్టారు. కానీ ఇప్పుడు అందరూ మద్దతుగా నిలబడ్డారు. మాది నిరుపేద కుటుంబం. పని కోసం నా భర్త కేరళ, తమిళనాడుకు వెళ్తారు. ఎన్నికల్లో గెలిస్తే పని కోసం పేదలు వేరే రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉపాధి పొందేలా ఏదైనా చేయాలని ఉంది' అని రేఖ అన్నారు. దీంతో 'నిజంగా మీరు శక్తి స్వరూపిణి' అని మోదీ ఆమెను పొగిడారు. ' టీఎంసీ సర్కార్ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు తెలియజెప్పండి. ప్రజలకు అనుగుణంగా పనిచేయండి. ప్రజల్ని మమతా బెనర్జీ సర్కార్ ఏ విధంగా ఇబ్బంది పెడుతుందో ప్రచారం చేయండి. బెంగాల్‌లో కేంద్రప్రభుత్వ పథకాలు అమలుకాకుండా అడ్డుకుంటున్న వైనాన్ని వివరించండి. పథకాల పేర్లను మార్చేసి అవినీతిలో కూరుకుపోయిన విధానాన్ని విడమర్చి చెప్పండి. ఈసారి ఈ ప్రాంతంలో స్వేచ్ఛా, పారదర్శక వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూస్తాం' అని రేఖకు మోదీ భరోసా ఇచ్చారు. ''ఇంతగా ప్రోత్సహిస్తున్న ప్రధానికి, నామినేట్ చేసిన బీజేపీకి కృతజ్ఞతలు. సందేశ్‌ఖాలీలో మా కష్టాలు ఈ ప్రాంత మహిళలందరికీ తెలుసు. మహిళలు, స్థానికుల మద్దతు నాకు ఉంది' అని కోల్‌కతాలో రేఖ చెప్పారు.

పంజాబ్‌లో పొత్తుల్లేవ్: బీజేపీ

చండీగఢ్: పంజాబ్‌లో సార్వత్రిక ఎన్నికల సమరంలో ఒంటరిగానే పోటీచేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. దీంతో గత వారంరోజులుగా శిరోమణి అకాలీదళ్‌తో జరుపుతున్న పొత్తు చర్చలు విఫలమైనట్లు స్పష్టమవుతోంది. మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన వివాదాస్పద మూడు సాగు చట్టాలపై విభేదించిన శిరోమణి అకాలీదళ్ పార్టీ 2020 సెప్టెంబర్‌లో ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలగింది. తాజాగా పంజాబ్‌లో 13 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల నేపథ్యంలో మళ్లీ పొత్తుకు బీజేపీ, అకాలీదళ్ ప్రయత్నించినా చర్చలు సఫలం కాలేదు. 13 స్థానాలకుగాను కనీసం ఆరు స్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధపడగా అందుకు అకాలీదళ్ ససేమిరా అంది. దాంతో తమది ఒంటరి పోరేంటూ పంజాబ్ బీజేపీ చీఫ్ సునీల్ జాఖడ్ ప్రకటించారు.

కాంగ్రెస్ రెబల్స్‌కు బీజేపీ టికెట్లు

సిమ్లా: అనర్హత వేటుపడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయనున్నారు. బీజేపీ మంగళవారం ఈ మేరకు ప్రకటించింది. దాంతో ఆ పార్టీలో అసమ్మతి భగ్గుమంది. బీజేపీకి చెందిన మాజీ మంత్రి రామ్ లాల్ మర్కండ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యే చేతిలో ఓడిన బీజేపీ మాజీ మంత్రి వీరేంద్ర కన్వర్ కూడా అసంతృప్తితో ఉన్నారు.

బీజేపీలో చేరిన రవ్‌నీత్ బిట్టూ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ టికెట్‌పై మూడు పర్యాయాలు ఎంపీగా ఎన్నికైన రవ్‌నీత్ సింగ్ బిట్టూ బీజేపీలో చేరారు. పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ మనవడే బిట్టూ. పంజాబ్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో హీరోగా పేరు తెచ్చుకున్న బియాంత్ సింగ్ పదవిలో ఉండగానే హత్యకు గురైన విషయం తెలిసిందే. బిట్టూ లూధియానా లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు.

పన్నీర్‌సెల్వం వర్సెస్ పన్నీర్‌సెల్వం

చెన్నై: తమిళనాడు మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం రామనాథపురం లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అచ్చంగా అదే పేరున్న మరో వ్యక్తి కూడా అక్కడ స్వతంత్రునిగా పోటీ చేస్తున్నారు! మాజీ సీఎం పన్నీర్ సెల్వం (72) పూర్తి పేరు ఒట్టకార తేవర్ పన్నీర్‌సెల్వం కాగా, స్వతంత్ర అభ్యర్థి పూర్తిపేరు ఒచప్పన్ పన్నీర్‌సెల్వం (42). ఆయన సొంతూరు మదురై జిల్లా ఉసిలంపట్టి. అభ్యర్థుల జాబితాలో ఇద్దరి పేర్లు ఒ.పన్నీర్‌సెల్వంగానే అధికారులు పొందుపరిచారు. దాంతో ఓటర్లు వీరిని ఫొటోలు, కేటాయించిన గుర్తుల ఆధారంగా గుర్తుపట్టాల్సిందే. అన్నాడీఎంకే నుంచి తనను బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ కోర్టుకెక్కిన పన్నీర్‌సెల్వం ఈసారి బీజేపీ మద్దతుతో లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నారు.

ఉద్యోగాలపై బీజేపీ తప్పుదోవ: రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరుద్యోగ సమస్యను, బీజేపీ సర్కార్ గత ఎన్నికల హామీని ప్రధానంగా ప్రస్తావిస్తూ మోదీపై విమర్శలు ఎక్కుపెట్టారు. ''మోదీ జీ! నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మీ దగ్గర ప్రణాళిక ఉందా? ఇది ప్రతి నిరుద్యోగ యువత ప్రశ్న. వారికి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎందుకు అబద్ధం చెప్పారని బీజేపీ వాళ్లను ఊరూరా అందరూ ప్రశ్నిస్తున్నారు'' అంటూ 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ చేశారు.

ఆ హామీ ఇస్తే తప్ప అసాంజేను అప్పగించలేం

అమెరికాకు తేల్చిచెప్పిన బ్రిటిష్ కోర్టు



లండన్: అమెరికా రహస్య పత్రాలను ప్రచురించిన కేసులో వికీ లీక్స్ వ్యవస్థాపకుడు, సామాజిక ఉద్యమకారుడు, ఆస్ట్రేలియా పౌరుడు జూలియన్ అసాంజేకు ఊరట లభించింది. అమెరికాకు ఆయన అప్పగింతపై లండన్‌లోని బ్రిటిష్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అసాంజేకు మరణశిక్ష విధించబోమంటూ హామీ ఇస్తే తప్ప గూఢచర్యం కేసులో ఆయనను అమెరికాకు అప్పగించడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. దీనిపై మూడు వారాల్లోగా స్పందించాలని అమెరికాకు సూచించింది. లేకపోతే కొత్తగా అప్పీల్ చేసుకొనే అవకాశం అసాంజేకు కల్పిస్తామని వెల్లడించింది. అయితే, బ్రిటిష్ కోర్టు ఉత్తర్వుపై అమెరికా ఇంకా స్పందించలేదు. అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్‌లోని కంప్యూటర్‌ను హ్యాక్ చేసి, రహస్య పత్రాలను తస్కరించినట్లు అసాంజేపై అభియోగాలు నమోదైన సంగతి తెలిసిందే. ఇరాక్, అఫ్గానిస్తాన్‌లో అమెరికా సైన్యం అరాచకాలకు పాల్పడిందంటూ ఆయన బయటపెట్టిన పత్రాలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. గూఢచర్యం చట్టం కింద అమెరికాలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. అభియోగాలు నిరూపితమైతే అసాంజేకు 175 ఏళ్ల వరకు జైలుశిక్ష పడే ఆస్కారముంది. మరణశిక్ష కూడా విధించవచ్చని అమెరికా అధికారులు చెబుతున్నారు. అసాంజే ఐదేళ్లుగా బెల్‌మార్ష్ జైలులో ఉంటున్నారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి..
ఐదుగురు చైనీయులు మృతి

ఇస్లామాబాద్/కరాచీ: పాకిస్తాన్‌లోని కల్లోలిత ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్‌లో మంగళవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో అయిదుగురు చైనీయులు సహా మొత్తం ఆరుగురు మృతి చెందారు. ఇస్లామాబాద్ నుంచి కొహిస్తాన్ వైపు వెళ్తున్న బస్సును ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో నింపిన ఓ ట్రక్కుతో ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. షాంగ్లా జిల్లా బిషమ్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో పాక్ పౌరుడైన బస్సు డ్రైవర్‌తోపాటు అందులోని అయిదుగురు చైనీయులు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయాలపాలయ్యారు. మృతులందరూ డాసు జల విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న వారే. కాగా, ఈ దాడికి కారణమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా పాక్ వ్యాప్తంగా కొనసాగుతున్న పలు ప్రాజెక్టుల్లో వేలాది మంది చైనా దేశస్తులు పనిచేస్తున్నారు.

ఎయిర్‌బేస్‌పై ఉగ్రదాడిని తిప్పికొట్టిన పాక్ ఆర్మీ

బలోచిస్తాన్ ప్రావిన్స్‌లోని తుర్బాట్‌లో ఉన్న నావల్ ఎయిర్‌బేస్ 'పీఎన్ఎస్ సిద్దిఖి'పై దాడికి ఉగ్రవాదులు విఫలయత్నం చేశారు. సోమవారం రాత్రి ఉగ్రవాదులు ఎయిర్‌బేస్‌లోకి మూడు వైపుల నుంచి చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఆర్మీ వారిని దీటుగా ఎదుర్కొంది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు హతం కాగా, ఒక జవాను ప్రాణాలు కోల్పోయాడని అధికారులు చెప్పారు. బేస్‌లోని విమానాలకు, ఇతర సున్నిత వ్యవస్థలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. ఈ దాడికి పాల్పడింది తమ మజీద్ బ్రిగేడ్ అని బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ప్రకటించుకుంది.

ఈడీ కస్టడీ నుంచి
కేజ్రీవాల్ రెండో ఉత్తర్వు

మొహల్లా క్లినిక్‌లలో ఉచితంగా ఔషధాలు అందజేయాలని ఆదేశం



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారు. ఢిల్లీలో మొహల్లా క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఔషధాల కొరత లేకుండా చూడాలని, ఉచితంగా డయాగ్నోస్టిక్ టెస్టులు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మంగళవారం తెలియజేశారు. మొహల్లా క్లినిక్‌లు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని, ఔషధాలు కొరత ఉందంటూ కేజ్రీవాల్‌కు సమాచారం అందిందని తెలిపారు. అందుకే వెంటనే స్పందించి, ఈ అంశంపై అధికారులకు ఆదేశాలిచ్చారని వెల్లడించారు. ఆరోగ్య రంగానికి కేజ్రీవాల్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అరెస్టై కస్టడీలో ఉన్నప్పటికీ ఢిల్లీ ప్రజలకు వైద్య సేవలు నిరాటంకంగా అందించాలని ఆయన ఆరాటపడుతున్నారని వివరించారు. ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ ఉత్తర్వు జారీ చేయడం ఇది రెండోసారి. ఢిల్లీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచిస్తూ గతవారం మొదటిసారిగా ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే.

మిస్ యూనివర్స్ పోటీలో
తొలిసారి సౌదీ సుందరి



రియాద్: ఇస్లాం సంప్రదాయవాదానికి చిరునామాగా నిలిచే సౌదీ అరేబియా నుంచి ఒక ముద్దుగుమ్మ మిస్ యూనివర్స్ పోటీలకు సిద్ధమైంది. సౌదీ నుంచి ఇలా ఒక అమ్మాయి అంతర్జాతీయ అందాల పోటీలకు ప్రాతినిధ్యం వహించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. త్వరలో మలేసియాలో జరగబోయే విశ్వసుందరి పోటీల్లో తాను సౌదీ తరఫున పాల్గొనబోతున్నట్లు 27 ఏళ్ల మోడల్ రూబీ అల్ఖతానీ సోమవారం ప్రకటించారు. సౌదీలోని రియాద్ నగరం ఈమె స్వస్థలం. ఇప్పటికే పలు అందాల పోటీల్లో పాల్గొన్నారు. కొద్ది వారాల క్రితం మలేసియాలో జరిగిన మిస్ అండ్ మిసెస్ గ్లోబల్ ఏషియన్‌లోనూ పాలుపంచుకున్నారు. ' ప్రపంచ సంస్కృతులపై అవగాహన పెంచుకుంటూనే మా సౌదీ సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని విశ్వ వేదికలపై వివరిస్తా' అని అరబ్ న్యూస్‌తో రూబీ అన్నారు. ఇప్పటికే మిస్ సౌదీ అరేబియా కిరీటాన్ని దక్కించుకున్న ఈమె మిస్ మిడిల్ ఈస్ట్(సౌదీ అరేబియా), మిస్ అరబ్ వరల్డ్ పీస్–2021, మిస్ ఉమెన్(సౌదీ అరేబియా) టైటిళ్లను గెలుపొందారు. ఈమెకు ఇన్‌స్టా గ్రామ్‌లో లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈమె మోడల్‌గానే కాదు కంటెంట్ క్రియేటర్ గానూ రాణిస్తున్నారు. కఠిన ఆంక్షలతో పక్కా సంప్రదాయవాదిగా పేరుమోసిన 38 ఏళ్ల సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్ ఇటీవలి కాలంలో సౌదీని సంస్కరణల బాటలో పయనింపజేస్తున్నారు. మహిళల డ్రైవింగ్‌కు, పురుషుల పార్టీలకు వెళ్లేందుకు, పురుష సంరక్షులు లేకున్నా పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించారు. పూర్తి మద్యనిషేధం అమల్లో ఉండే సౌదీలో తొలిసారిగా దౌత్యకార్యాలయాలుండే ప్రాంతంలో మద్యం అమ్మకాలకు అనుమతి మంజూరు చేశారు.



ఎవరెస్ట్ అంతటి సంకల్పం!

ఈ పాప పేరు సిద్ధి మిశ్రా. వయసు కేవలం రెండున్నరేళ్లు. సముద్రమట్టం నుంచి 17,598 అడుగుల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్ వద్దకు విజయవంతంగా చేరుకుంది. తల్లితండ్రులతో కలిసి మార్చి 12న ట్రెక్కింగ్ మొదలెట్టి పది రోజుల్లోనే బేస్ క్యాంప్‌కు చేరింది. ఈ ఘనత సాధించిన అత్యంత పిన్నవయస్కుల్లో ఒకరిగా సిద్ధి రికార్డు సృష్టించింది. అనంతరం తల్లితో కలిసి ఇలా సగర్వంగా ఫొటోకు పోజిచ్చింది.

మమతపై ఘోష్ అసభ్య వ్యాఖ్యలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కుటుంబ నేపథ్యాన్ని ప్రశ్నిస్తూ బీజేపీ సీనియర్ నాయకుడు, మేదినీపూర్ ఎంపీ దిలీప్ ఘోష్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సంబంధిత వివాదాస్పద వ్యాఖ్యల వీడియోను అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ' బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గోవాకు వెళ్తారు. అక్కడ ' నేను గోవా రాష్ట్ర బిడ్డను' అంటారు. మళ్లీ త్రిపురకు వెళ్తారు. అక్కడా 'నేను త్రిపుర బిడ్డను' అంటారు. అసలు తన తండ్రి ఎవరు అనేది ఆమె స్పష్టం చేయాలి'' అని దిలీప్ అన్నట్లుగా వీడియోలో ఉంది. ఈ వీడియో చూస్తే.. 2021లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీఎంసీ ఇచ్చిన ' బెంగాల్ తన సొంత కుమార్తెను కోరుకుంటోంది' అన్న నినాదాన్ని దిలీప్ వెక్కిరించినట్లుగా ఉంది. దీంతో దిలీప్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ టీఎంసీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేశారు. ' దిలీప్ రాజకీయ నాయకుల పరువు తీస్తున్నారు. గతంలో దుర్గామాత పుట్టుపూర్వోత్తరాలపై వ్యాఖ్యలు చేసిన ఈయన తాజాగా మమతా బెనర్జీ కుటుంబ నేపథ్యంపై అసభ్యంగా మాట్లాడారు. బెంగాల్ మహిళ అంటే కనీస మర్యాద కూడా ఈయనకు లేదు. కమలదళం డీఎన్ఏలోనే ఇది ఉంది'' అంటూ టీఎంసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'బెంగాల్‌లో బీజేపీ నాయకత్వం ఎంత స్త్రీ ద్వేషంతో రగిలిపోతోందో ఇట్టే అర్థమవుతోంది. భారత్‌లో ప్రస్తుత ఏకైక మహిళా ముఖ్యమంత్రిని కించపరిచారు. ఇలాంటి వారికి బెంగాల్ ప్రజలు ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతారు' అని టీఎంసీ నేత కీర్తి ఆజాద్ అన్నారు. ఈసారి బర్ధమాన్ దుర్గాపూర్ ఎంపీ స్థానంలో దిలీప్‌కు పోటీగా ఈయనే టీఎంసీ తరఫున బరిలో నిలిచారు. దిలీప్ ఘోష్ గతంలో బెంగాల్ బీజేపీ చీఫ్‌గా ఉన్నారు.

రామకృష్ణ మిషన్ ప్రెసిడెంట్ కన్నుమూత



కోల్‌కతా: రామకృష్ణ మిషన్ ప్రెసిడెంట్ స్వామి స్మరణానంద(95) మంగళవారం రాత్రి కన్నుమూశారు. వయో సంబంధ రుగ్మతలతో ఆయన మంగళవారం రాత్రి 8.14 గంటలకు పరమపదించారని రామకృష్ణ మిషన్ తెలిపింది. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మిషన్ 16వ అధ్యక్షుడిగా 2017 నుంచి ఆయన కొనసాగుతున్నారు. మూత్ర సంబంధ సమస్య తలెత్తడంతో స్మరణానందను జనవరి 29వ తేదీన రామకృష్ణ మిషన్ సేవా ప్రతిష్ఠాన్ ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం శ్వాసకోశ సమస్య ఏర్పడటంతో మార్చి 3వ తేదీ నుంచి వెంటిలేటర్‌పైనే ఉన్నారు.

సాక్షి కరీంనగర్

బుధవారం । 27 । మార్చి । 2024



హుండీ ఆదాయం లెక్కింపు

వేములవాడరూరల్: అగ్రహారం హనుమాన్ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రూ.2,21,877 నగదు సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి మారుతి తెలిపారు.

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ బుధ(సా॥)	సహర్ గురు(ఉ॥)
కరీంనగర్	:	6.28	4.45
పెద్దపల్లి	:	6.35	4.51
రాజన్న సిరిసిల్ల	:	6.35	4.53
జగిత్యాల	:	6.35	4.51

గరిష్ఠం/కనిష్ఠం 38.0/24.0

వాతావరణం

జిల్లాలో ఈరోజు వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట కాస్త చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'పది'లో 41మంది గైర్హాజరు

కరీంనగర్: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన భౌతికశాస్త్రం పరీక్షకు 41 మంది గైర్హాజరైనట్లు డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 12,565 మందికి గానూ 12,551మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరు అయ్యారని, ప్రైవేట్ విద్యార్థులు 92మందికి గానూ 65మంది హాజరు కాగా 27మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ బృందాలు 17 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ఐదు పరీక్ష కేంద్రాలను మొత్తం 22 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో జనార్దన్‌రావు పేర్కొన్నారు.

గురుకులాల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ, ట్రైబల్ సంక్షేమ గురుకులాల సంస్థ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 6,7,8,9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు అర్హత గల విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారి వి.లక్ష్మాంజలిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ డబ్ల్యూఆర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) అల్గునూర్(కరీంనగర్‌జిల్లా), గౌలిదొడ్డి(రంగారెడ్డి జిల్లా)లోని పాఠశాలల్లో 9వ తరగతిలోకి మాత్రమే రెగ్యులర్ అడ్మిషన్లు కోరుతున్నట్లు పేర్కొన్నారు. టీటీడబ్ల్యూఆర్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిగి(బాలికలు), వికారాబాద్ జిల్లా, ఖమ్మం(బాలురు), ఖమ్మం జిల్లాలో 8వ తరగతిలో మాత్రమే రెగ్యులర్ ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేయుటకు ఈనెల 30వ తేదీ చివరి గడువు అని పేర్కొన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేడు మెగా జాబ్‌మేళా

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌కేజీ కో ఆర్డినేటర్ డా.శోభారాణితో కలిసి వివరాలు వెల్లడించారు. ఉద్యోగ మేళాలో దేశవ్యాప్తంగా పేరున్న 15కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2021, 2022, 2023 గ్రాడ్యుయేట్, పీజీ చేసిన వారితో పాటు చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగ మేళాకు వచ్చే అభ్యర్థులు వారి రెజ్యూమ్‌తో పాటు సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఈ ఉద్యోగమేళా కశ్మీర్‌గడ్డలోని ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో జరుగుతాయని, అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే 99120 93500 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,550

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి గరిష్ఠంగా ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 36వాహనాల్లో 469 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.7,100 పలికింది. గన్నీ సంచుల్లో ముగ్గురు రైతులు మూడు క్వింటాళ్ల పత్తిని తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,300, మోడల్ ధర రూ.6,000, కనిష్ఠ ధర రూ.5,000కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలను కార్యదర్శి గుగూలోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

సంక్షేమంపై చిన్నచూపు

- 14 ఏళ్లుగా పెరగని కాస్మోటిక్ చార్జీలు
- బాలికలకు రూ.75.. బాలురకు రూ.50
- ఐదేళ్లు గడుస్తున్నా అవే మెస్‌చార్జీలు
- ఇక్కట్లకు గురవుతున్న వసతి గృహ విద్యార్థులు

కరీంనగర్:

సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. 14ఏళ్లుగా కాస్మోటిక్ చార్జీలు పెంచడం లేదు. నెలకు బాలికలకు రూ.75, బాలురకు రూ.50 మాత్రమే చెల్లిస్తోంది. కాస్మోటిక్ చార్జీలు పెంచాలంటూ ఐదేళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం ఆమోదం తెలపగా.. ఇప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో చేసిన ప్రతిపాదనలే కొనసాగుతున్నాయి. విద్యార్థులు ప్రతిరోజు స్నానం చేసి, జుట్టుకు నూనె రాసుకుని, తల దువ్వుకుని, ఉతికిన దుస్తులు వేసుకుని పరిశుభ్రంగా పాఠశాలకు రావాలని ఉపాధ్యాయులు సూచిస్తారు. ప్రభుత్వం అరకొరగా అందిస్తున్న నగదుతో స్నానం సబ్బులు, బట్టల సబ్బులు, టూత్ పేస్టు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇక కొబ్బరినూనె, పౌడరు డబ్బా, షాంపూ, శానిటరీ నాప్కిన్లు(ఆడపిల్లలకు), ప్రతినెల క్షవరం(బాలురకు)వంటి వాటి ఖర్చులకు డబ్బులు సరిపోవడం లేదు. నెలసరి సమయంలో న్యాప్కిన్‌లో కొనలేక బాలికలు ఆ మూడు రోజులు వివిధ కారణాల చెప్పి తరగతులకు హాజరు కాలేక పోతున్న విషయం వెలుగులోకి వచ్చింది.

పట్టని అధికారులు, పాలకులు

సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులపై ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2008మార్చిలో అమలు చేసిన కాస్మోటిక్ చార్జీలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఐదేళ్ల క్రితం రెండుసార్లు ప్రతిపాదనలు పంపారు. గురుకులాలు, వసతి గృహాల్లో 5–7 తరగతుల బాలికలకు నెలకు రూ.125, 8–10 తరగతుల విద్యార్థినులకు రూ.200, 5–7 తరగతుల బాలురకు నెలకు రూ.100,8–10 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.150 ఇవ్వాలని ఎస్సీ సంక్షేమశాఖ ఐదేళ్ల క్రితం రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా ఆమోదం లభించలేదు.

కిట్ల పంపిణీ మరిచిన ప్రభుత్వం

వసతిగృహాలకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే కాస్మోటిక్ చార్జీలకు బదులుగా కిట్లు అందిస్తామని అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. రెండేళ్ల పాటు కేజీబీవీ, గురుకులాల్లో అమలు చేసి సంక్షేమ వసతి గృహాలకు మొండిచేయి చూపింది.

మెస్‌చార్జీల పెంపులో అదేతీరు

మెస్‌చార్జీలు పెంచాలని గత ప్రభుత్వంలోని మంత్రుల బృందం 01 మార్చి 2023న నిర్ణయించగా.. ఆమోదం పొందలేదు. 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.1200, 8–10వ తరగతి విద్యార్థులకు రూ.1400, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1,875ల చొప్పున ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించిన నివేదిక ఆటకెక్కడంతో పాత మెస్‌చార్జీలే అమలువుతున్నాయి. దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయి మెనూ అందడం లేదు. హాస్టళ్లలో ఆహారం కలుషితమవుతుందని, నాణ్యమైన నిత్యావసరాలు వినియోగించడం లేదని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో హాస్టల్ వార్డెన్లు అప్పుచేసి విద్యార్థులకు భోజనం, కాస్మోటిక్స్ అందజేస్తున్నారు. ఐదారు నెలల తర్వాత బిల్లులు మంజూరైనా చేసిన అప్పులకు వడ్డీలు తమ జేబు నుంచి చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

సరఫరా విధానంలో తేడాలు

విద్యార్థులకు పాలు, గుడ్లు, కూరగాయలు, చికెన్ తదితర సరకుల పంపిణీలో ప్రభుత్వం వేర్వేరుశాఖల పరిధిలోని హాస్టళ్లలో వేర్వేరు విధానాలు అనుసరిస్తోంది. రెసిడెన్షియల్ విద్యార్థులకు పాలు, గుడ్లు, కూరగాయలు, చికెన్ టెండర్లు పిలిచి.. కాంట్రాక్టర్ ద్వారా సరఫరా చేయిస్తోంది. సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. ఇక్కడ విద్యార్థులకు ప్రభుత్వం మెస్‌చార్జీలు చెల్లిస్తోంది. 1 నుంచి 3వ తరగతి వరకు చదివేవారికి ఒక్కొక్కరికి నెలకు రూ.950 చొప్పున చెల్లిస్తోంది.8–10 తరగతి విద్యార్థికి రూ.1,100, ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు నెలకు రూ.1,500 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఇందులోనే వంటగ్యాస్, బ్రేక్‌ఫాస్ట్, గుడ్లు, పాలు, రాత్రి భోజనం, వారానికి రెండుసార్లు చికెన్ పెట్టాల్సి వస్తోందని వార్డెన్లు తెలిపారు. ప్రతీనెల బిల్లులు విడుదల చేస్తే ఇబ్బందులు ఉండవని, నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో కష్టాలుపడాల్సి వస్తోందని తెలిపారు.



నగరంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం

సంక్షేమ వసతి గృహాలు	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ సంక్షేమశాఖ	32	4,330
బీసీ సంక్షేమశాఖ	19	1,818
ఎస్టీ సంక్షేమశాఖ	03	607
గురుకులాలు		
ఎస్సీ,ఎస్టీ,బీసీ గురుకులాలు	22	4,300



సంక్షోభంలో సంక్షేమం



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లపై చిన్నచూపు చూస్తోంది. మెస్ చార్జీలు పెంచడం లేదు. 14ఏళ్లు దాటుతున్నా కాస్మోటిక్ చార్జీలు పెంచలేదు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదివే సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలపై ప్రభుత్వం దురుద్దేశ్యంతోనే ఎలాంటి చార్జీలను పెంచడం లేదు. వసతిగృహాల సమస్యలపై త్వరలోనే ఉద్యమ కార్యచరణ రూపొందిస్తాం.

– మచ్చ రమేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వృద్ధులతో మర్యాదగా మెలగాలి

- జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్



స్వధార్ హోంను పరిశీలిస్తున్న జడ్జి వెంకటేశ్

కరీంనగర్: నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ మంగళవారం సందర్శించారు. ఆశ్రమంలో అందుతున్న సౌకర్యాలను గురించి ఆరా తీశారు. వైద్య సహాయకురాలు లేకపోవడంతో డీఎంహెచ్‌వోతో మాట్లాడి, త్వరగా వైద్య సహాయకురాలిని నియమించాలని కోరారు. వృద్ధులతో ఏదైనా సమస్య వస్తే వార్డెన్‌కు తెలియజేయాలి తప్ప వారితో దురుసుగా ప్రవర్తించవద్దని సిబ్బందికి హెచ్చరించారు. అదేవిధంగా నగరంలోని స్వాధార్ హోంను సందర్శించి బాలికలు చిన్నతనం నుంచి మంచి అలవాట్లు నేర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. భార్యాభర్తలు క్షణికావేశానికి లోనై గొడవలు పెట్టుకుంటే పిల్లల బంగారు భవిష్యత్తు పాడవుతుందని, బాల్యంలో వారిపై ఎటువంటి చెడు ప్రభావం పడకుండా చూసుకోవాలని అన్నారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని అన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, స్వధార్ హోమ్‌లో ఉన్నవారికి పండ్లు పంపిణీ చేశారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నన్ను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు'



కార్యకర్తలతో మాట్లాడుతున్న కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

- ఇంటింటికి తిరిగి వారి వైఫల్యాలను ఎండగట్టండి
- చేరికలపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్

కరీంనగర్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఏ సర్వే చూసినా కరీంనగర్‌లో బీజేపీ భారీ మెజారిటీతో గెలుస్తుందని నివేదికలొస్తున్నాయని, దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఓ హోటల్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఇన్‌చార్జిలతో బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజారిటీతో గెలిచే అవకాశం ఉందన్నారు. బీజేపీ కార్యకర్తలు పోలింగ్ నాటికి ప్రతీఓటరును ఏడుసార్లు కలవాలని, పోలింగ్ ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఖజానా ఖాళీ అయ్యిందని, ఎన్నికల తరువాత ఉద్యోగులకు జీతాలివ్వడమే గగనం కాబోతోందన్నారు. అప్పులకు వడ్డీ కట్టే పరిస్థితి లేదన్నారు. వీటితోపాటు ఎన్నికల హామీలు అమలు పెద్దఎత్తున నిధులు అవసరమన్నారు. మోదీ ప్రభుత్వాన్ని గెలిపిస్తేనే తెలంగాణకు అవసరమైన నిధులు రాబట్టుకునే అవకాశం ఉందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జాయినింగ్స్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టి, బూత్ కమిటీలను పటిష్టం చేయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమక్కు రాజకీయాలను ప్రస్తావించాలని, పొన్నం, కేటీఆర్ ఒక్కటేనని, బండి సంజయ్‌ను ఓడించడానికి ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్.విఠల్, జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు,రమేశ్, బాస సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కేసులో జెడ్పీటీసీ భర్త అరెస్ట్

- నకిలీ పత్రాలు సృష్టించిన విషయంలో అప్పటి తహసీల్దార్ సహా నలుగురిపై కేసు



పిట్టల రవీందర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

కొత్తపల్లి(కరీంనగర్): భూ దందాలు, స్థిరాస్తుల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడ్డవారిపై కరీంనగర్ పోలీసుల వేట కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు సహా తహసీల్దార్‌ను కటకటాలకు పంపగా తాజా అప్పటి కరీంనగర్ తహసీల్దార్, కొత్తపల్లి జెడ్పీటీసీ భర్త సహా పలువురిపై కేసు నమోదు చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన కేసులో ఏ1గా ఉన్న జెడ్పీటీసీ భర్త, మాజీ సర్పంచ్ పిట్టల రవీందర్‌ను మంగళవారం కరీంనగర్ రూరల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు, కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాలిలా.. హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన పామ్‌రాజ్ దేవిదాస్‌రావు తండ్రి పామ్‌రాజ్ గోవిందారావుకు 1954లో కాస్రా పహాణి ద్వారా కొత్తపల్లి మండలం చింతకుంట శివారు సర్వే నంబర్ 106లో 5.08 ఎకరాల భూమి ఉంది. పలుమార్లు విక్రయించగా మరో 20 గుంటలు మిగిలింది. ఈ భూమి ధరణిలో యజమాని పేరిటే ఉండగా.. పహాణిలో పేరు ట్యాంపర్ అయి న్యాలమడుగు చిన్న వీరయ్య పేరు వచ్చింది. దీన్ని గ్రహించిన అప్పటి సర్పంచ్ పిట్టల రవీందర్ భూమిని కాజేయాలని అనుకున్నాడు. వీరయ్య పేరుగల మరో వ్యక్తి కుమారుడు రాజయ్య పేరుపై అప్పటి తహసీల్దార్ మోహన్ రెడ్డితో కుమ్మక్కై తప్పుడు విరాసత్ చేయించాడు. రాజయ్య నుంచి గడ్డం ఆదిరెడ్డి పేరున 2009లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆదిరెడ్డి నుంచి 2010లో పిట్టల రవీందర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమి తనదేనని, ఇంకోసారి మీరు వస్తే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డట్లు బాధితుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రూరల్ ఇన్‌స్పెక్టర ఏ.ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో బాధితుడి వివరాలు నిజమేనని తేలడంతో ఏ1గా పిట్టల రవీందర్, ఏ2గా గడ్డం ఆదిరెడ్డి, ఏ3గా న్యాలమడుగు రాజయ్య, ఏ4 మోహన్‌రెడ్డి (అప్పటి తహసీల్దార్)లపై పలు సెక్షన్ల కిందకేసు నమోదు చేశారు. పిట్టల రవీందర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, 14రోజుల రిమాండ్ విధించారు.

రౌడీషీటర్.. మరో ముగ్గురిపై...



అరెస్టయిన తిరుపతి విష్ణువర్ధన్, నగేశ్

కరీంనగర్‌క్రైం: భూమి విషయంలో డబ్బులు తీసుకుని మోసం చేసిన రౌడీషీటర్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం వెదురుగట్ట నివాసి పంబాల శ్రీనివాస్‌కు చెందిన తీగలుగుట్టపల్లిలోని భూమి విషయంలో తప్పుడుపత్రాలు సృష్టించి కరీంనగర్ కాపువాడకు చెందిన తిరుపతి విష్ణువర్ధన్, మంద నగేశ్, తీగలగుట్టపల్లికి చెందిన కొమ్ము భూమయ్య బెదిరింపులకు గురిచేశారు. రూ.20 లక్షలు ఇస్తే భూమిని వదిలేస్తామని శ్రీనివాస్‌ను బెదిరించారు. దీంతో పలు దఫాలుగా రూ.5లక్షలు చెల్లించాడు. మిగితా డబ్బులు ఇచ్చే క్రమంలో ఆలస్యం కావడంతో చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తిరుపతి విష్ణువర్ధన్, కొమ్ము భూమయ్య, మంద నగేశ్, తిరుపతి నితిన్‌వర్ధన్‌పై కేసునమోదు చేశారు. విష్ణువర్ధన్, నగేశ్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్..




ఆకుల ప్రకాశ్‌ను అరెస్టు చేసిన సీఐ

కరీంనగర్‌క్రైం: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే భూమిని పలువురికి అమ్మి మోసం చేసిన ఏడో డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్‌రూరల్ పోలీసులు తెలిపారు. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం నివాసి వంతడ్పుల సంపత్‌కు చెందిన కరీంనగర్ రూరల్ పరిధిలోని వల్లంపహాడ్‌లో ఉన్న భూమికి తప్పులు ధృవపత్రాలు సృష్టించి పలువురికి విక్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాశ్, తొమ్ముద్రు నరసింహరావు, మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్, ఉప్పు సురేశ్, కట్ట రమ్యపై కేసు నమోదు చేశారు. మంగళవారం ప్రకాశ్‌ను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించారు.

కోచ్‌లకు అందని గౌరవ వేతనం

- 10 నెలలు గడిచినా పట్టించుకోని నగరపాలక సంస్థ
- గతేడాది కూడా ఇవే తిప్పలు.. ఎదురుచూస్తున్న కోచ్‌లు



శిక్షణ శిబిరాలకు హాజరైన చిన్నారులు (ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: వేసవి శిబిరాల్లో చిన్నారులకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు వేతనం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. మరో నెలరోజులు అయితే మళ్లీ శిబిరాలు ప్రారంభం అయ్యే అవకాశం ఉండగా.. 10 నెలలు గడిచినా నగరపాలక సంస్థ గౌరవవేతనం మంజూరు చేయడం లేదు. గత ఐదేళ్లుగా నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో వేసవిలో క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏటా సుమారు 3వేల మంది చిన్నారులు హాజరు అవుతుండగా.. గతేడాది సుమారు 28 క్రీడాంశాల్లో 70 మందికి పైగా కోచ్‌లు తర్ఫీదునిచ్చారు. వీరికి గౌరవవేతనం కింద రూ.10వేలు ఇస్తామన్న నగరపాలక సంస్థ 10నెలలు గడిచినా పట్టించుకోవడం లేదు. కొద్దిరోజుల్లో మళ్లీ వేసవి క్యాంపులు ప్రారంభం కానుండగా.. గతేడాది గౌరవవేతనం ఎప్పుడిస్తారని కోచ్‌లు ఎదురుచూస్తున్నారు.

మూడేళ్లుగా ఇదే తీరు

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2017 మేలో వేసవి క్రీడా శిక్షణశిబిరాలు ప్రారంభించారు. అప్పుడు 20 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వగా, తొలిసారిగా సుమారు 1500మంది హాజరయ్యారు. సుమారు 40మంది కోచ్‌లకు శిక్షణ శిబిరం ముగిసిన వెంటనే ఇవ్వాల్సిన గౌరవ వేతనం అందించారు. 2018, 2019, 2022, 2023లో జరిగిన శిబిరాల్లో శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు గౌరవ వేతనాలు ఇవ్వడంలో తీవ్రజాప్యం చేస్తున్నారు. 2022లో రూ.8వేలు ఇస్తామని చెప్పిన అధికారులు, క్యాంప్ ముగిసిన 10నెలలకు రూ.5వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడూ 10నెలలు గడుస్తున్నా.. పట్టించుకున్న నాథుడేలేరు.

క్రీడాకారులకు ప్రోత్సాహం ఏది?

శిక్షణ శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు భవిష్యత్‌లో ప్రోత్సాహం అందిస్తామని నగరపాలక పాలకులు ఐదేళ్లుగా ఆచరణలో విఫలం అయ్యారని పలువురు అంటున్నారు. ఏ ఒక్క ఏడాది కూడా క్రీడాకారులను ప్రోత్సహించిన దాఖలు లేవని చెబుతున్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచాం



గత ఐదేళ్లుగా వుషులో శిక్షణనిస్తున్నా. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచుతున్నాం. కేవలం మా కృషి వల్లే 1500మందితో మొదలైన శిబిరాలు నేడు 3వేలకు పైగా చేరింది. కోచ్‌లు చాలా శ్రమించారు. అలాంటి మాకు గౌరవ వేతనం నేటికి ఇవ్వకపోవడం బాధాకరం.

– శేఖర్, వుషు కోచ్

ఏటా ఇదే తంతు




నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఐదుసార్లు నిర్వహించిన శిబిరాల్లో కరాటేలో కోచింగ్ ఇచ్చాను. మేం విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచేలా కృషి చేశాం. ప్రతీరోజు ఉదయం 5.45 నిమిషాలకు రోల్ కాల్‌లో పాల్గొన్నాం.ఆ కనీస గౌరవ వేతనం కూడా నేటికి ఇవ్వకపోవడం బాధాకరం.

– ప్రవీణ్, కరాటే కోచ్

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- రాజకీయ పార్టీలకు సకాలంలో అనుమతులివ్వండి
- అధికారులతో కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్/కరీంనగర్: ఎన్నికల కోడ్ క్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకుల ప్రచారానికి సకాలంలో అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మొదటి విడత పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించిన వివరాలను ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలు, ర్యాలీలకు రాజకీయ పార్టీల నేతలు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు అధికారులు చెక్ చేసుకుని ఇన్‌టైంలో అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. సువిధ కింద రానివాటికి అధికారులను సంప్రదించాలని తెలిపారు. కోడ్ ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, సీపీవో కొమురయ్య, డీపీవో రవీందర్, డీఐవో శివరాములు, ఎస్వో దత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ ఒకటి నుంచి ధాన్యం కొనండి

ఏప్రిల్ ఒకటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీఎస్ ఎ.శాంతికుమారి కలెక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు తాగునీటి వసతి కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని, గన్నీ సంచులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ మండలంలో ఏప్రిల్ 1న ఒక్కో కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని, ఏప్రిల్ 10వరకు పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను తెరవాలని స్పష్టం చేశారు. కాగా జిల్లాలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అవసరమైన చోట బోర్‌వెల్స్, పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు.

క్లుప్తంగా

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు


బోల్తాపడిన కారు

వేములవాడరూరల్: కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న కారు రోడ్డుపై కుక్కను తప్పించబోయి బోల్తా పడిన ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ అర్బన్ మండల పరిధి కొడుముంజ నందికమాన్ మీదుగా మోసిన్, రషీద్ కారులో సిరిసిల్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై కుక్క కనిపించడంతో దానిని తప్పించే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన ఇరువురిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

పెద్దపల్లిరూరల్: గోపయ్యపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పల్లె రాజం మంగళవారం బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డ ప్రమాదంలో చేయి విరిగింది. రాజం పనినిమిత్తం కమాన్‌పూర్ వెళ్లి తిరిగి వస్తుండగా గుండారం – సబ్బితం ప్రాంతంలో బైక్ అదుపుతప్పి కిందపడి పోయాడు. స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందిస్తున్నారు.

యువకుడి నేత్రాలు సజీవం


శివకుమార్(ఫైల్)

కరీంనగర్‌టౌన్: పెద్దపల్లి జిల్లా రొంపికుంట గ్రామానికి చెందిన తాళ్ల శివకుమార్(23) రోడ్డు ప్రమాదంలో మరణించగా... మహాదేవ సేవా ఫౌండేషన్ కరీంనగర్ అధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులను ఒప్పించి నేత్రదానం చేయించారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రామమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ వారు నేత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు అవారి రాజ్ కుమార్ మాట్లాడుతూ నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపు ప్రసాదించడం జరుగుతుందన్నారు. నేత్ర, అవయవ దానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడాల సుమంత్, తడిగోపుల అజయ్, వడ్లకొండ అనిల్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వారి నుంచి రూ.18,500 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాజన్నకు రూ.2 కోట్ల ఆదాయం


హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 21 రోజుల్లో రూ.2.21 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య స్వామివారి హుండీలలోని డబ్బులను ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లెక్కించారు. 21రోజుల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. అలాగే 463 గ్రాముల బంగారం, 19.800 కిలోల వెండి సమకూరినట్లు వివరించారు.

రాజన్న కల్యాణ వేదిక మార్పు

- చైర్మన్ చాంబర్ ఎదుట కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు
- రేపు రాజన్న కల్యాణం
- చొరవచూపిన ప్రభుత్వ విప్

సాక్షి ఎఫెక్టు


శివకల్యాణోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

వేములవాడ: ఏటా శివకల్యాణోత్సవంలో భక్తులు పడిన ఇబ్బందులు అన్నీఇన్ని కావు..ఈక్రమంలో 'భక్తులు పడుతున్న తిప్పలు'.. 'ఇరుకైన ప్రదేశంలో ఇలవేల్పు కల్యాణం' అనే కథనాలకు స్పందించిన ఆలయ అధికారులు ఎట్టకేలకు పార్వతీరాజరాజేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని చైర్మన్ చాంబర్ ఎదు ట నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. భారీ కల్యాణ వేదిక, గుడి పరిసరాల్లో శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు కల్యాణం వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కేవలం ఆలయంలోని అద్దాల మంటపంలో ఇరుకైన ప్రదేశంలో కల్యాణోత్సవం జరిగేది. దీంతో కేవలం తక్కువ సంఖ్యలో భక్తులు డైరెక్ట్‌గా కల్యాణం వీక్షించేవారు. ఈక్రమంలో ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు, శృంగేరి పీఠాధిపతుల అనుమతులు తీసుకుని వేదికను మార్పు చేయించారు. దీంతో భక్తుల తిప్పలు తప్పనున్నాయి. చలవపందిళ్లు, బారికేడ్లు, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

ఈనెల 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు రాజన్న ఆలయంలో నిర్వహించే శివకల్యాణోత్సవాలకు ప్రధానాలయంతోపాటు పరిసరాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానాలయంలోని కోడెలు కట్టే ప్రదేశంలో ప్రత్యేక యాగశాల ఏర్పాటు చేశారు. ఈనెల 28న ఉదయం 10.50 గంటల నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామివారల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 30న సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం భక్తులు, శివపార్వతులు, జోగినులు, హిజ్రాల నృత్యాల మధ్య మెయిన్‌రోడ్డులో నిర్వహించనుండగా, రథాలను సిద్ధం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న నృసింహుడి బ్రహ్మోత్సవాలు


దక్షిణ దిగ్యాత్రకు వెళ్తున్న శ్రీలక్ష్మీనృసింహుడు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో ఏడో రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఆలయ అధికారులు, మున్సిపల్ అధికారులు సకల సౌకర్యాలు కల్పించారు. పాత టీటీడీ కల్యాణ మండపంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ముందుగా భక్తులు పవిత్ర గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. ఆర్మూర్, నిర్మల్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆలయం నుంచి శోభాయాత్ర

దక్షిణ దిగ్యాత్ర సందర్భంగా ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అశ్వవాహనంపై శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒగ్గు డోలు కళాకారుల విన్యాసాలు, డీజే సౌండ్స్, పోలీసుల నృత్యాల మధ్య స్వామివారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పోలీస్ అధికారులు ఆలయానికి వెళ్లి స్వామివార్లను స్టేషన్‌కు ఆహ్వానించారు. అనంతరం శోభాయాత్రగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, డీఎస్పీ రఘుచందర్, ఎస్సైలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

కలిసి ఉండేందుకు నిరాకరించిందని..

- యువతిని హత్య చేసిన నిందితుని అరెస్ట్
- రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు..


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నీలం రవి

మల్యాల(చొప్పదండి): ప్రేమించి పెళ్లి చేసుకుని.. కుటుంబ కలహాలతో విడాకులు తీసుకున్నాక మళ్లీ కలిసి ఉందామని నమ్మించాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఆమె గొంతు నులిమి చంపేశాడు. ఈనెల 17న జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను మల్యాల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఐ నీలం రవి విలేకరులకు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా ముంద్రాయి మండలం నంగనూర్‌కు చెందిన కరిపె అంజలి జగిత్యాలలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుండగా గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన కొల్లూరి నరేశ్‌తో 2018లో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి 2020లో వివాహం చేసుకున్నారు. కుటుంబ కలహాలతో 2022లో విడాకులు తీసుకున్నారు. అనంతరం అంజలిని యాద్రాద్రి జిల్లా గుండాల మండలం మాసంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డికిచ్చి వివాహం జరిపించారు. అయినా నరేశ్ అంజలికి తరచూ ఫోన్ చేసి మళ్లీ కలిసి జీవిద్దామంటూ వేధించేవాడు. ఈ క్రమంలో ఈనెల 17న అంజలి జగిత్యాల కొత్త బస్టాండ్‌కు రాగా.. నరేశ్ ఆమెను బైక్‌పై జాబితాపూర్ మీదుగా అగ్గిమల్ల వైపు తీసుకెళ్లాడు. మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులోకి రాగానే అంజలి నిలదీయడంతో తనను మోసం చేసి, మరొకరిని ఎలా వివాహం చేసుకుంటావంటూ రోడ్డు పక్కన బైక్ నిలిపి.. అంజలిని కొట్టి, గొంతు నులిమి చంపి మృతదేహాన్ని సమీపంలోని చిన్న కాలువలో పడేసి వెళ్లాడు. అంజలి తల్లి రజిత మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ముత్యంపేటలోని కొండగట్టు బస్టాండు వద్ద బైక్‌పై పారిపోతుండగా నరేశ్‌ను పట్టుకుని విచారణ చేపట్టారు. ఇందులో అంజలిని తానే గొంతు నులిమి చంపినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడి నుండి బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని.. నరేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ నీలం రవి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన కాంగ్రెస్

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఎండిన వరి పంట పరిశీలన



ముత్తారం(మంథని): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రైతులకు కన్నీళ్లు మిగిల్చిందని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సీతంపల్లి, ఇప్పలపల్లి(రామకృష్ణాపూర్)లో సాగునీరు అందక ఎండిన వరి పంటను జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. కేసీఆర్ ప్రభుత్వంలో గుంట కూడా ఎండ లేదన్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో రాష్ట్రంలో 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు లేని తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రైతులు ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయకట్టుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎండిన పంటలు పరిశీలిస్తున్నామని తెలిపారు.

మల్లాపూర్‌లో రూ.85వేల నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో ఎస్సై కిరణ్‌కుమార్


తనిఖీ చేస్తున్న పోలీసులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద మంగవారం సాయంత్రం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.85వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాల తనిఖీ చేస్తుండగా.. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.85వేలను స్వాధీనం చేసుకుని గ్రీవెన్స్‌సెల్‌కి అప్పగించినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ కానిస్టేబుళ్లు సురేశ్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.54,500 నగదు పట్టివేత

మల్యాల(చొప్పదండి): సరైన పత్రాలు లేకుండా రూ.54,500 తీసుకెళ్తున్న వాహనదారుడి నుంచి మల్యాల పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. మండలంలోని ముత్యంపేట కొండగట్టు బస్టాండ్ వద్ద ఎస్సై అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. నిర్మల్ మండలం లోకేశ్వరం మండలానికి చెందిన నిమ్మ శివన్న వాహనంపై కరీంనగర్ నుంచి లోకేశ్వరం వైపు వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో రూ.54,500 పట్టుబడింది. డబ్బులకు ఆధారాలు లేకపోవడతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.లక్షా 52వేల 800 నగదు స్వాధీనం చేసుకున్నారు. సిరిసిల్లకు చెందిన కట్ట సతీశ్ ఎటువంటి ఆధారాల్లేకుండా రూ.92,800, మండలంలోని గోరింటాలకు చెందిన బండ సత్తవ్వ ఎలాంటి ఆధారాల్లేకుండా రూ.60వేల నగదు తీసుకెళ్తుండగా.. విచారించి సీజ్ చేశారు. ఎన్నికల విభాగం సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

పడగ విప్పిన పొలి పగ

- భూ తగాదాలతో ఇద్దరు బలి
- ఒకరు ఆత్మహత్య.. మరొకరి హత్య
- జగిత్యాల జిల్లా ధర్మపురిలో విషాదం


పులి రేణుక మృతదేహం


హత్యకు గురైన పులి పద్మ

ధర్మపురి: సాగు భూమి విషయంలో తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె భర్త.. దీనంతటికీ ఓ మహిళ కారణమని భావించి కల్లు గీసే ఉలితో గొంతుకోసి హత్య చేశాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కమలాపూర్‌లో విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పులి లస్మయ్య, గంగన్న వరుసకు అన్నదమ్ములు. లస్మయ్య, గంగన్న ఇద్దరూ గీతవృత్తిదారులు. ఇరువురి భార్యలు బీడీలు చుడుతుంటారు. పక్కపక్కనే ఇరువురికీ భూమి ఉంది. కొంతకాలంగా వారిమధ్య గెట్ల పంచాయితీ నడుస్తోంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గంగన్న భార్య రేణుక (50) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త గంగన్న సాయంత్రం ఇంటికొచ్చేసరికి వేలాడుతూ కనిపించింది. తన భార్య రేణుకను లస్మయ్య కుటుంబ సభ్యులే చంపారని భావించిన గంగన్న ఆవేశంతో వెళ్లి లస్మయ్య భార్య పద్మ (45)ను కల్లు గీసే ఉలితో మెడపై కోశాడు. దీంతో పద్మ రక్తపుమడుగులో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే భర్త లస్మయ్య ఇంటికి చేరుకుని భయాందోళనతో పరుగులు తీశాడు. ఆత్మహత్య చేసుకున్న రేణుకకు ఇద్దరు కుమారులు ఉన్నారు. హత్యకు గురైన పద్మకు కుమారుడు, కూతురు ఉన్నారు.

శోక సంద్రంలో రెండు కుటుంబాలు

పులి రేణుక ఆత్మహత్య చేసుకోవడం.. పద్మ హత్యకు గురికావడంతో రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. పద్మ ఇంట్లోకి పోలీసులు ఎవరినీ అనుమతించలేదు. రేణుకను లస్మయ్య కుటుంబమే ఉరివేసి చంపారంటూ గంగన్న రోదిస్తూ తెలిపాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గ్రామానికి చేరుకొని ఇరు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మహత్య, హత్యకు గల కారణాలు దర్యాప్తులో తేలనున్నాయని, సంఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ఎల్‌ఎండీ ఎగువకు ఏప్రిల్ 2 వరకే సాగునీరు


ఎస్సారెస్పీ నుంచి స్టేజీ–2కు విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టు (జోన్–2)కు ఏప్రిల్ రెండోతేదీ వరకే సాగునీరు అందించనున్నట్లు ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. ఎస్సారెస్పీలో నీటి మట్టం 17.183 టీఎంసిలకు పడిపోవడంతో ఎల్‌ఎండి దిగువ భాగం (జోన్–1) ఆయకట్టుకు ఈనెల 25వరకే నీటి విడుదల నిలిపివేశారు. కాకతీయ కాలువ ప్రారంభం నుంచి డి–53 (జగిత్యాల ప్రాంతం) వరకు కాలువ తూములను ప్రాజెక్టు అధికారులు మూసివేశారు. ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో మిగిలిన నీటిని తాగునీటి అవసరాలకు నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి లక్ష్మీకెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300, అలీసాగర్ ఎత్తిపోతలకు 347, గుత్ప ఎత్తిపోతలకు 146, మిషన్ భగీరథ కింద కోరుట్ల, జగిత్యాల, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ ప్రాంతాలకు 231క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో రోజుకు 432 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

విషాదం నింపిన కోడిగుడ్డు వివాదం

- చికిత్స పొందుతూ మహిళ మృతి


రమ (ఫైల్)

జగిత్యాలరూరల్: కోడిగుట్టు వివాదం విషాదం నింపింది. ఈ గొడవలో కొడవలి వేటుకు గురైన మహిళ తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయింది. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిపల్లి సురేశ్–రమ(40)దంపతులకు కొడుకు రిషివర్ధన్, కుమార్తె వాణి ఉన్నారు. సురేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. వీరి కుమార్తె వాణిని ఇదే గ్రామానికి చెందిన బోగ ప్రకాశ్ అనే యువకుడు కొద్ది రోజుల క్రితం పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సురేశ్, రమ దంపతులు నిరాకరించారు. కక్ష పెంచుకున్న ప్రకాశ్ సోమవారం జరిగిన హోలీ వేడుకల్లో రమ ఇంట్లోకి కోడిగుడ్డు విసిరాడు. దీంతో రిషివర్ధన్ తమ ఇంట్లోకి కోడిగుడ్డు ఎందుకు విసిరావని ప్రకాశ్‌ను నిలదీయగా రిషివర్ధన్‌పై దాడిచేశాడు. స్థానికంగా ఉన్న వారు రిషివర్ధన్ తల్లి రమకు సమాచారం అందించడంతో అక్కడకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రకాశ్ కొడవలితో రమ మెడపై దాడి చేశాడు. గొంతుకు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలి కొడుకు రిషివర్ధన్ ఫిర్యాదు మేరకు ప్రకాశ్‌పై హత్య కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐఆరీఫ్ అలీఖాన్, రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

గ్రామంలో విషాదం

తిప్పన్నపేట గ్రామంలో మేడిశెట్టి రమ హోలీ సంబరాల్లో కోడిగుడ్డు వివాదంలో హత్యకు గురికాగా గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం అందరు మహిళలతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్న రమ హత్యకు గురికావడం గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. దుబాయ్‌లో ఉన్న ఆమెభర్త సురేశ్ మంగళవారం స్వగ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

చిట్టిగుండెకు పెద్దకష్టం

- చిన్నారి గుండెకు రంధ్రం
- రేషన్‌కార్డు లేకపోవడంతో వైద్యానికి వర్తించని ఆరోగ్యశ్రీ
- ఇప్పటికే రూ.6 లక్షల ఖర్చు
- మరో రూ.7 లక్షలు అవసరం
- దాతల కోసం పేద కుటుంబం ఎదురుచూపు


తల్లిదండ్రులతో అక్షర

గంగాధర: రెక్కాడితే కానీ డొక్క నిండని పరిస్థితి ఆ కుటుంబానిది. అయినా చెరోకష్టం చేసుకుంటూ ఆ దంపతులు వారి ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నారు. పెద్ద కూతురు గుండెకు రంధ్రంతో జన్మించగా.. ఎనిమిదేళ్లుగా మందులు వాడుతోంది. శాశ్వత పరిష్కారం కోసం ఆపరేషన్ చేయాల్సి ఉండగా.. ఆ కుటుంబానికి రేషన్‌కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు. ఇప్పటికే మందులకు రూ.6లక్షలకు పైగా ఖర్చుచేయగా.. శాశ్వత పరిష్కారానికి ఆపరేషన్ చేయాలంటే మరో రూ.7లక్షలు అవసరం కానున్నాయి. పేద కుటుంబం కావడంలో దాతలకోసం ఎదురుచూస్తున్నారా దంపతులు. గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన రామగిరి నరేశ్–శిరీష దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు అక్షరకు ఎనిమిదేళ్లు. పుట్టుకతోనే గుండెకు రెండు రంధ్రాలు ఏర్పడ్డాయి. సమస్యను పరిశీలించిన వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నారు. ప్రస్తుతం ఒక హోల్ కూరుకుపోగా.. మరొక రంధ్రం సమస్యను తీవ్రం చేస్తోంది. ఈ హోల్‌తో చెడురక్తం, మంచి రక్తం కలిసి వెళ్తుండడంతో తీవ్ర అనారోగ్యపాలవుతోంది. నిత్యం నీరసం, జ్వరం, ఆయాసంతో బాధపడుతోందని తల్లిదండ్రులు తెలిపారు. త్వరగా ఆపరేషన్ చేయిస్తే ఆరోగ్యం మెరుగవుతుందని, రేషన్ కార్డు ఉంటే ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని, లేకుంటే రూ.7లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పినట్లు వెల్లడించారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసి ఏళ్లు గడుస్తోందని, తమ సమస్యపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. తమ కూతురు వైద్యానికి దాతలు సహకరించాలని వేడుకుంటున్నారు.

రైలింజన్‌లో పొగలు


రామగుండంలో నిలిచిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

రామగుండం: జాస్దియా(ఛత్తీస్‌గఢ్) జంక్షన్ నుంచి వాస్కోడగామ(గోవా) వెళ్తున్న రైలు ఇంజన్(నంబరు 17322)లో మంగళవారం రాత్రి పొగలు వచ్చాయి. అప్రమత్తంగా వ్యవహరించిన లోకోపైలట్లు రామగుండంలో రైలు నిలిపివేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం పెద్దంపేట రైల్వేస్టేషన్ దాటిన తర్వాత రైలింజన్ నుంచి స్వల్పంగా పొగలు రావడాన్ని లోకోపైలట్లు గమనించారు. ఆ వెంటనే రామగుండం రైల్వే లోకో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రామగుండం చేరుకోగానే రైలు నిలిపివేశారు. మంచిర్యాలకు మంగళవారం మధ్యాహ్నం 2.34 గంటలకు చేరుకోవాల్సిన వాస్కోడగామ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు.. ఐదు గంటల ఆలస్యంగా రాత్రి 7.09 గంటలకు మంచిర్యాలకు చేరుకుంది. తర్వాత కాజీపేటలోనే హాల్టింగ్ ఉండగా రైలింజన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో పొగలు రాగా రామగుండంలో అత్యవసరంగా నిలిపివేశారు. స్థానిక లోకో ఉన్నతాధికారులు దానిని వేరుచేసి మరో ఇంజన్‌ను తగిలించి రైలును పంపించారు. రామగుండంలో రెండు గంటల ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మద్యం మత్తులో మైనర్ల హంగామా

- నడిరోడ్డుపై తన్నుకున్న వైనం
- చైల్డ్ వెల్ఫేర్ అధికారులపై రాళ్లు రువ్విన బాలురు


పారిపోతున్న బాలుడిని పట్టుకున్న చైల్డ్‌వెల్ఫేర్ సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని విద్యానగర్ బైపాస్‌రోడ్‌లో పోచమ్మవాడకు చెందిన నలుగురు మైనర్ బాలురు అతిగా మద్యం సేవించి మంగళవారం సాయంత్రం హంగామా సృష్టించారు. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. భయభ్రాంతులకుగురైన స్థానికులు 1098కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేసరికి ముగ్గురు బాలురు విద్యానగర్ వైపు పారిపోయారు. ఓ బాలుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా సిబ్బందిపై రాళ్లు రువ్వారు. చైల్డ్‌వెల్ఫేర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి బాలుడిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌లోని ఓ వసతి గృహానికి తరలించినట్లు సమాచారం.

నదిలో దూకేందుకు యువకుడి యత్నం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకేందుకు ప్రయత్నించిన యువకుడిని పోలీసులు కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం.. కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం గోదావరి నదిలో దూకేందుకు వస్తున్నట్లు టూటౌన్ సీఐ రవీందర్‌కు సమాచారం అందింది. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో గోదావరి బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఎస్‌టీం పోలీసులకు సీఐ వెంటనే సమాచారం అందించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ జంపయ్య, కానిస్టేబుల్ పూర్ణచందర్ ఆ యువకుడిని గమనించి నదిలో దూకకుండా అడ్డుకున్నారు. తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి తన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా

జస్టిస్ నవీన్‌రావుకు ఎంపీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: జస్టిస్ నవీన్‌రావు తల్లి ఇటీవల మృతిచెందగా ఎంపీ బండి సంజయ్ మంగళవారం జ్యోతినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

సీఎంను కలిసిన మున్నూరుకాపు నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్/కరీంనగర్ టౌన్: సీఎం రేవంత్ రెడ్డిని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేశ్ మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. మున్నూరుకాపుల సమస్యల పరిష్కారం, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ట్రస్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వీటికి స్పందించిన సీఎం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, నాయకులు వాసాల రాజు, వాసాల వెంకటేశ్వర్లు, మంగళారపు తిరుపతి, వాసాల శ్రీనివాస్, వాసాల తిరుపతి, శ్రీమూర్తి శ్రీనివాస్, బొమ్మ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో పూజలు



పూజలు చేసిన మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: స్థానిక చిన్నగుట్ట వేంకటేశ్వరాలయంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర, హనుమాన్ దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ ఎన్.నారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను గుర్తించాలి

కరీంనగర్ కార్పొరేషన్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను ప్రభుత్వం గుర్తించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. దళితులకు ఇచ్చిన భూములను కళాశాలలు, గ్రానైట్ క్వారీల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. పెత్తందారుల చేతుల్లో ఉన్న ఇలాంటి భూములను తాము కూడా గుర్తించే పనిలో ఉన్నామని, ఈ జాబితాతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి, దళితులకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

‘ఆటోడ్రైవర్ల సమస్యలపై పోరాటం చేస్తాం’

మానకొండూర్: ఆటోడ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆటోడ్రైవర్లు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి కార్మికుల పొట్ట కొట్టిందని, కార్మికుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎండా కాలంలో కూడా చెరువులు, కుంటలు నిండుకుండలా ఉండేవని ప్రస్తుతం సాగుకు కూడా ప్రభుత్వం నీటిని అందివ్వలేకపోతుందన్నారు. కరీంనగర్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయించానని, దేవుడి పేరు చెబుతూ బీజేపీ ఓట్లు దండుకోవాలనకుంటుందన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ జడ్పీచైర్మన్ తుల ఉమ, నాయకులు గెల్లి శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని ఇంటి, నల్ల, ట్రేడ్‌లైసెన్స్, వ్యాపార వాణిజ్య సంస్థలకు చెందిన యజమానులు పన్నులు చెల్లించి, మున్సిపల్ ఆదాయం పెంచేందుకు సహకరించాలని మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యాపార సంస్థల పన్నుల వసూలు కార్యక్రమం నిర్వహించారు. మార్చి 31 వరకు పన్నుల చెల్లింపులో వడ్డీ మాఫీ ఉందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

బాలాజీనగర్‌కు అధికారులు

- కాలనీలో మురికినీటిని పరిశీలించిన అదనపు కలెక్టర్, ఆర్డీవో, కమిషనర్
- సమస్య పరిష్కరిస్తామని హామీ



బాలాజీనగర్‌లో మురికి నీరు



స్థానికులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ పక్కనున్న బాలాజీనగర్ కాలనీలో డ్రైనేజీ పంచాయితీ నెలకొంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురికినీరు ఈ కాలనీకి చేరుతోంది. మెయిన్ రోడ్‌లోని డ్రైనేజీకి వెళ్లే మార్గం లేకపోవడంతో వీ పార్క్ హోటల్ వెనకాల చిన్నపాటి కుంటను తలపిస్తోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని, మురికి నీటిని ఇక్కడి నుంచి మళ్లించాలని స్థానికులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్ కాలనీకి వెళ్లారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. డ్రైనేజీకి అడ్డుగా ఉన్న ప్రైవేట్ భూమిలో ప్రభుత్వ భూమి ఉందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు సర్వే చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా సదరు భూ యజమానికి నోటీసు ఇచ్చి, కచ్చా కాలువ ద్వారా మురికి నీటిని మళ్లించాలని అధికారులను సూచించారు.

సమస్య ఇదీ..

కరీంనగర్‌లోని 21వ డివిజన్ పరిధి బాలాజీనగర్ ప్రజలను డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. రాంనగర్, విద్యానగర్, శాతవాహన యూనివర్సిటీ, హరిహరనగర్ తదితర ఎగువ ప్రాంతాల నుంచి మురికి నీరు వర్క్‌షాప్ పక్కనుంచి జగిత్యాల ప్రధాన రహదారి డ్రైనేజీలోకి చేరుతుంది. కానీ, వర్క్‌షాప్ పక్కనున్న స్థల యజమాని కొన్ని నెలల క్రితం అడ్డుగా గోడ నిర్మించాడు. దీంతో మురికి నీరు బయటకు వెళ్లే మార్గం లేక అక్కడే నిలుస్తోంది. వేసవిలోనూ ఇక్కడ మురికి నీటి కుంట ఏర్పడిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో ఆక్రమణలు అధికంగా ఉండటం, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో మెయిన్ రోడ్డును వరద నీరు ముంచెత్తుతుంది. ఇదిలా ఉంటే మురికి నీటి కారణంగా తాము ఇళ్లలో ఉండలేకపోతున్నామని అధికారులకు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. మురికి నీరు తమ ప్రాంతం నుంచి తొలగించాలని, లేదంటే ఎగువ నుంచి రాకుండా తామే అడ్డుకట్ట వేస్తామని తేల్చిచెబుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



కాలనీవాసులందరం మురికి నీటితో బాధ పడుతున్నాం. ఇతర కాలనీలకు చెందిన డ్రైనేజీ నీరంతా మా కాలనీలోనే చేరి, కుంటలా మారింది. ఇక్కడి నుంచి బయటకు వెళ్లే దారి లేదు. అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– నాంపల్లి శ్రీనివాస్, బాలాజీనగర్

డ్రైనేజీ నిర్మిస్తాం

మురికి నీటికి అడ్డుగా ఉన్న ప్రైవేట్ భూమిలో ప్రభుత్వ భూమి కొంత ఉందని ఫిర్యాదు అందింది. దీనిపై బుధవారం సర్వే చేపడుతాం. ప్రభుత్వ భూమి ఉందని తేలితే అందులో నుంచి డ్రైనేజీ నిర్మిస్తాం. ప్రైవేట్ భూమి అని తేలితే ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తాం. తాత్కాలికంగా మురికి నీటిని తొలగిస్తున్నాం.

– శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్



ఇసుక ట్రాక్టర్లకు బేడీలు

తీవ్రమైన నేరాలు చేసినవారిని అదుపులోకి తీసుకున్నప్పుడు, కళ్లుగప్పి పారిపోయే అవకాశం ఉన్న వారిని జైలుకు తరలించేటప్పుడు బేడీలు వేయడం సహజం. కానీ, కరీంనగర్ టూ టౌన్ పోలీసులు మాత్రం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని, ఠాణా ఎదుట ఉంచారు. ఎవరూ లేని సమయంలో సంబంధిత డ్రైవర్లు, యజమానులు వాటిని తీసుకెళ్తారని భావించి, రెండింటినీ లింక్ చేస్తూ బేడీలు వేశారు. పోలీస్‌స్టేషన్ ముందు నుంచి వెళ్తున్నవారు వింతగా చూస్తున్నారు. ఈ దృశ్యాన్ని ‘సాక్షి’ మంగళవారం తన కెమెరాలో బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



నడిరోడ్డుపై వాహనాల పార్కింగ్

కరీంనగర్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. వాహనదారులు నడిరోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. మదీనా కాంప్లెక్స్ ఎదుట పొట్టి శ్రీరాములు, జయశంకర్ విగ్రహాల మధ్యలో ఉన్న స్థలంలో, ఐలాండ్ చుట్టూ కార్లు, ఆటోలు నిలుపుతున్నారు. దీంతో టవర్ సర్కిల్ వైపు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ సిబ్బంది ఎన్నిసార్లు హెచ్చరించినా వాహనదారులు పట్టించుకోవడం లేదు. పార్కింగ్ స్థలం చూపిస్తే అక్కడే చేస్తామని, పే పార్కింగ్ అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

స్మార్ట్‌సిటీ పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో కొనసాగుతున్న స్మార్ట్‌సిటీ పనుల్లో వేగం పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశించారు. స్మార్ట్‌సిటీ పనుల పరిస్థితిపై అధికారులు, కాంట్రాక్టర్లతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్న అధికారులు

విద్యానగర్: ఆర్టీసీ కరీంనగర్–1 డిపోలో బుధవారం సంస్థ ఉద్యోగులకు అధికారులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ షేక్ నజీర్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఇల్లందకుంట(హుజూరాబాద్): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని సిరిసేడులో జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు ఐదేళ్లకోసారి వస్తాయని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై రాజ్‌కుమార్, ఏఎస్సై రవి, స్థానికులు పాల్గొన్నారు.

అన్నారంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో తంటా

- నెల రోజుల్లో రెండుసార్లు కాలిపోయిన వైనం
- దీని పరిధిలో 20 ఎకరాల్లో వరి పంట
- నీరందక రైతుల ఇబ్బందులు



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

మానకొండూర్/కొత్తపల్లి(కరీంనగర్): కరెంట్ ఉన్నా వినియోగించుకోలేని, నీరు ఉన్నా పొలాలకు పారించలేని దుస్థితి. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. టీఎస్ఎన్‌పీడీసీఎల్ అల్గునూర్ సబ్ డివిజన్ మానకొండూర్ మండలంలోని అన్నారంలో 186 నంబర్ ట్రాన్స్‌ఫార్మర్ గత నెల 22న కాలిపోయింది. దీని పరిధిలో 20 ఎకరాల పొలాలున్నాయి. పొట్ట దశలో ఉన్న పంట నీరందకపోతే ఎండిపోతుందని ఆందోళన చెందిన రైతులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్గునూర్ సబ్ డివిజన్‌కు తీసుకెళ్లారు. సొంత ఖర్చులతో దాని స్థానంలో మరొకటి బిగించారు. కానీ, అది కూడా కాలిపోయింది. దీనికి అధిక లోడ్ కారణం కావడంతో ఏమీ చేయలేమని విద్యుత్ అధికారులు చేతులెత్తేయడంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. కెనాల్ నీటితో కొంతమేర పొలాలను కాపాడుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో అందడం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా ట్రాన్స్‌ఫార్మర్ పొలాల మధ్యలో ఉండటం, రిపేరింగ్‌కు తీసుకెళ్లినప్పుడు పంట నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, వేలాడుతున్న వైర్లతో భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్‌కు త్వరితగతిన మరమ్మతు చేయించి, పంటలను కాపాడాలని తాళ్ల శేఖర్, పాకాల మల్లారెడ్డి, టి.రాజయ్య, శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య తదితరులు కోరుతున్నారు.

లోడ్ వల్లే సమస్య..

అన్నారం ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ ఉండటం వల్ల తరచూ ఫ్యూజ్‌వైర్ పోయి సమస్య ఏర్పడుతోంది. దీని కింద 5 హెచ్‌పీ ఐదు మోటార్లకు మాత్రమే విద్యుత్ శాఖ అనుమతి ఉండగా.. మరో రెండు 7.5 హెచ్‌పీ మోటర్లను వాడుతున్నారు. అదనపు లోడ్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతులు విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. అప్పటివరకు సమస్య పరిష్కారానికి సహకరించాలి.

– ఫసి అహ్మద్, ఏఈ, మానకొండూర్

ఆర్ఎంపీ, పీఎంపీలకు ఐడీ కార్డులు

హుజూరాబాద్: ఆర్ఎంపీ(రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్), (ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనర్) పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ పెట్టుకోకూడదని, సంబోధించకూడదని ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూచన సమ్మయ్య అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మంగళవారం హుజూరాబాద్‌కు వచ్చారు. సమ్మయ్యను హుజూరాబాద్ డివిజన్ ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికి సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ దవాఖానాలకు సిఫారస్ చేయాలని సూచించారు. త్వరలో ఐడీ కార్డులు అందజేస్తామన్నారు. జిల్లా సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించి సమస్యల పరిష్కరించేలా కోరుదామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సొల్లు మహేందర్, మాధవరెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, సదానందం, దేవేందర్, మహేశ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

రూ.70 వేలకు చేరువలో బంగారం

- 10 గ్రాములు రూ.68,700
- పెళ్లిళ్ల సీజన్‌తో రేటు మరింత పెరిగే అవకాశం



రెడీమేడ్ నగలు కొంటున్న వినియోగదారులు

విద్యానగర్: భారతీయ సంప్రదాయంలో బంగారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. ఏ చిన్న శుభకార్యం జరిగినా బహుమతి రూపంలో ఇవ్వడం, ఆభరణాలు చేయించుకోవడం పరిపాటి. దీంతో బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆదివారం నాటికి 10 గ్రాములు రూ.68,700 చేరింది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో రేటు మరింత పెరిగే అవకాశం ఉందని స్వర్ణకారులు అంటున్నారు.

నగదు పొందే అవకాశం..

స్థిరాస్తుల కొనుగోలుకు లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. సరిపడా డబ్బులు లేనివారు బంగారు కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బంగారంతో వెంటనే నగదు పొందే అవకాశం ఉండటం ఇందుకు కారణమవుతోంది.

చేతిలో డబ్బుంటే చాలు..

బంగారు ఆభరణాల విక్రయాల్లో కార్పొరేట్ సంస్థలు రంగప్రవేశం చేశాయి. అధునాతన డిజైన్లను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. గాజులు, వడ్డాణాలు, చెవిదిద్దులు, నెక్లెస్‌లు, హారాలు, పాపిడిబిళ్లలు, వంకీలు, పట్టీలు, మాటీలు, జడగంటలు ఇలా ఏవి కావాలంటే అవి లభిస్తున్నాయి. చేతిలో డబ్బుంటే వెంటనే నగలు కొని, ధరించే అవకాశం ఉండటంతో వినియోగదారులు రెడీమేడ్ ఆభరణాలు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఇది కూడా బంగారం ధర పెరగడానికి ఒక కారణం. ఇమిటేషన్ జువెల్లరీతోపాటు స్వచ్ఛమైన బంగారు నగలు అమ్మే బ్రాండెడ్ షాపులు కరీంనగర్‌లో ఉన్నాయి.

షాపులు ఎక్కువయ్యాయి



కరీంనగర్‌లో జువెల్లరీ షాపులు ఎక్కువయ్యాయి. రెడీమేడ్ ఆభరణాల్లో కొత్త కొత్త మోడల్స్ అందుబాటులో ఉండటంతో వినియోగదారులు ఎక్కువగా వాటినే కొనుగోలు చేస్తున్నారు. బంగారం దగ్గర ఉంటే చేతిలో నగదు ఉన్నట్లే.

– అవునూరి భూనాథచారి, స్వర్ణకారుడు, మంచాల కాంప్లెక్స్, తిలక్‌రోడ్, కరీంనగర్

ఆభరణాలంటే ఇష్టం



ఆడవాళ్లకు ఆభరణాలంటే ఇష్టం. ఏమాత్రం వీలు దొరికినా బంగారం కొనడానికే మొగ్గు చూపుతారు. పెళ్లిళ్ల తదితర శుభకార్యాలకు వెళ్లినప్పుడు అందరిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు నగలు ధరిస్తారు. కొనుగోలు చేసేవారి సంఖ్య పెరుగుతుండటంతో బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

– ఎ.మాలతి, గృహిణి, రాంనగర్, కరీంనగర్

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

కరీంనగర్: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని కూలీలకు మంచినీరు, నీడ సౌకర్యం కల్పించడంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. అలాగే, ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకే పనులు చేయించాలని కోరారు. లేకపోతే కూలీలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి రవాణా సదుపాయం కల్పించాలన్నారు. పనికి ముందు, తర్వాత రెండుసార్లు ఫొటో అప్‌లోడ్ చేసే పద్ధతిని వెనక్కి తీసుకోవాలన్నారు. వర్షాలు లేక వ్యవసాయేతర భూములు గట్టిగా మారాయని, అలాంటి ప్రదేశాల్లో కొలతల ప్రకారం పనులు చేయలేకపోవడంతో సరైన వేతనం రాక కూలీలు శ్రమదోపిడీకి గురవుతున్నారని తెలిపారు. సర్కారు స్పందించి, కొలతలు లేకుండా పని కల్పించి, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి



వక్తలను సన్మానించిన అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: పరిశోధనలతోనే సమస్యలకు పరిష్కారం కనిపెట్టాలని కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. కాలేజీలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఇంపార్టెన్స్ ఆఫ్ రీసెర్చ్ అండ్ కెరీర్ గైడెన్స్ అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, అడ్వైజర్‌గా కామర్స్ హెచ్‌వోడీ, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య వ్యవహరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించాలని సూచించారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అమెలోక్ సింగ్ రీసెర్చ్ ప్రాముఖ్యతను వివరించారు. రెండో సెషన్‌లో కెరీర్ గైడెన్స్ అనే అంశంపై సిద్దిపేట కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ గోపాల సుదర్శనం అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఎలాంటి కోర్సులు చేయాలి, వాటి ఉపయోగాలను వివరించారు. ఎక్సెల్, టాలీ, పైథాన్, ఎస్ఏపీ–ఈఆర్‌పీ తదితర కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు.

‘వాగేశ్వరి’లో ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



ఆహార పదార్థాలను రుచి చూస్తున్న అతిథులు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ సరస్వతి, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ స్వరూప, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూప, శాతవాహన యూనివర్సిటీ ఫుడ్ సెన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జోసెఫ్ రాజు, కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూసి, వారిని అభినందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ రత్నగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ సతీశ్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఏవో నిజాముద్దీన్, ఫుడ్ సైన్స్ లెక్చరర్ అరుణ్ కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డైకిన్ సొల్యూషన్ ప్లాజా ప్రారంభం



ప్లాజాను ప్రారంభిస్తున్న కంపెనీ డైరెక్టర్ ఎన్‌కే.రావు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని కమాన్ ప్రాంతంలో డైకిన్ సొల్యూషన్ ప్లాజాను మంగళవారం డైకిన్ ఎయిర్ కండీషన్ కంపెనీ డైరెక్టర్ ఎన్‌కే.రావు ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ గణేశ్ రావు, జగదీశ్, గిరీశ్, ప్రవీణ్, క్రాంతి, కృష్ణసింధు, జీకే ఎంఈపీ ఇంజినీర్స్ డైరెక్టర్ గణేశ్, కుసుమ లలితమ్మ, మహదేవ్, స్వాతి, లక్ష్మి, తోఫిక్, కన్సల్టెన్సీ ఆర్కిటెక్చర్స్, బిల్డర్స్ పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతుతోపాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. 11 కేవీ రామచంద్రాపూర్ కాలనీ ఫీడర్ పరిధిలోని రామచంద్రాపూర్‌కాలనీ, ఏవోస్ కాలనీ, లేక్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

మరో 'యాత్ర'కు సిద్ధం



ఎన్నికల ప్రచార భేరికి ఇడుపులపాయలో ఏపీ సీఎం జగన్ శ్రీకారం

తొలి రోజు కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర

వేంపల్లి, వీరపునాయునిపల్లె, యర్రగుంట్ల మీదుగా కొనసాగనున్న యాత్ర

నేడు ప్రొద్దుటూరు భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఇడుపులపాయ నుంచి ఎన్నికల ప్రచారభేరి మోగించనున్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నివాళులు అర్పించిన అనంతరం 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను ప్రారంభిస్తారు. తొలి రోజు బస్సు యాత్ర కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జరగనుంది. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు మొత్తం 21 రోజులపాటు ఈ బస్సు యాత్ర కొనసాగుతుంది. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తూ 'సిద్ధం' సభలు నిర్వహించిన నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలు మినహా మిగతా పార్లమెంట్ స్థానాల పరిధిలో బస్సు యాత్రను నిర్వహించనున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తాను చేసిన ప్రజా సంకల్ప పాదయాత్ర తరహాలోనే బస్సు యాత్రలోనూ రోజూ ఉదయం వివిధ వర్గాల ప్రజలు, మేధావులతో సీఎం జగన్ మమేకమవుతారు. ప్రభుత్వ పనితీరును మరింతగా మెరుగుపర్చుకోవడానికి వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. సాయంత్రం ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగిస్తారు.

మోసాలను ఎండగడుతూ..

బస్సు యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకూ సీఎం జగన్ పూర్తిగా ప్రజలతో మమేమవుతారు. యాత్ర సందర్భంగా ఎక్కడికక్కడ ఆయా ప్రాంతాల్లో విడిది చేయనున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ప్రతి ఇంటికీ మేలు చేసిన అంశాన్ని సీఎం జగన్ యాత్రలో వివరించనున్నారు. విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో జనసేన–బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేయనున్నారు. వ్యవసాయ, డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని, ఆడపిల్ల పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు డిపాజిట్ చేస్తామని, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తామని, చేనేత, పవర్ లూమ్స్ రుణాలు పూర్తిగా మాఫీ.. లాంటి 650కిపైగా వాగ్దానాలు గుప్పించి పది శాతం కూడా అమలు చేయకుండా వంచించిన వైనాన్ని సీఎం జగన్ ఎండగట్టనున్నారు. నాడు మోసం చేసిన కూటమితోనే జట్టు కట్టి చంద్రబాబు మళ్లీ వస్తున్నారని ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ ఇంటికి మంచి జరిగి ఉంటే ఓటు వేసి ఆశీర్వదించాలని వినమ్రంగా ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నారు.

మరింత పెరిగిన విశ్వసనీయత..

ఎన్నికల్లో హామీల్లో 99 శాతం అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్న సీఎం జగన్ మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు. గత 58 నెలల్లో నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా వివక్ష, లంచాలకు తావులేకుండా 87 శాతం కుటుంబాల ప్రజలకు డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ)తో నేరుగా రూ.2.70 లక్షల కోట్లను ఖాతాల్లోకి జమ చేశారు. నాన్ డీబీటీతో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.4.49 లక్షల కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూర్చారు. దీన్ని సద్వినియోగం చేసుకున్న ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కుతున్నారు. రాష్ట్రంలో పేదరికం 2015–16లో 11.77 శాతం ఉండగా 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు తార్కాణం. విప్లవాత్మక సంస్కరణల ద్వారా విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధి పథంలో నిలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. హామీలన్నీ అమలు చేయడం, సుపరిపాలన అందిస్తుండటంతో సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత మరింతగా పెరిగింది.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నయా జోష్..

చేసిన మంచిని ప్రతి ఇంటికి వివరించి ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలకు జనం బ్రహ్మరథం పట్టారు. సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో బలంగా నాటుకుపోయిన నమ్మకాన్ని ఈ రెండు కార్యక్రమాలు ప్రతిబింబించాయి. ఇది వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. గత 58 నెలల పాలనలో సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రతి ఇంటా.. ప్రతి గ్రామం.. ప్రతి నియోజకవర్గంలో విప్లవాత్మక మార్పులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నప్పుడు 175కు 175 శాసనసభ స్థానాలు, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయబావుటా ఎగురవేయడం కచ్చితంగా సాధ్యమేనని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ సీఎం జగన్ సిద్ధం సభలు నిర్వహించారు. భీమిలి (ఉత్తరాంధ్ర), దెందులూరు (ఉత్తర కోస్తా), రాప్తాడు(రాయలసీమ), మేదరమెట్ల (ఉత్తర కోస్తా)లలో నిర్వహించిన నాలుగు సభలకు జనం కడలితో పోటీపడుతూ పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సభలు అతి పెద్ద ప్రజాసభలుగా నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని సిద్ధం సభలతో తేటతెల్లమైందని రాజకీయ పరిశీలకులు విశ్లేషించారు. జనసేన–బీజేపీతో టీడీపీ జతకట్టినా... సార్వత్రిక ఎన్నికల్లో వార్ వన్‌సైడేనని, వైఎస్సార్‌సీపీ మరోసారి చారిత్రక విజయం సాధించడం తథ్యమని టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్–మాట్రిజ్ లాంటి డజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థల సర్వేలు తేల్చి చెప్పాయి. ఇప్పటికే 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించిన సీఎం జగన్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి ముందే బస్సు యాత్ర ద్వారా తొలి విడత ప్రచారాన్ని పూర్తి చేసేందుకు సిద్ధమవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నయా జోష్ కనిపిస్తోంది.

కూటమి అష్టకష్టాలు..

సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని ప్రజాక్షేత్రంలో ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమని బెంబేలెత్తిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉనికి కోసం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో జట్టు కట్టారు. టీడీపీ–జనసేన పొత్తుల లెక్క తేలాక ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో రెండు పార్టీలూ నిర్వహించిన జెండా సభకు జనం మొహం చాటేయడంతో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. దీంతో రెండు పార్టీల శ్రేణులు కకావికలమయ్యాయి. అనంతరం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడి ఆ పార్టీతో జత కలిశారు. మూడు పార్టీల మధ్య పొత్తు కుదిరాక ప్రధాని మోదీని రప్పించి చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభకు జనం కదలిరాలేదు. ఆ సభ కూడా పేలవంగా సాగడంతో మూడు పార్టీలదీ అవకాశవాద పొత్తులని ప్రజలు తేల్చి చెప్పినట్లయింది. పొత్తు కుదిరినా ఇప్పటికీ మూడు పార్టీలు తమ అభ్యర్థులను పూర్తి స్థాయిలో ప్రకటించలేని దుస్థితి నెలకొంది.

తొలి రోజు యాత్ర ఇలా..

ముఖ్యమంత్రి జగన్ బుధవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు ఇడుపులపాయకు చేరుకుంటారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తారు.

- మధ్యాహ్నం 1.30 గంటలకు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను సీఎం జగన్ ప్రారంభిస్తారు.
- ఇడుపులపాయ నుంచి కుమారునిపల్లి, వేంపల్లి, సర్వరాజుపేట, వీరపునాయనిపల్లి (కమలాపురం), గంగిరెడ్డిపల్లి, ఊరుటూరు, యర్రగుంట్ల (జమ్మలమడుగు), పోట్లదుర్తి మీదుగా సాయంత్రం 4.30 గంటలకి ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభ వద్దకు సీఎం జగన్ చేరుకుంటారు. బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.
- అనంతరం సున్నపురాళ్లపల్లి, దువ్వూరు, జిల్లెల, నాగలపాడు, బోధనం, రాంపల్లె క్రాస్, చాగలమర్రి మీదుగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

'అందరికీ న్యాయం' మన లక్ష్యం

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్



సభలో మాట్లాడుతున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

తిరుపతి సిటీ: 'జస్టిస్ ఫర్ ఆల్' అనేది మన లక్ష్యమని.. అందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, యువత కృషి చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి విచ్చేసిన ఆయన శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సు పదో వార్షికోత్సవ సభలో విద్యార్థులను ఉద్దేంచి ప్రసంగించారు. ఎస్వీయూను 1982లో మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలో తన తండ్రి సందర్శించారని చంద్రచూడ్ గుర్తు చేసుకున్నారు. నాణ్యమైన విద్యకు ఈ యూనివర్సిటీ పెట్టింది పేరని, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ ద్వారా సమాజానికి అత్యున్నతమైన న్యాయవాదులను అందించడం శుభపరిణామమని అన్నారు. లా కోర్సును గతంలో రెండవ డిగ్రీగా చూసేవారని.. డాక్టర్, ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యత ఉండేదన్నారు. ప్రస్తుతం యువత న్యాయశాస్త్ర అభ్యసనానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. న్యాయశాస్త్రం క్రమశిక్షణకు మారుపేరన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆలోచనాశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయమూర్తులు ప్రజల సమస్యలను సావధానంగా వినడం నేర్చుకోవాలని.. తద్వారా కొత్త విషయాలను తెలుసుకోవడానికి వీలుంటుందన్నారు.

సోషల్ ఇంజనీర్లుగా న్యాయవాదులు

సమాజంలో పెద్దఎత్తున మార్పు వచ్చిందని, దేశంలోని అనేక రాష్ట్రాల్లో 50 శాతం పైగా మహిళలు ప్రస్తుతం న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా పనిచేయడం గర్వకారణమని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. సమాజంలో వైద్యులు, ఇంజనీర్ల తరహాలో న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లుగా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించి దేశసేవకు అంకితం కావాలని కోరారు. గురువుల మేధస్సు అసాధారణమైందని.. వారు అందించిన జ్ఞానంతోనే తాను చీఫ్ జస్టిస్ స్థాయికి ఎదిగానని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి యు.దుర్గాప్రసాద్‌రావు, హైకోర్టు న్యాయవాదులు, జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తిరుమల చేరుకున్న సీజేఐ

తిరుమల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. వీరు రాత్రి తిరుమలలో బసచేసి బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

పొత్తు కోసం నేను వెళ్లలేదు

వాళ్లు వస్తేనే పొత్తు పెట్టుకున్నా : చంద్రబాబు

సాక్షి, తిరుపతి: బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో పడిగాపులుగాసిన చంద్రబాబు.. ముస్లింల ఓట్ల కోసం ప్లేటు ఫిరాయించారు. మంగళవారం కుప్పంలో ముస్లింలతో సమావేశం సందర్భంగా బీజేపీ కోరితేనే పొత్తు పెట్టుకున్నట్లు మాట్లాడారు. 'పొత్తు కావాలని నేను వెళ్శలేదు. వాళ్లు వస్తేనే పొత్తు పెట్టుకోవాల్సి వచ్చింది' అంటూ ఆ సమావేశానికి వచ్చిన వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. ఆ తర్వాత విడిపోయి, కాంగ్రెస్ వెంట తిరిగారు. ఇప్పుడు మళ్లీ రాజకీయ అవసరాల కోసం బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడారు. ఈ విషయం కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన అమిత్ షానే స్వయంగా చెప్పారు. 'చంద్రబాబు మమ్మల్ని వదిలేసి ఆయన అంతకు ఆయనే వెళ్లిపోయారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. మళ్లీ ఇప్పుడు మా దగ్గరకు ఆయనంతకు ఆయనే వచ్చారు' అని అమిత్‌షా విస్పష్టంగా చెప్పారు. అయినప్పటికీ నిస్సిగ్గుగా బాబు పొత్తులపై కొత్త వాదనను లేవనెత్తడంపై విమర్శలు వస్తున్నాయి.

ఏపీ బీజేపీలో 'కోట్లకు సీట్లు' బేరాలు

- ఆదోని సీటు వదులుకోవడానికి టీడీపీ నేతతో బీజేపీ నాయకుడి బేరాల ఆడియో లీక్
- రూ.3 కోట్లు ఇస్తే ఆదోని టీడీపీకి వదిలేసి ఆలూరు అడుగుతామని ప్రతిపాదన
- బోర్డులో లక్ష్మణ్ జీ ఉన్నారు.. మేం ఏది చెబితే అదే
- పురందేశ్వరి మేడమ్‌కు కూడా ఇవ్వాలి అంటూ బీజేపీ నేత ప్రతిపాదన
- కలకలం రేపుతున్న ఆడియో

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, కర్నూలు : టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర శాఖలో 'కోట్లుకు సీట్లు' వ్యవహారం పెను సంచలనంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య ఫోను సంభాషణతో కూడా ఓ ఆడియో టేపు మంగళవారం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకొచ్చింది. పొత్తులో బీజేపీకి కేటాయించినట్టు చెబుతున్న ఆదోని నియోజకవర్గాన్ని వదిలేసి, దానికి బదులు ఆలూరు సీటు కోరతామని, అందుకు రూ.3 కోట్లు అవుతుందంటూ ఆదోని నియోజకవర్గానికి చెందని బీజేపీ నాయకుడొకరు ఆ స్థానం టికెట్టు ఆశిస్తున్న టీడీపీ నాయకునికి చెందిన ఓ నాయకుడితో అనడం కమలం పార్టీలో కలకలం రేపుతోంది. ఈ ఆడియోను ఆ ఇద్దరు నాయకుల్లో ఒకరు రికార్డు చేసి సోషల్ మీడియాలో ఉంచినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

ఇదీ జరిగింది..

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీజేపీ, జనసేనకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. బీజేపీ పట్టుబట్టడంతో చంద్రబాబు ఆదోని అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్లు తెలిసింది. దీంతో ఈ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఇంటి వద్ద టీడీపీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు కూడా తొలగించారు. ఈ టిక్కెట్ టిక్కెట్ తనకు లేదా తన కుమారుడు భూపాల్ చౌదరికి ఇవ్వాలని మీనాక్షినాయుడు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ నుంచి మీనాక్షినాయుడు మేనల్లుడు మారుతి నాయుడుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ ఆర్థిక వ్యవహారాలు చూసే అతని సోదరుడు నాగరాజు ఫోన్‌చేసి.. 'రూ. 3 కోట్లు ఇస్తే ఆదోని సీటు వదిలేసి ఆలూరు సీటు కోరతామని, అంతా మన ఇష్ట ప్రకారమే జరుగుతుందంటూ' ఆఫర్ ఇచ్చినట్లు ఆ ఆడియోటేపులో ఉంది. 'మీరు రూ.3 కోట్లు ఇస్తే మాకు ఆలూరు కావాలని చెప్పేస్తాం. మీకు హార్ట్‌ఫుల్‌గా టీడీపీ కోసం పని చేస్తాం. ఒక గంటలో మేం ఆలూరు నుంచి రిపోర్ట్ పంపిస్తాం. మాకు అన్ని ఛానల్స్ ఉన్నాయి. ఈ ఒక్క రోజు చెడుపుకుంటే నష్టపోతారు. రేపు టిక్కెట్ ప్రకటిస్తున్నారు. బోర్డులో లక్ష్మణ్ జీ ఉన్నారు. మేం ఏది చెబితే అది మాట్లాడతారు. మేం పురందేశ్వరి మేడమ్‌కు కూడా అప్పజెప్పాలి' అని మారుతీ నాయుడుతో నాగరాజు అన్నట్లుగా చెబుతున్న ఈ ఆడియో టేపులో ఉంది. మంగళవారం ఉదయం 11గంటలకు బయటకు వచ్చిన ఈ ఆడియో టేప్ బీజేపీతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలాన్ని రేపింది.



బీజేపీ వారు రూ.3 కోట్లు అడిగింది వాస్తవమే: మీనాక్షినాయుడు

ఆదోని సీటు వదులుకోవడానికి బీజేపీ నేతలు తన బంధువులతో మాట్లాడి రూ.3 కోట్లు అడిగిన మాట వాస్తవమే అని టీడీపీ నేత మీనాక్షి నాయుడు చెప్పారు. అయితే సీటు కోసం అంత డబ్బులు ఇచ్చే స్తోమత తనకు లేదన్నారు. రూ.3 కోట్లు బీజేపీకి ఇచ్చి తిరిగి ఎన్నికల్లో పార్టీ కోసం ఖర్చు పెట్టాలంటే తమతో కాదని తెలిపారు.

రూ. 3 కోట్లు ఇస్తే టిక్కెట్ ఇస్తామని నేను అనలేదు: నాగరాజు

మీనాక్షినాయుడు రూ.3 కోట్లు ఇస్తే టిక్కెట్ ఇస్తామని తాను అనలేదని, తన వాయిస్ మార్చి వైరల్ చేశారని నాగరాజు చెప్పారు. 'టీడీపీ టిక్కెట్ కోసం వారు తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు ఇలా వాయిస్ మార్చి వైరల్ చేస్తే బీజేపీకి టిక్కెట్ రాదని ఈ ప్రయత్నం చేశారు. బీసీ వర్గం ఎదగకూడదని, బీజేపీకి టిక్కెట్ రాకూడదనే ఇలా చేశారు. ఇందులో నా వాయిస్ లేదు. దీనిపై పరువునష్టం దావా వేస్తా' అని అన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఐఎంజీబీ వెనుక రాజకీయ పెద్దలు

2003 నాటి భూముల అప్పగింతలో అధికారుల పాత్ర కూడా ఉంది

- సీబీఐకి అప్పగిస్తేనే వివరాలు బహిర్గతమయ్యే అవకాశం
- హైకోర్టులో సీనియర్ న్యాయవాది గండ్ర వాదనలు
- ఏప్రిల్ తొలివారానికి విచారణ వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడమీస్ భారత (ఐఎంజీబీ) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 2003లో అక్రమంగా రూ.వేల కోట్ల (ప్రస్తుతం రూ.లక్ష కోట్లు) విలువైన 850 ఎకరాల అప్పగింత వెనుక నాటి రాజకీయ పెద్దలు ఉన్నారని సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు హైకోర్టులో వాదించారు. సీబీఐతో దర్యాప్తు చేయిస్తేనే వివరాలు బహిర్గతమవుతాయని, అందువల్ల ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అనంతరం పిల్‌లపై విచారణను సీజే ధర్మాసనం ఏప్రిల్ మొదటివారానికి వాయిదా వేసింది. గతంలో ఇదే కోర్టు ఐఎంజీబీ పిటిషన్‌ను కొట్టివేసిందని, దాన్ని ఆ కంపెనీ సుప్రీంకోర్టులో సవాల్ చేసినందున ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ఇక్కడ విచారణ చేపట్టడం సాధ్యంకాదన్న ఆ సంస్థ తరఫు న్యాయవాది వాదనను తోసిపుచ్చారు. సుప్రీం కోర్టులో పిటిషన్‌కు, ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాలకు సంబంధం లేదని పిల్‌లో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర పేర్కొన్నారు. ఎలాంటి అనుభవం లేని, నాలుగు రోజుల కంపెనీకి భూముల అప్పగింత వెనుక నాటి ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు కుమ్మక్కై ఉన్నారన్నారు. ఐఎంజీబీకి భూముల కేటాయింపు, ఎంఓయూ, సేల్‌డీడ్.. ఇలా అన్ని అంశాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ టి.శ్రీరంగారావుతోపాటు మరొకరు 2012లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. పెద్దఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రయత్నం జరిగిందని, దీని వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాల్సి ఉందన్నారు. ఈ పిల్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజోయ్ పాల్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది.

స్వతంత్ర విచారణ చేపట్టవచ్చు..

ఐఎంజీబీ దాఖలు చేసిన అప్పీల్ సుప్రీంకోర్టులో ఇంకా రిజిస్ట్రేషన్ దశలోనే ఉందని, ఈ నెలలో సెలవుల నేపథ్యంలో రిజిస్ట్రేషన్, నంబర్ కేటాయింపులో జాప్యం జరుగుతుందని ఆ సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదించారు. 10 రోజుల సమయం కావాలని కోరారు. పిల్‌లలో పిటిషనర్ల తరఫున గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. ఐఎంజీబీ రిట్ పిటిషన్‌ను ఈ కోర్టు కొట్టివేసిందని.. ఇప్పుడు సుప్రీంకోర్టులో అప్పీల్‌లో చేయడం పిల్‌లలో విచారణకు ఆటంకం కాదన్నారు. పిల్‌లపై స్వతంత్రంగా విచారణ చేపట్టవచ్చని చెప్పారు. ప్రభుత్వం తరఫున హాజరైన అడిషనల్ అడ్వొకేట్ జనరల్ మరికొంత సమయం కావాలని కోరడం గమనార్హం. కాగా, ఐఎంజీబీకి 850 ఎకరాలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న 2003 నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని హైకోర్టు మార్చి 7న తీర్పు సందర్భంగా తీవ్రస్థాయిలో తప్పుబట్టిన సంగతి తెలిసిందే. కనీస విచారణ లేకుండా, అంతర్జాతీయ కంపెనీతో సంబంధాలు ఉన్నాయో.. లేదో తెలుసుకోకుండా అత్యంత విలువైన ప్రాంతంలో వేల కోట్ల విలువైన భూములను సంతర్పణ చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

పోలీస్ స్టేషన్‌లో నృసింహుడికి పూజలు



ధర్మపురి పోలీస్ స్టేషన్లో పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీనృసింహుడు

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి మంగళవారం అక్కడి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించిన అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు అందుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్య ఘట్టమైన నృసింహుడి దక్షిణ దిగ్యాత్రను మంగళవారం అంగరంగ వైభవంగా జరిపారు. ఇందులో భాగంగా ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉదయ్‌కుమార్ నేతృత్వంలో అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయం నుంచి శోభాయాత్రగా తరలివెళ్లిన స్వామివారికి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివార్ల కల్యాణం అనంతరం దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలుగా బయలుదేరుతుంటారని, మార్గమధ్యలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను లక్ష్మీనృసింహుడు సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి దుష్టులను శిక్షిస్తాడని, ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయమని పండితులు తెలిపారు.

కమీషన్ పెంపు కోసం పెట్రోల్, డీజిల్ డీలర్ల ఆందోళన

12 గంటలే బంకులు తెరవాలని రిటైల్ డీలర్ల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: పెట్రోల్, డీజిల్‌పై కమీషన్ పెంచాలని, లేదంటే రోజుకు 12 గంటలు మాత్రమే రిటైల్ ఔట్‌లెట్ల (బంకుల)ను తెరిచి నిరసన తెలుపుతామని డీలర్లు కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. తెలంగాణతో పాటు తమిళనాడు, హరియాణా రాష్ట్రాలకు చెందిన ఆయిల్ డీలర్లు ఈనెల 13న ప్రధాని మోదీ, పెట్రోలియం శాఖ కార్యదర్శి, మూడు ఆయిల్ కంపెనీల యాజమాన్యాలకు, ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాశారు. పదిరోజుల్లో కమీషన్ పెంపుపై నిర్ణయం తీసుకోకుంటే పెట్రోల్ ఔట్‌లెట్లు తెరిచే సమయాన్ని 12 గంటలకు కుదిస్తామని, ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే రిటైల్ ఔట్‌లెట్లను తెరుస్తామని ప్రకటించారు. 2017లో లీటర్ పెట్రోల్ రూ.70 ఉన్నప్పుడు డీలర్లకు చెల్లించిన కమీషనే, ఇప్పుడు రూ.110కి చేరుకున్నప్పటికీ అదే కమీషన్ ఇస్తున్నారని తెలిపారు. రెండుసార్లు ఎక్సైజ్ డ్యూటీని తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం డీలర్ల విషయంలో స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో ఇప్పటివరకు కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో త్వరలోనే డీలర్ల సంఘాలు సమావేశమై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించాయి.

యాదాద్రికి తిరుమల తరహా భద్రత

లగేజ్ ఎక్స్‌రే స్కానర్లు, మెటల్ డిటెక్టర్ల రాక



ఆలయ లిఫ్టు మార్గంలో లగేజ్ ఎక్స్‌రే స్కానర్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, పరిసర ప్రాంతాల్లో మరింత భద్రత కల్పించేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో కల్పిస్తున్న భద్రత స్థాయిలోనే ఇక్కడా ఏర్పాటు చేసే అంశంపై పోలీసు ఉన్నతాధికారులు గతంలోనే చర్చించారు. దీంతో ఆలయంతో పాటు క్యూలైన్లు, వీఐపీ లిఫ్టు మార్గాల్లో తిరుమల ఆలయంలో ఏర్పాటు చేసినట్లు లగేజ్ ఎక్స్‌రే స్కానర్లు, మల్టీ జోన్ డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లను బిగించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వీటిని ఆలయానికి తీసుకువచ్చారు. ప్రధానాలయంలో పునర్దర్శనాల నాటి నుంచి మల్టీజోన్ డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఒకటి, రెండుచోట్లా ఉన్నప్పటికీ.. భక్తులు తీసుకొచ్చే లగేజీను స్కాన్ చేసేందుకు ఎక్స్‌రే స్కానర్లు లేవు. దీంతో భక్తులు విచ్చలవిడిగా ఆలయంలోకి హ్యాండ్ బ్యాగ్‌లో సెల్‌ఫోన్లు, ఇతర పరికరాలను తీసుకెళ్తున్నట్లు గుర్తించిన అధికారులు.. లగేజ్ ఎక్స్‌రే స్కానర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ధర్మ దర్శనం క్యూలైన్ వెళ్లే మార్గంలో లగేజ్ ఎక్స్‌రే స్కానర్ మెషీన్‌ను బిగించగా.. లిఫ్టుకు వెళ్లే దారిలో, త్రితల రాజగోపురం వద్ద బిగించాల్సి ఉంది.

వాషింగ్ మెషీన్‌లో నోట్ల కట్టలు

- ఫెమా ఉల్లంఘన కేసులో హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఈడీ సోదాలు.. రూ. 2.54 కోట్లు స్వాధీనం



సాక్షి, హైదరాబాద్: అనుమానాస్పద లావాదేవీల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని దేశం దాటించిన ఆరోపణలపై ఫెమా చట్టం కింద నమోదైన కేసులో ఈడీ అధికారులు హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో మంగళవారం సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో రూ.2.54 కోట్లను వాషింగ్ మెషీన్‌లో స్వాధీనం చేసుకున్నారు. పలు కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.1800 కోట్లను సింగపూర్‌లోని గెలాక్సీ షిప్పింగ్, లాజిస్టిక్స్ లిమిటెడ్, హోరిజన్ షిప్పింగ్, లాజిస్టిక్స్ కంపెనీలకు భారత్‌లోని కాప్రికార్నియన్ షిప్పింగ్, లాజిస్టిక్స్ ప్రైవేట్ ఇతర కంపెనీల నుంచి ఫెమా చట్టాలను ఉల్లంఘిస్తూ తరలించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు ఒకేరోజు ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, కురుక్షేత్ర, కోల్‌కతాలో సోదాలు చేపట్టారు. కాప్రికార్నియన్ షిప్పింగ్, లాజిస్టిక్స్ ప్రైవేట్ తోపాటు దాని అనుబంధ సంస్థలైన లక్ష్మీటన్ మారిటైమ్, హిందుస్తాన్ ఇంటర్నేషనల్, రాజధాని మెటల్స్ లిమిటెడ్, స్టవర్ట్ అలోయ్ ఇండియా ప్రై.లిమిటెడ్, భాగ్యనగర్ లిమిటెడ్, వినాయక స్టీల్స్ లిమిటెడ్, వశిష్ట కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాలు, సదరు కంపెనీల డైరెక్టర్ల కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో నగదు పట్టుబడింది. అయితే వాషింగ్ మెషీన్‌లో స్వాధీనం చేసుకున్న డబ్బు ఎక్కడ పట్టుబడిందన్న విషయాన్ని ఈడీ అధికారులు వెల్లడించలేదు.

'ఓబీసీ నేత మన ప్రధాని మోదీని సమర్థిద్దాం' సదస్సులు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని మండలాల వారీగా ఒక్కోటి చొప్పున కులసంఘాల సమావేశాలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా తీర్మానించింది. 17 ఎంపీ సీట్ల పరిధిలోని ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌లో 'ఓబీసీ నేత మన ప్రధాని మోదీని సమర్థిద్దాం' అనే నినాదంతో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. మంగళవారం బీజేపీ సిటీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గసమావేశానికి కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కుక్క కాటుకు ఊడిన ముక్కు



కౌడిపల్లి(నర్సాపూర్): ఆరుబయట పడుకున్న ఓ వ్యక్తిని వీధి కుక్క కరవడంతో ముక్కు ఛిద్రమైంది. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లిలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన చెల్ల శంకరయ్య సోమవారం రాత్రి గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన భజన వింటూ నిద్రలోకి జారుకున్నాడు. ఇంతలో ఒక కుక్క శంకరయ్యపై దాడి చేసి అతని ముక్కు కొరికింది. తీవ్రగాయం కావడంతో బాధితుని ముక్కు కొంతభాగం ఊడి వేలాడింది. తీవ్ర రక్తస్రావమైన బాధితుడిని స్థానికులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

‘ఈ రోజులను చూస్తుంటే మా రోజుల్లోనే అమ్మాయిలకు తగినంత స్వేచ్ఛ,
అనుకున్నవి సాధించే ధైర్యం, సమాజాన్ని అర్థం చేసుకునే పరిణతిని పొందారు’ అనిపిస్తుంటుంది అన్నారు రిటైర్డ్ ప్రిన్సిపల్ కమలా మీనన్. తిరుపతి పద్మావతి మహిళా కళాశాల మూడవ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించిన కమలా మీనన్ సికింద్రాబాద్ బోయినపల్లిలో ఉంటున్నారు.

భర్త డగ్లస్ ఎమ్ కాక్రన్ జ్ఞాపకాలతో పాటు, 86 ఏళ్ల జీవితంలో ధైర్యంగా తీసుకున్న నిర్ణయాలు తనను ఎలా నిలబెట్టాయో వివరించారు.

‘‘చదువు అమ్మాయిలను శక్తిమంతులను చేస్తుంది. ఈ విషయాన్ని ఆ రోజుల్లోనే మా అమ్మ గుర్తించారు..’ అంటూ గతకాలపు విషయాలను మన ముందుంచారు.



కమలా మీనన్

చదువు శక్తినిస్తుంది

● మా రోజుల్లోనే గుర్తించాం: పద్మావతి వర్సిటీ రిటైర్డ్ ప్రిన్సిపల్ కమలా మీనన్

■ చదువు వేసిన మార్గం..

‘‘పుట్టి పెరిగింది చెన్నైలో. నాన్నగారు బ్రిటిష్ గవర్నమెంట్‌లో ఉద్యోగం చేసేవారు

అమ్మానాన్నలకు ఎనిమిది మంది సంతానం. అక్కతోపాటు ఆరుగురు అన్నలు నాకు. ఆడ, మగ అనే వివక్ష ఏ మాత్రం లేదు. అందరికీ మంచి చదువులు చదువుకునే అవకాశం ఇచ్చారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ఆనర్స్ పూర్తయ్యాక బెంగుళూరు మౌంట్ కార్మెల్ కాలేజీలో లెక్చరర్‌గా ఐదేళ్లు పని చేశాను. ఆ ఎక్స్‌పీరియెన్స్ నాకు చాలా హెల్ప్ అయ్యింది. అప్పుడు చదువుకునే అమ్మాయిల శాతం కూడా బాగానే ఉంది. ఆ తర్వాత మార్పు కోసం తిరిగి మద్రాస్‌కు వచ్చేశాను. తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలలో పొలిటికల్ విభాగంలో టెంపరరీ జాబ్ గురించి పేపర్‌లో ప్రకటన చూసి, అప్లై చేసి, సెలక్ట్ అయ్యాను. ఆరు నెలల తర్వాత పర్మినెంట్ అయ్యింది.

■ సవాళ్లను తట్టుకుని ఎదుగుతూ..

జీవితంలో సవాళ్లు, బాధలు ఎక్కడి నుంచైనా ఎదురు కావచ్చు. నన్ను విపరీతంగా బాధపెట్టే సంఘటన నుంచి కోలుకోవడానికి సమయం పట్టింది. మా అక్క ఢిల్లీలో ఉండేవారు. జబ్బు పడి అక్క, నాన్న ఇద్దరూ ఒకే రోజు చనిపోయారు. ఈ సంఘటన నన్ను బాగా కదిలించాయి. ఆ టైమ్‌లో డా.రాజేశ్వరి మూర్తి కాలేజీ ప్రిన్సిపల్‌గా ఉండేవారు. ఆవిడ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లినప్పుడు సెలక్షన్ కమిటీ నన్ను ఇన్‌ఛార్జిగా ఎంపిక చేసింది. నా మైండ్ కూడా ఛేంజ్ కావాలనుకొని, 1975లో ఆ బాధ్యత తీసుకున్నాను. ఇంటర్వ్యూ ద్వారా టెంపరరీ జాబ్ వచ్చింది. తర్వాత పర్మినెంట్ అయ్యింది. ఆ తర్వాత ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా అవకాశం వచ్చింది. నాకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. అదే సమయంలో విదేశాలకు వెళ్లిన మరో సీనియర్ మహిళా లెక్చరర్ తిరిగి వచ్చారు. అప్పుడు మేనేజ్‌మెంట్ సీనియర్ కాబట్టి ఆవిడను నా ప్లేస్‌లో రీ ప్లేస్ చేశారు. అప్పటికే నన్ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది, ఆ తర్వాత మరొకరికి ఇచ్చింది. దీంతో నా పొజిషన్ కోసం కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ నేను గెలిచాను. అలా యూనివర్శిటీకి 3వ మహిళా ప్రిన్సిపల్‌గా బాధ్యతలు తీసుకున్నాను. ఆ తర్వాత 1993లో రిటైర్ అయ్యేవరకు ప్రిన్సిపల్‌గా చేశాను. 1997 వరకు దేవస్థానం ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా వర్క్ చేశాను.

లెక్చరర్‌గా ఎంతో మంది విద్యార్థులను చూశాను. ఎంతోమంది విద్యార్థులతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటికీ కలిసేవారు, ఫోన్లు చేసి మాట్లాడేవారున్నారు. ఆత్మీయులుగా మారినవారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన, మొదటి తరం అమ్మాయిలే అక్కడంతా. వారిలో భవిష్యత్తుని చక్కగా మార్చుకోవాలనే పరిణతి బాగా కనిపించేది. వారి భవిష్యత్తుకు ప్రత్యేక క్లాసులు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ చేర్చాం. లెక్చరర్లు ఎంతో సపోర్ట్‌గా నిలిచేవారు. నాటి ఆ విద్యార్థుల్లో నేడు ఎంతోమంది పెద్ద పెద్ద పొజిషన్లలో, దేశ విదేశాల్లో ఉన్నారు.

■ జీవితంలో ముఖ్యమైన మలుపు

1979–80లో నాటి మద్రాస్‌లో సౌత్ ఇండియా అమెరికా రాయబార కార్యాలయానికి డగ్లస్ ఎమ్ కాక్రన్ కాన్సులేట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాలేజీ సెమినార్ సందర్భంగా మద్రాస్ నుంచి తిరుపతికి సెమినార్‌కు వచ్చారు. అక్కడ డిస్కషన్స్ అన్నీ పూర్తయి, వెళ్లిపోయారు. ఆ సమయంలో యునైటెడ్ స్టేట్స్ ఇరాన్ పొలిటికల్ ఇష్యూస్ జరుగుతున్నాయి. చెన్నైలోని అమెరికన్ ఎంబసీ ఎదుట నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో సేఫ్‌గా ఉండమని రాసిన నోట్ తిరిగి మమ్మల్ని కలిపింది. ఆ తర్వాత జరిగిన డిస్కషన్స్ మమ్మల్ని మంచి స్నేహితులుగా మార్చాయి. 1985లో మేం పెళ్లి చేసుకున్నాం. ఆ విధంగా శ్రీమతి డగ్లస్ ఎమ్ కాక్రన్ అయ్యాను. జీవితంలో ఒక అద్భుతమైన వ్యక్తిని కలిసాను అనిపించేది. మా అమ్మను ఆమె సొంత కొడుకుల కన్నా డగ్లస్ గొప్పగా చూసుకున్నారు. ఇన్నేళ్ల మా జీవనంలో ఎన్నో అందమైన జ్ఞాపకాలు ఉన్నాయి. ఇటీవల డగ్లస్ అనారోగ్యంతో భౌతికంగా దూరమయ్యారు. అయితేనేం.... ఆ జ్ఞాపకాలు ఎంతో పదిలంగా ఉన్నాయి. అవే నన్ను శక్తిమంతురాలిని చేస్తున్నాయి.

■ విశ్రాంత జీవనంలో..

రిటైర్ అయినా కొన్ని విదేశీ కంపెనీలు, సూపర్‌మార్కెట్స్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించేవారు డగ్లస్. నేను రిటైర్ అయిన తర్వాత ఎక్కడ ఉండాలో ఇద్దరమూ ఆలోచించుకున్నాం. అందుకు, సికింద్రాబాద్‌లోని బోయినపల్లి మాకు అనువైనదిగా అనిపించింది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాం. మా ఇంట్లోనే కాదు మా చుట్టుపక్కల ఇళ్లలో పనులు చేసే వారి పిల్లలకు మంచి చదువు చెప్పించాలనే ఉద్దేశ్యంతో వారిని ఒక చోట చేర్చి చదువులు చెప్పేవాళ్లం. కాలనీలోని చదువుకున్న మహిళల చేత ట్యూషన్స్ చెప్పించేవాళ్లం. వారి పిల్లలను కాన్వెంట్ స్కూల్‌లో చేర్పించి, మంచి భవిష్యత్తు ఇవ్వాలనుకునేవాళ్లం. అలా, ఆ పిల్లలు కూడా ఇప్పుడు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

అమ్మానాన్నల పెంపకంలోనూ, చదువులోనూ, సమాజంలో మనకు లభించే స్వేచ్ఛ దుర్వినియోగం చేసుకోకూడదు. ఆ స్వేచ్ఛను మనకు అనుకూలంగా మలచుకోవాలి. అదే మనల్ని శక్తిమంతులుగా నిలుపుతుంది అది ఏ దేశమైనా అని నేనూ కాక్రన్ అనుకునేవాళ్లం’’ అంటూ నేటి తరంలో వస్తున్న మార్పులను అన్వయించుకుంటూ తెలియజేశారు’’ కమలా మీనన్.

– నిర్మలారెడ్డి



పట్టణాలలో, నగరాలలో మానసిక సమస్యలకు వైద్యం అందుబాటులో ఉంటుంది. పల్లెల్లో ఎలా? ముఖ్యంగా మహిళలకు మానసిక సమస్యలు వస్తే? డిప్రెషన్‌తో బాధ పడ్డ నటి దీపికా పదుకోన్ గ్రామీణ మహిళల మానసిక ఆరోగ్యం కోసం ‘లివ్ లవ్ లాఫ్’ అనే సంస్థను స్థాపించింది. దాని బాధ్యతను చెల్లెలు అనిషా పదుకోన్‌కు అప్పజెప్పింది. అనిషా నిర్వహణలో ఆ సంస్థ ఆరు రాష్ట్రాలలో గ్రామీణ మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తోంది.

అనిషా పదుకోన్

అక్క చూపిన మార్గంలో

చెన్నైకి గంటన్నర ప్రయాణ దూరంలో ఉండే తిరువళ్లూరులో శశికళ అనే మహిళకు మతి చలించింది. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఆమెను తీసుకొచ్చి చెన్నైలో చూపిస్తే మందులు వాడాలన్నారు. చెకప్‌ల కోసం, మందుల కోసం నెలకోసారి చెన్నై రావాలంటే డబ్బులు ఖర్చవుతాయి. ఆమె అంత డబ్బు ఖర్చు పెట్టలేని పేద మహిళ. మందులు మానేసింది. మానసిక స్థితి ఇంకా దెబ్బ తిని ఊళ్లో దిమ్మరిగా తిరగడం మొదలెట్టింది. గ్రామీణ స్త్రీల మానసిక ఆరోగ్యం కోసం పని చేస్తున్న ‘లివ్ లవ్ లాఫ్’ సంస్థ ప్రతినిధులకు ఈ సంగతి తెలిసింది. తమతో కలిసి పని చేస్తున్న చెన్నైకి చెందిన వసంతం ఫౌండేషన్‌కు ఈ సంగతి తెలియపరిచారు. ఆ ఫౌండేషన్ వారు ఆమెను తరచు వైద్యుల దగ్గరకు తీసుకెళ్లారు. కావలసిన మందులు కొనిచ్చారు. కేర్‌గివర్‌గా పని చేస్తున్న తల్లికి దారి ఖర్చులు సమకూర్చారు. శశికళకు పూర్తిగా నయమైంది. ఆ తర్వాత ఆమె చిన్న చిల్లరకొట్టు నడుపుకోవడానికి 5000 రూపాయల సహాయం అందించారు. శశికళ ఇప్పుడు తన పిల్లలను చూసుకుంటూ జీవిస్తోంది.

‘ఇలా సహాయం అందాల్సిన వారు మన దేశంలో చాలామంది ఉన్నారు’ అంటుంది అనిషా పదుకోన్. ఆమె ‘లివ్ లవ్ లాఫ్’ సంస్థకు సి.ఇ.ఓ.

దీపిక స్థాపించిన సంస్థ

తాను డిప్రెషన్‌తో బాధ పడుతున్నట్టు దీపికా పదుకోన్ 2015లో లోకానికి వెల్లడి చేసింది. స్త్రీల మానసిక ఆరోగ్యం గురించి అందరూ ఆలోచించాలని పిలుపునిచ్చింది. అంతే కాదు తన బాధ్యతగా 2016లో బెంగళూరు కేంద్రంగా స్త్రీల మానసిక ఆరోగ్యం కోసం ‘లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్’ను స్థాపించింది. దానికి తన చెల్లెలు అనిషా పదుకోన్‌ను సి.ఇ.ఓగా నియమించింది. అనిషా ఈ సంస్థ కోసం చురుగ్గా పని చేస్తోంది. ఇప్పటికి ఈ ఫౌండేషన్ సేవలను ఆరు రాష్ట్రాలకు విస్తరించింది. ఆ ఆరు రాష్ట్రాలలోని 13 జిల్లాల్లో ఈ సంస్థ వాలంటీర్లు పని చేస్తున్నారు. వీరివల్ల 15,000 మంది గ్రామీణ మహిళలు ఇప్పటి వరకూ మానసిక చికిత్స పొందారు. అంతే కాదు 26,000 మంది సంరక్షకులు, అంగన్‌వాడి కార్యకర్తలు మానసిక చికిత్సలో ప్రాథమిక అవగాహనకై ట్రయినింగ్ కూడా ఈ సంస్థ వల్ల పొందారు.

గోల్ఫ్ ప్లేయర్

అనిషా పదుకోన్ తండ్రి ప్రకాష్ పదుకోన్ ప్రఖ్యాత బాడ్మింటన్ ప్లేయర్ కావడం వల్ల అనిషా స్పోర్ట్స్ పట్ల ఆసక్తి కనపరిచింది. ఆమె గోల్ఫ్ క్రీడను ప్రొఫెషనల్ స్థాయిలో నేర్చుకుని మన దేశం తరఫున అమెచ్యూర్ లెవల్‌లో ప్రాతినిధ్యం వహించింది. అయితే ఆ ఆటను కొనసాగించే సమయంలోనే దీపికా పదుకోన్ సూచన మేరకు ఫౌండేషన్ బాధ్యతలు తీసుకుంది. ‘ఇక్కడ పని చేయడం మొదలెట్టాక మానసిక సమస్యల తీవ్రత అర్థమైంది. మన దేశంలో 20 కోట్ల మంది మానసిక సమస్యలతో బాధ పడుతున్నారు. వీరిలో గ్రామీణ స్త్రీలు ఎక్కువ శాతం ఉన్నారు. వీరి కోసం మందులు, వైద్యం, పెన్షన్, సంరక్షకుల ఏర్పాటు, ఉపాధి... ఇవన్నీ సాధ్యం కావాలంటే పెద్ద ఎత్తున సాయం కూడా అందాలి. వాలంటీర్లు ముందుకు రావాలి. కలిసి పని చేయాలి’ అంటుంది అనిషా.

స్త్రీలు వ్యాయామం చేయడంతో పాటు పోషకాహారం తీసుకుంటూ తగినంత నిద్ర పోవడం అవసరం అంటుందామె. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు అని పిలుపునిస్తోంది.

ఇన్నోవేషన్

స్మార్ట్ స్కోప్ – ప్రమాదాన్ని హెచ్చరిస్తుంది

సర్వైకల్ క్యాన్సర్‌ను ముందుగానే పసిగట్టే సంస్థ ‘స్మార్ట్ స్కోప్’ అనే డిజిటల్ డివైజ్‌ను రూపొందించింది పుణెలోని పెరివింకిల్ టెక్నాలజీస్...



వీణా మోక్తాలి

మహిళలకు ఎక్కువగా వచ్చే క్యాన్సర్‌లలో సర్వైకల్ క్యాన్సర్ రెండో స్థానంలో ఉంది. ఈ క్యాన్సర్ ప్రమాదాన్ని పసిగట్టడంలో ‘స్మార్ట్ స్కోప్’ కీలకపాత్ర పోషిస్తోంది. యూఎస్, యూకేలలో పని చేసిన వీణా మోక్తాలి ఆమె భర్త కౌస్తుభ్ నాయక్‌లు మన దేశానికి వచ్చి పుణె కేంద్రంగా పెరివింకిల్ టెక్నాలజీకి శ్రీకారం చుట్టారు.

ఈ కంపెనీ నుంచి వచ్చిన ‘స్మార్ట్ స్కోప్’ డిజిటల్ డివైజ్ సులభంగా ఉపయోగించేలా ఉంటుంది.

‘ప్రస్తుతం ఉన్న సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పద్ధతులు సమయం తీసుకుంటాయి. ఈ సౌకర్యాలు పెద్ద నగరాల్లోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా ఎక్కువమంది మహిళలు స్క్రీనింగ్ చేయించుకోలేకపోతున్నారు’ అంటుంది వీణ.

ఈ నేపథ్యంలో ‘స్మార్ట్ స్కోప్’ అనేది చిన్న ప్రైవేట్ క్లినిక్, నర్సింగ్ హోమ్స్, మున్సిపల్ డిస్పెన్సరీలు, ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్, జిల్లా ఆస్పత్రులలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక బ్యాంకు మేనేజర్‌కు గ్రేడ్–2 దశలో క్యాన్సర్‌ని గుర్తించడంలో స్మార్ట్ స్కోప్ ఉపయోగపడింది. మన దేశంలోని ఆరు రాష్ట్రాలకు చెందిన లక్షమంది ఈ పరికరం సహాయంతో జాగ్రత్త పడ్డారు. ఈ డివైజ్ నిర్వహణ ఖర్చు తక్కువ కావడం కూడా మరో సానుకూల అంశం.

‘కూలి పనుల వల్ల రోజుల తరబడి ప్రయాణాలు చేసే టైమ్ గ్రామీణ మహిళలకు ఉండడం లేదు. స్మార్ట్ స్కోప్ ద్వారా ఫలితం కోసం ఎక్కువ సమయం ఎదురు చూడాల్సిన అవసరం లేదు’ అంటుంది వీణ.

అంతర్జాతీయ మార్కెట్‌లోకి కూడా విస్తరించాలనే లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది వీణా మోక్తాలి.

యూత్ పల్స్

నేడు వరల్డ్ థియేటర్ డే

నాటక యవనికపై యువ సంతకం



నవన్ శరణ్

పెద్దలు ఇష్టపడే కళగా గుర్తింపు పొందిన ‘నాటక కళ’పై యువత ఆసక్తి ప్రదర్శించడమే కాదు అందులో ఇష్టంగా భాగం అవుతోంది. పాశ్చాత్య నాటకాల పరిశీలన నుంచి మన నాటకాలలో ప్రయోగాల వరకు నాటకరంగంపై యువ సంతకం మెరుస్తోంది....

తిరువనంతపురంలోని ‘నిరీక్షణ ఉమెన్స్ థియేటర్’ వారి నాటకమహోత్సవానికి హాజరైన రోజు నుంచి నందినికి నాటకరంగంపై ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది. దేశ నలుమూలల నుంచి ఎనిమిది మంది మహిళా దర్శకుల నాటకాలను ఈ నాటక మహోత్సవంలో ప్రదర్శించారు. ఇందులో మూడు స్ట్రీట్‌ప్లేలు కూడా ఉన్నాయి. ఇరవై నాలుగు సంవత్సరాలుగా కళాప్రియులను ఆకట్టుకుంటున్న ‘నిరీక్షణ’ నిర్వహించే వర్క్‌షాప్‌లకు యువతరం నుంచి మంచి స్పందన లభిస్తోంది.

‘నాటకాలు చూడడం తప్ప ఎప్పుడూ ఆడలేదు. స్వాతి తిరునాల్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌లో నిరీక్షణ నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన తరువాత నటనపై ఆసక్తి పెరిగింది’ అంటుంది మనీష. ఎంబీఏ చేస్తున్న మనీష రంగస్థల పాఠాలపై కూడా దృష్టి పెడుతోంది.

నాటకరంగంపై యువతకు ఆసక్తి కలిగించడానికి భూపేష్ రాయ్, ప్రియాంక సర్కార్‌లు లక్నోలో నిర్వహించిన థియేటర్ ఫెస్టివల్‌కు మంచి స్పందన లభించింది. ‘ఒకప్పుడు థియేటర్ ఫెస్టివల్ అంటే పెద్దవాళ్లు ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు యూత్ కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాటకాలపై చర్చించుకుంటున్నారు’ అంటున్నాడు భూపేష్ రాయ్.

బెంగళూరులోని ఆల్–ఉమెన్ ట్రూప్ ‘ది అడమెంట్ ఈవ్స్’ యువతలో నాటకరంగంపై ఆసక్తిని కలిగిస్తోంది. ఈ ట్రూప్‌లో సభ్యురాలైన బాలశ్రీ యూఎస్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నప్పుడు నాటకాలకు సంబంధించిన ఒక వర్క్‌షాప్‌కు హాజరైంది. ఇక అప్పటినుంచి నాటకరంగం ఆమెకు ఇష్టంగా మారింది. ఒకవైపు అనలిస్ట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే నాటకాల్లో నటిస్తోంది.

పిల్లల నుంచి యువతకు వరకు ఎంతోమందిలో నాటకరంగంపై ఆసక్తి కలిగిస్తోంది కావ్య శ్రీనివాసన్. ఆమె థియేటర్ యాక్టర్, ప్లేరైటర్, స్టోరీ టెల్లర్. మధు శుక్లా థియేటర్ ప్రాక్టీషనర్, కోచ్, స్టోరీ టెల్లర్. వృత్తిరీత్యా అనలిస్ట్ అయిన లక్ష్మీ ప్రియా మంచి నటి. ఉద్యోగ సమయం తరువాత ఈ బృందం రిహార్సల్స్, ప్లానింగ్, ఇంప్రూవ్ షోలు చేస్తుంది. ప్రతి మంగళ, గురువారాల్లో ఏదో ఒక మెంబర్ ఇంట్లో రిహార్సల్ కోసం సమావేశం అవుతారు. ‘వేదికపై ఉన్నప్పుడు సౌకర్యవంతంగా, ఆత్మవిశ్వాసంతో ఉండడానికి తమ నైపుణ్యాలను నటులు ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడం అవసరం’ అంటుంది బాలశ్రీ.

కావ్య శ్రీనివాస్ నుంచి బాలశ్రీ వరకు ఎంతో మంది నాటకరంగ కళాకారులు యువతకు స్ఫూర్తిని ఇస్తున్నారు.

నాటకరంగంలో చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకున్నాడు క్వాసర్ ఠాకూర్ పదంసీ. ఇరవై సంవత్సరాల వయసులో సెక్యూర్డ్ జాబ్‌ను వదిలేసి నాటకరంగానికి అంకితం అయ్యాడు ‘వ్యక్తుల జీవిత కథలను మరింత శక్తిమంతంగా చెప్పే దిశగా భారతీయ నాటకరంగం ప్రయాణిస్తోంది. మన నాటకం కాలంతోపాటు పయనిస్తూ ఎప్పటికప్పుడూ కొత్త సాంకేతికతను సొంతం చేసుకుంటుంది. లైవ్ కెమెరాలు, ప్రొజెక్షన్‌లు నాటకరంగంలో భాగం అయ్యాయి’ అంటాడు పదంసీ.

మన నాటకరంగ విశిష్టతను ఒకవైపు చెబుతూనే మరోవైపు... ‘కష్టాలు ఉంటాయి. ఇదేమీ లాభసాటి వృత్తి కాదు’ అంటాడు. అయితే అభిరుచులు, ఆసక్తులను వాణిజ్య కొలమానాలతో చూడడానికి ఇష్టపడని యువత నాటకరంగాన్ని అమితంగా ప్రేమిస్తోంది. నాటక సమాజాలతోపాటు అవి చేస్తున్న ప్రయోగాల గురించి కూడా ఆసక్తిగా తెలుసుకుంటోంది. రేపటి నాటకానికి తమ వంతుగా సన్నద్ధం అవుతోంది.

తమాషాగా సంతోషంగా...

ముంబైకి చెందిన నవన్ శరణ్ పొయెట్, రైటర్, యాక్టర్. థియేటర్ కంపెనీ ‘తమాషా’ ఫౌండింగ్ మెంబర్‌లలో ఒకరు. కొత్త రకం ఐడియాలకు ‘తమాషా’ పుట్టిల్లుగా మారింది. శరణ్ మొదటి నాటకం క్లబ్ డిజైర్. క్రమం తప్పకుండా నాటకాలు ప్రదర్శించే శరణ్ మోడలింగ్ చేస్తుంది. సినిమాల్లో నటిస్తుంది. కవితలు కూడా రాస్తుంటుంది. నాటక రంగానికి సంబంధించి కొత్త ప్రయోగాలు చేయడంలో యువతరానికి స్ఫూర్తి ఇస్తున్న వారిలో నవన్ శరణ్ ఒకరు.

తోడా ధ్యాన్ సే...

సమకాలీన సామాజిక అంశాలను చర్చించడానికి నాటకాన్ని ఒక మాధ్యమంగా ఉపయోగించుకుంటున్న వారిలో ఢిల్లీకి చెందిన థియేటర్ ప్రాక్టీషనర్ మల్లికా తనేజా ఒకరు. పురుషాధిక్యత నిండిన కళ్లతో స్త్రీని ఎలా చూస్తారు? స్త్రీ భద్రతకు వస్త్రధారణకు ఎలా ముడిపెడతారు? అదృశ్య అణచివేతరూపాలు... మొదలైన అంశాలను తన సోలో నాటకం ‘తోడా ధ్యాన్ సే’ ప్రతిబింబిస్తుంది. మల్లిక వ్యక్తిగత అనుభవాలే ఈ నాటకానికి పునాది.



మల్లికా తనేజా



‘9 పార్ట్స్ ఆఫ్ డిజైర్’లో ఐరా దూబే

రంగస్థలమే పాఠశాల

మన దేశంలోని ప్రతిభావంతులైన యువనటులలో ఐరా దూబే ఒకరు. ‘యేల్ స్కూల్ ఆఫ్ డ్రామా’లో చదువుకుంది. ‘9 పార్ట్స్ ఆఫ్ డిజైర్’లో ఆమె సోలో పెర్‌ఫార్మెన్స్‌కు మంచి పేరు వచ్చింది. దూబే కుటుంబంలో చాలామంది నటులు ఉన్నారు. అందుకే సరదాగా ‘నాటకాల ఫ్యామిలీ’ అని పిలుస్తారు.

‘థియేటర్ ఆర్ట్స్‌పై యంగ్ పీపుల్ ఆసక్తి ప్రదర్శించడమే కాదు నాటకకళ పట్ల తమ నిబద్ధతను చాటుకుంటున్నారు. యువనటులకు బోలెడు అవకాశాలు ఉన్నాయి. మనం ఒక నాటకం చేస్తే ఏ కారణం కోసం చేస్తున్నామో, ఏ ప్రేక్షకుల కోసం చేస్తున్నామో తెలుసుకోవాలి. టార్గెట్ ఆడియెన్స్ గురించి అవగాహన కూడా ముఖ్యం. యాక్టింగ్ స్కూల్ ద్వారా మాత్రమే నటన వస్తుంది అనే దాన్ని నేను నమ్మను. రంగస్థలమే పాఠశాల. అక్కడే ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు’ అంటుంది ఐరా దూబే.



బంగ్లాదేశ్ జట్టులో షకీబ్ పునరాగమనం

రాజకీయ నాయకుడిగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాక బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ జాతీయ జట్టులోకి పునరాగమనం చేశాడు. శ్రీలంక జట్టుతో చట్టోగ్రామ్‌లో శనివారం మొదలయ్యే రెండో టెస్టులో షకీబ్ ఆడనున్నాడు. గత ఏడాది భారత్ ఆతిథ్య మిచ్చిన వన్డే వరల్డ్‌కప్ మధ్యలో షకీబ్ గాయంతో వైదొలిగాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో 37 ఏళ్ల షకీబ్ అవామీ లీగ్ పార్టీ తరఫున మగురా నియోజకవర్గం నుంచి పోటీచేసి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఫ్లోరిడాలో మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-5, 7-6 (7/3)తో హుగో నిస్ (మొనాకో)-జాన్ జిలెన్‌స్కీ (పోలాండ్) జోడీపై గెలిచింది. 99 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు.



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శ్రీజ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 25 ఏళ్ల శ్రీజ ఏడు స్థానాలు ఎగబాకి 40వ ర్యాంక్‌కు చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీజ గత వారం లెబనాన్‌లో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) రెండు టోర్నీల్లో రాణించింది. తొలి టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన ఆమె రెండో టోర్నీలో విజేతగా నిలిచింది. మనిక బత్రా 38వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. మే 16వ తేదీ వరకు భారత టాప్-2 ర్యాంకర్లకు పారిస్ ఒలింపిక్స్‌లో సింగిల్స్ విభాగంలో పోటీపడే అవకాశం లభిస్తుంది. మరోవైపు పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఆచంట శరత్ కమల్ 35వ ర్యాంక్‌లో ఉండగా... సత్యన్ జ్ఞానశేఖరన్ 43 స్థానాలు ఎగబాకి 60వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. తెలంగాణ ప్లేయర్ స్నేహిత్ 22 స్థానాలు పురోగతి సాధించి 144వ ర్యాంక్‌లో నిలిచాడు.

గాయత్రి జోడీకి చుక్కెదురు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో ఐదో సీడ్ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 18-21, 22-20, 18-21తో ఆనీ జు-కెర్రీ జు (అమెరికా) జంట చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. మరోవైపు అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జంటకు తొలి రౌండ్‌లో వాకోవర్ లభించడంతో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ నుంచి మిథున్ మంజునాథ్ (భారత్) మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించగా... సమీర్ వర్మకు నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్ తొలి మ్యాచ్‌లో మిథున్ 15-21, 24-22, 21-18తో శంకర్ ముత్తుస్వామి (భారత్)పై, రెండో మ్యాచ్‌లో 21-16, 21-12తో లియావో జు ఫు (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు.

చెన్నై ధనాధన్ గెలుపు

- చెలరేగిన దూబే, రచిన్ రవీంద్ర
- పడగొట్టిన దీపక్, తుషార్
- 63 పరుగులతో ఓడిన గుజరాత్


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శివమ్ దూబే

చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ ఆల్‌రౌండ్ షోకు నిరుటి రన్నరప్ గుజరాత్ టైటాన్స్ పోరాటం వదిలి చేతులెత్తేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై 63 పరుగుల తేడాతో గుజరాత్‌పై ఘనవిజయం సాధించింది. మొదట చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగుల భారీ స్కోరు చేసింది. శివమ్ దూబే (23 బంతుల్లో 51; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 46; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 143 పరుగులే చేసి ఓడింది. సాయి సుదర్శన్ (31 బంతుల్లో 37; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పరుగుల తేడా పరంగా ఐపీఎల్‌లో గుజరాత్‌కిదే అతిపెద్ద ఓటమి. చెన్నై బౌలర్లు దీపక్ చహర్, తుషార్ దేశ్ పాండే, ముస్తఫిజుర్ తలా 2 వికెట్లు తీశారు.

ముందు రచిన్... తర్వాత దూబే...

చెన్నై ఇన్నింగ్స్ తొలి 10 ఓవర్లు, తర్వాత 10 ఓవర్లు అన్నట్లుగా రెండు దశలూ ధనాధన్‌గా సాగింది. తొలి దశను ఓపెనర్ రచిన్ దూకుడుగా మొదలుపెట్టాడు. అతను క్రీజులో ఉన్నది కాసేపే అయినా... భారీ షాట్లతో విరుచుకుపడటంతో మెరుపు వేగంతో చెన్నై స్కోరు దూసుకెళ్లింది. ఆరో ఓవర్ రెండో బంతికి రషీద్ అతని జోరుకు కళ్లెం వేశాడు. ఓపెనింగ్ జోడీ 32 బంతుల్లో 62 పరుగులు జతచేయగా, ఇందులో 46 పరుగులు ఒక్క రచిన్‌వే కావడం విశేషం. తర్వాత రహానే (12), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (36 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) చెన్నైను నడిపించారు. 10 ఓవర్లలో చెన్నై 104/1 స్కోరు చేసింది. తర్వాతి ఓవర్ తొలి బంతికే రహానే అవుట్‌కాగా... శివమ్ దూబే రావడంతో రెండో దూకుడు కొత్తగా మొదలైంది. స్పిన్, పేస్ ఏ బౌలర్‌కు తలొగ్గకుండా దూబే బ్యాట్ దంచేసింది. మిచెల్ (20 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు) అండతో శివమెత్తడంతో... ఈ జోడీ కూడా 35 బంతుల్లో 57 పరుగులు జోడించింది. 22 బంతుల్లో దూబే అర్ధసెంచరీ పూర్తయిన వెంటనే నిష్క్రమించాడు. సమీర్ రిజ్వీ (6 బంతుల్లో 14; 2 సిక్స్‌లు) మెరుపులతో చెన్నై స్కోరు 200 పైచిలుకు చేరింది.

టైటాన్స్ వల్ల కాలేదు!

కొండంత లక్ష్యం చూసే గుజరాత్ భీతిల్లినట్లుంది. ఓపెనర్లు మొదలు ఆఖరి వరుసదాకా అందరి బ్యాటర్లదీ అదే తీరు! ఛేదించాల్సిన లక్ష్యం కోసం ఆడాల్సిన తీరు ఏ ఒక్కరిలోనూ కనిపించలేదు. పవర్‌ప్లేలోనే కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (8), సాహా (17 బంతుల్లో 21; 4 ఫోర్లు) పెవిలియన్‌కు వెళ్లిపోయారు. వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కానీ మెరిపించలేదు... కాసేపైనా మురిపించ లేదు. హిట్టర్లు విజయ్ శంకర్ (12), మిల్లర్ (16 బంతుల్లో 21; 3 ఫోర్లు), రాహుల్ తెవాటియా (6) అంతా చెన్నై కట్టుదిట్టమైన బౌలింగ్‌కు వికెట్లు అప్పగించేశారు.


రచిన్ రవీంద్ర

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) సాహా (బి) జాన్సన్ 46; రచిన్ (స్టంప్డ్) సాహా (బి) రషీద్ ఖాన్ 46; రహానే (స్టంప్డ్) సాహా (బి) సాయికిషోర్ 12; దూబే (సి) శంకర్ (బి) రషీద్ ఖాన్ 51; మిచెల్ (నాటౌట్) 24; సమీర్ రిజ్వీ (సి) మిల్లర్ (బి) మోహిత్ 14; జడేజా (రనౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-62, 2-104, 3-127, 4-184, 5-199, 6-206. **బౌలింగ్:** అజ్మతుల్లా 3-0-30-0, ఉమేశ్ 2-0-27-0, రషీద్ ఖాన్ 4-0-49-2, సాయికిషోర్ 3-0-28-1, జాన్సన్ 4-0-35-1, మోహిత్ శర్మ 4-0-36-1.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) తుషార్ (బి) దీపక్ 21; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీపక్ 8; సాయి సుదర్శన్ (సి) సమీర్ (బి) పతిరణ 37; విజయ్ శంకర్ (సి) ధోని (బి) మిచెల్ 12; మిల్లర్ (సి) రహానే (బి) తుషార్ 21; అజ్మతుల్లా (సి) రచిన్ (బి) తుషార్ 11; తెవాటియా (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 6; రషీద్ ఖాన్ (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 1; ఉమేశ్ (నాటౌట్) 10; జాన్సన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 143. వికెట్ల పతనం:** 1-28, 2-34, 3-55, 4-96, 5-114, 6-118, 7-121, 8-129. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-28-2, ముస్తఫిజుర్ 4-0-30-2, తుషార్ దేశ్‌పాండే 4-0-21-2, జడేజా 2-0-15-0, మిచెల్ 2-0-18-1, పతిరణ 4-0-29-1.

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × ముంబై
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం


కెప్టెన్ సునీల్ ఛెత్రి

భారత్‌కు అఫ్గానిస్తాన్ షాక్

1-2తో అనూహ్య ఓటమి • తన 150వ మ్యాచ్‌లో కెప్టెన్ సునీల్ ఛెత్రికి నిరాశ

గువాహటి: ఫుట్‌బాల్‌లో భారత జట్టు దీనావస్థను చూపించే మరో ఉదాహరణ! ఆసియాలో అనామక జట్లలో ఒకటైన అఫ్గానిస్తాన్‌తో నాలుగు రోజుల క్రితం జరిగిన మ్యాచ్‌లో ఒక్క గోల్ కూడా చేయకుండా 'డ్రా'గా ముగించిన భారత్ ఆటతీరు ఈసారి మరింత దిగజారింది. 2026 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య మంగళవారం సొంతగడ్డపై జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లోనూ భారత్ కనీస ప్రదర్శనను ఇవ్వలేకపోయింది. చివరకు 1-2 గోల్స్ తేడాతో అనూహ్యంగా ఓటమి పాలైంది. ఈ పరాజయంతో ఆసియా క్వాలిఫయర్స్‌లో భారత జట్టు మూడో రౌండ్‌కు అర్హత సాధించే అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది. నాలుగు జట్లున్న గ్రూప్ 'ఎ'లో నాలుగు మ్యాచ్‌ల తర్వాత భారత్ ఖాతాలో 4 పాయింట్లే ఉన్నాయి. మన టీమ్ తర్వాతి మ్యాచ్‌లలో కువైట్ (జూన్ 6న కోల్‌కతాలో), ఆసియా చాంపియన్ ఖతర్ (జూన్ 11న దోహాలో) జట్లతో తలపడాల్సి ఉంది. అఫ్గాన్‌తోనే ఓడిన మన టీమ్ ఈ నాణ్యమైన టీమ్‌లపై ఏమాత్రం ప్రభావం చూపిస్తుందనేది సందేహమే. చివరిసారి 2013లో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిపోయిన భారత జట్టు ఈ మ్యాచ్‌లో ముందుగా గోల్ చేసి ఆధిక్యంలోకి వెళ్లి కూడా ఆఖరికి మ్యాచ్‌ను ప్రత్యర్థికి అప్పగించింది. భారత్ తరఫున 38వ నిమిషంలో సునీల్ ఛెత్రి కెరీర్‌లో 94వ గోల్ నమోదు చేయగా... అఫ్గానిస్తాన్ ఆటగాళ్లలో రహ్మాత్ అక్బరీ (70వ ని.లో), షరీఫ్ ముఖమ్మద్ (88వ ని.లో) గోల్స్ చేశారు. తన 150వ అంతర్జాతీయ మ్యాచ్‌లో ఛెత్రి గోల్ చేయడం విశేషమే అయినా... ఓటమి భారత్‌ను నిరాశకు గురి చేసింది.

పెర్త్‌లో భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు

ఈ ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన

మెల్‌బోర్న్: మూడు దశాబ్దాల తర్వాత ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య మళ్లీ ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. ఈ ఏడాది నవంబర్‌లో తమ దేశంలో భారత జట్టుతో జరిగే టెస్టు సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) విడుదల చేసింది. పెర్త్ వేదికగా నవంబర్ 22 నుంచి 26 వరకు ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగే తొలి టెస్టుతో బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ మొదలవుతుంది. అనంతరం అడిలైడ్‌లో రెండో టెస్టు (డిసెంబర్ 6-10; డే/నైట్), బ్రిస్బేన్‌లో మూడో టెస్టు (డిసెంబర్ 14-18), మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు (డిసెంబర్ 26-30)... సిడ్నీలో చివరిదైన ఐదో టెస్టు (2025 జనవరి 3 నుంచి 7) జరుగుతుంది. చివరిసారి 1991-1992లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ జరగ్గా... భారత జట్టు 0-4తో సిరీస్‌ను చేజార్చుకుంది.



డిసెంబర్‌లో భారత మహిళల జట్టుతో సిరీస్


ఈ ఏడాది డిసెంబర్‌లో భారత మహిళల జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. మూడు మ్యాచ్‌లతో కూడిన వన్డే సిరీస్ ఆడనుంది. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య డిసెంబర్ 5, 8, 11వ తేదీల్లో మూడు వన్డేలు జరుగుతాయి.

సినిమా


ఎన్టీఆర్

పాట.. ఫైటు

గోవాకు బై బై చెప్పారు 'దేవర'. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. శ్రుతీ మరాఠి, చైత్ర, సైఫ్ అలీఖాన్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. కాగా ఇటీవల గోవాలో మొదలైన 'దేవర' సినిమా చిత్రీకరణ ముగిసిందని సమాచారం. ఓ ఫైటు సీక్వెన్స్‌తో పాటు ఓ పాటను చిత్రీకరించారట మేకర్స్. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ కాంబినేషన్‌లోని సన్నివేశాల చిత్రీకరణ కూడా జరిగిందని తెలిసింది. తదుపరి షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం అవుతుందని, ఏప్రిల్ మొదటివారంలో ఈ కొత్త షెడ్యూల్ ఉండే అవకాశం ఉందని భోగట్టా. కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల కానుంది.


రవితేజ

విల్లు ఎక్కు పెట్టి..!

రెండు రోజుల క్రితం రణ్‌బీర్ కపూర్ తలకిందులుగా నిలబడిన ఫొటో వైరల్ అయ్యింది. ఈ శీర్షాసనం ఎందుకూ అంటే.. శిక్షణలో భాగంగా. రామాయణం ఆధారంగా నితీష్ తివారీ దర్శకత్వంలో రూపొందనున్న 'రామాయణ్' చిత్రం కోసమే రణ్‌బీర్ వర్కవుట్స్ మొదలుపెట్టారు. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా నియమించిన ట్రైనర్ ఆధ్వర్యంలో రణ్‌బీర్ కపూర్ మేకోవర్ అవుతున్నారు. ఒకవైపు ఫిజికల్ మేకోవర్ మరోవైపు యుద్ధ విద్యలు నేర్చుకుంటూ బిజీగా ఉన్నారు రణ్‌బీర్. మొన్న శీర్షాసనం ఫొటో వైరల్ కాగా తాజాగా విలు విద్య నేర్చుకోవడానికి రణ్‌బీర్ సిద్ధమవుతున్న ఫొటోలు బయటికొచ్చాయి. మేకోవర్ ట్రైనర్ వేరు... విలు విద్య నేర్పిస్తున్న ట్రైనర్ వేరు. రాముడంటే యుద్ధ విద్యల్లో సూపర్ కాబట్టి ఆ పాత్రకు న్యాయం చేయడానికి ఏమేం చేయాలో అన్నీ చేయడానికి రణ్‌బీర్ రెడీ అయిపోయారు. ఇక ఈ చిత్రంలో సీత పాత్రలో సాయి పల్లవి, రావణుడిగా యశ్, కైకేయిగా లారా దత్తా నటిస్తారనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో పాన్ ఇండియా మూవీగా అల్లు అరవింద్, మధు మంతెన, నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారట.


రణ్‌బీర్ కపూర్

దిల్ సే సోల్జర్స్... దిమాక్ సే సైతాన్స్!

అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా నటించిన యాక్షన్ చిత్రం 'బడే మియా చోటే మియా'. మానుషీ చిల్లర్, ఆలయ హీరోయిన్లుగా పృథ్వీరాజ్ సుకుమారన్, సోనాక్షీ సిన్హా కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహించారు. జాకీ భగ్నానీ, వసు భగ్నాని, దీప్శిఖా దేశ్‌ముఖ్, అలీ అబ్బాస్ జాఫర్, హిమాన్షు కిషన్ మెహ్రా నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఎవరు నువ్వు..', 'ప్రళయం నేను..', 'ప్రపంచం ఇలాంటి ఓ యుద్ధాన్ని ఇప్పటివరకూ చూసి ఉండదు. మీ దగ్గర మూడే రోజులు ఉన్నాయి. మీరు ఇప్పుడు రెస్పాండ్ అవ్వాల్సిందే', 'అలాంటి ఓ సైకోని పట్టుకోవాలంటే ... ఆ సైకోను మించి సైకోలుగా మేం మారాల్సిన అవసరం ఉంది', 'దిల్ సే సోల్జర్స్.. దిమాక్ సే సైతాన్స్ హై ఓ' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నట్లుగా తెలుస్తోంది. భారత దేశాన్ని నాశనం చేయాలనుకునే ఓ సైకో సైంటిస్టును ఇద్దరు భారత సోల్జర్స్ ఏ విధంగా అడ్డుకున్నారు? అన్నదే ఈ చిత్రకథ.


టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్

యాక్షన్ బచ్చన్

లక్నోలో ఫైట్స్ చేస్తున్నాడు మిస్టర్ బచ్చన్. హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రంలో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ లక్నోలో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ సినిమాలో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ జరుగుతోంది. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ స్వరకర్త.

మళ్లీ హ్యాపీ డేస్

కాలేజ్ బ్యాక్‌డ్రాప్ చిత్రాల్లో 'హ్యాపీ డేస్' (2007) ఓ ట్రెండ్ సెట్టర్. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన ఈ యూత్‌ఫుల్ చిత్రం విడుదలై పదిహేడేళ్లయింది. వరుణ్ సందేశ్, తమన్నా భాటియా, నిఖిల్ సిద్ధార్థ్ తదితరుల కాంబినేషన్‌లో అమిగోస్ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం అప్పట్లో మంచి వసూళ్లతో సంచలన విజయం సాధించింది. శేఖర్ కమ్ముల టేకింగ్, నటీనటుల పెర్ఫార్మెన్స్, మిక్కీ జే మేయర్ సంగీతం, విజయ్ సి. కుమార్ కెమెరా పనితనం అన్నీ అద్భుతంగా కుదిరిన ఈ చిత్రం ఇప్పుడు మళ్లీ విడుదల కానుంది. ఏప్రిల్ 12న ఈ చిత్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ సినిమాస్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.



హిట్ జోడీ రిపీట్

టామ్ హాలండ్, జెండయా హిట్ జోడీ. 'స్పైడర్‌మేన్' సిరీస్‌లో వెండితెరపై ప్రేమికులుగా కనిపించిన ఈ ఇద్దరూ నిజంగానే ప్రేమికులు కూడా. అయితే బ్రేకప్ చెప్పుకున్నారనే వార్తలు ఈ మధ్య వస్తే... 'అలాంటిదేం లేదు' అంటూ ఈ జంటను ఇష్టపడే వారిని ఖుషీ చేశారు టామ్. ఇప్పుడు హాలీవుడ్ నుంచి మరో ఖుషీ కబురు అందింది. 'స్పైడర్‌మేన్' సిరీస్‌లోని నాలుగో భాగంలోనూ ఈ ఇద్దరూ జంటగా నటించనున్నారన్నది ఆ కబురు. నిజానికి 'యుఫోరియా' సిరీస్‌లోని మూడో సీజన్‌లో నటిస్తున్నందున జెండయా 'స్పైడర్‌మేన్ 4'లో నటించడానికి వీలుపడని పరిస్థితి. అయితే 'యుఫోరియా' కథ ఇంకా పూర్తి కాకపోవడంతో ఆ సిరీస్ కమిట్ అయిన నటీనటులకు వేరే ప్రాజెక్ట్ ఒప్పుకునే వెసులుబాటుని ఇచ్చిందట యూనిట్. దాంతో తాను ఎంతగానో ఇష్టపడే 'స్పైడర్‌మేన్' చిత్రానికి డేట్స్ కేటాయించే పని మీద ఉన్నారట జెండయా. ఇక టామ్ హాలండ్ తాను ఇష్టపడే చిత్రాల్లో 'స్పైడర్‌మేన్'కి ప్రముఖ స్థానం ఉందని అంటుంటారు. సో.... పీటర్ పార్కర్ (టామ్ చేసే స్పైడర్‌మేన్ పాత్ర పేరు), ఎమ్‌జె (పీటర్ గాళ్ ఫ్రెండ్‌గా జెండయా చేసే పాత్ర పేరు)ల ప్రేమను మరోసారి 'స్పైడర్‌మేన్ 4'లో చూడొచ్చన్న మాట. ఈ హిట్ జోడీ రిపీట్ అయ్యే విషయం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. జస్టిన్ లిన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబర్ లేదా అక్టోబరులో ఆరంభం కానుంది.


టామ్ హాలండ్, జెండయా

పట్టణంలో థ్రిల్

విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో...'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో విశ్వ కార్తికేయ మాట్లాడుతూ- ''మా సినిమా కథ నంద్యాలలో జరుగుతుంది. అందుకే 'కలియుగం పట్టణంలో..' అనే టైటిల్ పెట్టాం. కడప లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో సరైన బాధ్యత తీసుకోకపోతే ఏం జరగొచ్చు? అన్నదే మా చిత్ర కథ. సస్పెన్స్ అండ్ థ్రిల్ అంశాలతో పాటుగా సినిమాలో మదర్ సెంటిమెంట్ కూడా ఉంది. హారర్ నేపథ్యంలో సాగే నా తర్వాతి చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతుంది'' అని చెప్పుకొచ్చారు.


విశ్వ కార్తికేయ

మంజుమ్మెల్ బాయ్స్ వస్తున్నారు

మలయాళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'మంజుమ్మెల్ బాయ్స్' తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన తారాగణంగా చిదంబరం దర్శకత్వంలో ఈ సర్వైవల్ డ్రామాను బాబు షాహిర్, సౌబిన్ షాహిర్, షాన్ ఆంటోని నిర్మించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న విడుదలైన ఈ చిత్రం దాదాపు 200 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్‌తో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాను 'మంజుమ్మెల్ బాయ్స్' టైటిల్‌తోనే మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి తెలుగులో ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నారు. ఇక 2006లో కొడైకెనాల్‌లోని గుణ కేవ్‌లో చిక్కుకున్న తమ స్నేహితుడిని రక్షించిన ఎర్నాకులం మంజుమ్మెల్ యువకుల నిజమైన అనుభవాల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది.


'మంజుమ్మెల్ బాయ్స్'లో ఓ దృశ్యం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	362	72,470
నిఫ్టీ ▽	92	22,005

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,428	△ 43
డోజోన్స్	39,403	△ 89
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,931	△ 13
డాక్స్	18,384	△ 123
షాంఘై	3,031	△ 5
నికాయ్	40,398	▽ 17

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	66,716
బంగారం (22 66,449	66,449
వెండి (కేజీ)	74,279

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.23	106.78
€	యూరో	ఎస్‌బీఐ	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.64	55.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.64	64.35
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

బిలియనీర్ల నగరం ముంబై



- 92 మంది సంపన్నులకు కేంద్రం
- బీజింగ్‌ను దాటిన దేశ ఆర్థిక రాజధాని
- హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్‌లో వెల్లడి

HURUN GLOBAL RICH LIST

ముంబై: బిలియనీర్ల విషయంలో దేశ ఆర్థిక రాజధాని ముంబై తాజాగా బీజింగ్‌ను అధిగమించింది. మంగళవారం విడుదలైన హురున్ గ్లోబల్ రిచ్ లిస్టు ప్రకారం ముంబైలో 92 మంది అత్యంత సంపన్నులు ఉండగా బీజింగ్‌లో ఈ సంఖ్య 91గా ఉంది. ఇక చైనాలో మొత్తం 814 మంది బిలియనీర్లు ఉండగా భారత్‌లో 271 మంది ఉన్నారు. దేశీయంగా కుబేరుల మొత్తం సంపద 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 115 బిలియన్ డాలర్ల సంపదతో అత్యంత సంపన్న భారతీయుడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. గత ఏడాది వ్యవధిలో ఆయన సంపద మరో 40 శాతం (33 బిలియన్ డాలర్లు) పెరిగింది. ఇక హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికతో గణనీయంగా దెబ్బతిన్న గౌతమ్ అదానీ తిరిగి కోలుకున్నారు. ఆయన సంపద 62 శాతం వృద్ధి చెందింది. అంతర్జాతీయంగా అంబానీ పదో స్థానంలో ఉండగా, అదానీ 15వ స్థానంలో ఉన్నారు. 231 బిలియన్ డాలర్లతో టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ నంబర్ వన్‌గా ఉన్నారు. కొత్త బిలియనీర్లయిన వారి విషయంలో చైనాను భారత్ అధిగమించింది. భారత్ నుంచి ఈ లిస్టులో 94 మంది చోటు దక్కించుకోగా, చైనా నుంచి 55 మందికి చోటు దక్కింది. గత ఏడాది వ్యవధిలో ముంబైలో 27 మంది బిలియనీర్లు కాగా, బీజింగ్‌లో ఆరుగురు మాత్రమే ఈ హోదా దక్కించుకున్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
26-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.25

ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు



బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావం

ముంబై: ఫైనాన్స్, బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు మంగళవారం నష్టాలపాలయ్యాయి. సెన్సెక్స్ 362 పాయింట్లు తగ్గి 72,470 వద్ద నిలిచింది.. నిఫ్టీ 92 పాయింట్లు పతనమై 22,005 వద్ద ముగిసింది. మూడు సెలవు రోజుల తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడంతో సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో రోజంతా నష్టాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 469 పాయింట్లు క్షీణించి 72,363 వద్ద, నిఫ్టీ 149 పాయింట్లు పతనమై 21,948 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చైనా కరెన్సీ యువాన్ బలపడటం, అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

కాగా జీవితకాల కనిష్ట స్థాయి(83.61) నుంచి రూపాయి రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో మంగళవారం 32 పైసలు బలపడి 83.29 వద్ద ముగిసింది. అమెరికా డాలర్ బలహీనపడటం, ఆసియా దేశాల కరెన్సీ బలపడటం రూపాయి కోలుకునేందుకు సహకరించాయి.

భారతీ హెక్సాకామ్ @ రూ.542-570



భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ ఐపీవోకు రూ. 542-570 ధరల శ్రేణిని ప్రకటించింది. ఏప్రిల్ 3న ప్రారంభంకానున్న ఇష్యూ 5న ముగియనుంది. ఆఫర్ ద్వారా రూ. 4,275 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది.

ట్రంప్ మీడియా నాస్‌డాక్‌లో లిస్టింగ్



యూఎస్ మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా కంపెనీ తాజాగా నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయ్యింది. 50 డాలర్ల ధరలో డీజేటీ సింబల్‌తో నాస్‌డాక్‌లో ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్ప్ కౌంటర్‌లో ట్రేడింగ్ ప్రారంభమైంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 8.45 ప్రాంతంలో ట్రంప్ మీడియా షేరు నాస్‌డాక్‌లో 39 శాతం దూసుకెళ్లి 69.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

అదానీ చేతికి గోపాల్‌పూర్ పోర్టు

- 95 శాతానికి రూ. 1,349 కోట్లు
- షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్, ఒరిస్సా స్టీవ్‌డోర్స్ నుంచి కొనుగోలు



Shapoorji Pallonji

న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఖాతాలోకి మరో పోర్టు వచ్చి చేరనుంది. గ్రూప్‌లో భాగమైన అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ సంస్థ (ఏపీసెజ్) తాజాగా ఒడిశాలోని గోపాల్‌పూర్ పోర్టును (జీపీఎల్) దక్కించుకోనుంది. ఇందుకోసం జీపీఎల్‌లో షాపూర్‌జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్, ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ (ఓఎస్‌ఎల్) నుంచి 95 శాతం వాటాలను రూ. 1,349 కోట్లకు కొనుగోలు చేయనుంది. జీపీఎల్‌లో ఎస్‌పీ పోర్ట్ మెయింటెనెన్స్‌కి 56 శాతం, ఓఎస్‌ఎల్‌కి 44 శాతం వాటాలు ఉన్నాయి. ఇందులో ఎస్‌పీ గ్రూప్ వాటాలను పూర్తిగా, ఓఎస్‌ఎల్ నుంచి 39 శాతం వాటాలను ఏపీసెజ్ కొనుగోలు చేయనుంది. ఓఎస్‌ఎల్ 5 శాతం వాటాతో జాయింట్ వెంచర్ భాగస్వామిగా కొనసాగనుంది. రూ. 3,080 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువతో 95 శాతం వాటాను రూ. 1,349 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ఏపీసెజ్ తెలిపింది. నిర్దిష్ట మైలురాళ్లను అధిగమించాకా 5.5 ఏళ్ల తర్వాత మరో రూ. 270 కోట్లు చెల్లించే ప్రాతిపదికన ఈ డీల్ ఉంటుందని పేర్కొంది. దీంతో ఎంటర్‌ప్రైజ్ విలువను రూ. 3,350 కోట్లుగా లెక్కగట్టినట్లవుతుంది. గోపాల్‌పూర్ పోర్టు కొనుగోలుతో తమ కస్టమర్లకు మరింతగా సమగ్రమైన సేవలు అందించేందుకు వీలవుతుందని ఏపీసెజ్ ఎండీ కరణ్ అదానీ తెలిపారు. దీనితో ఒడిశాలోని మైనింగ్ హబ్‌లు, పొరుగు రాష్ట్రాలు అందుబాటులోకి రాగలవని, తద్వారా మారుమూల ప్రాంతాలకు కూడా తమ లాజిస్టిక్స్ సేవలను విస్తరించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. ఏపీసెజ్‌కి ప్రస్తుతం తూర్పు, పశ్చిమ తీరాల్లో పద్నాలుగు పోర్టులు, టెర్మినల్స్ ఉన్నాయి.

20 మిలియన్ టన్నుల సామర్థ్యం..

ఒరిస్సాలోని గంజాం జిల్లాలో 20 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో గోపాల్‌పూర్ పోర్టు పని చేస్తోంది. ఇనుప ఖనిజం, బొగ్గు, అల్యూమినా మొదలైన కార్గోను హ్యాండిల్ చేస్తోంది. ఇటీవలే ఇది ఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ టెర్మినల్‌ను నెలకొల్పేందుకు పెట్రోనెట్ ఎల్ఎన్‌జీతో కూడా ఒప్పందం కుదుర్చుకుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో జీపీఎల్ 11.3 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ ద్వారా రూ. 520 కోట్ల ఆదాయం ఆర్జించవచ్చని అంచనాలు ఉన్నాయి.

అసెట్ మానిటైజేషన్‌పై ఎస్‌పీ దృష్టి..

రూ. 20,000 కోట్ల రుణభారాన్ని తగ్గించుకునే దిశగా ఎస్‌పీ గ్రూప్ గత కొన్నాళ్లుగా అసెట్ మానిటైజేషన్ (ఆస్తులను విక్రయించడం లేదా, లీజుకివ్వడం ద్వారా నిధులు సమకూర్చుకోవడం)పై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గతంలో మహారాష్ట్రలోని ధరమ్‌తార్ పోర్టును రూ. 710 కోట్ల విలువకు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకి విక్రయించింది. 2015లో దీన్ని కొనుగోలు చేసిన ఎస్‌పీ గ్రూప్.. ఆ తర్వాత కార్యకలాపాలను టర్న్‌అరౌండ్ చేయగలిగింది. వార్షిక సామర్థ్యాన్ని 1 ఎంటీపీఏ నుంచి 5 ఎంటీపీఏకి పెంచింది. ఇక గోపాల్‌పూర్ పోర్టు ఒప్పందం గత కొద్ది నెలల్లో రెండో డీల్. రెండు పోర్టులను గణనీయమైన విలువకు విక్రయించడమనేది అసెట్స్‌ను టర్న్‌అరౌండ్ చేయడంలోను, స్వల్ప కాలంలోనే వాటాదారులకు మెరుగైన రాబడులు అందించడంలోనూ తమకు గల సామర్థ్యానికి నిదర్శనమని ఎస్‌పీ గ్రూప్ ప్రతినిధి తెలిపారు.

ప్రపంచంలోనే పటిష్టమైన బీమా బ్రాండ్.. ఎల్‌ఐసీ



న్యూఢిల్లీ: దేశీ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన బీమా సంస్థగా నిల్చింది. 2024 సంవత్సరానికి సంబంధించి బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100 నివేదికలో ఈ విషయం వెల్లడైంది. దీని ప్రకారం స్థిరంగా 9.8 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో, 88.3 బ్రాండ్ పటిష్టత సూచీ స్కోరుతో, ట్రిపుల్ ఏ రేటింగ్‌తో ఎల్‌ఐసీ అగ్రస్థానంలో ఉంది. క్యాథే లైఫ్ ఇన్సూరెన్స్ రెండో స్థానంలో ఉంది. ఈ సంస్థ బ్రాండ్ విలువ 9% పెరిగి 4.9 బిలియన్ డాలర్లకు చేరింది. ఎస్ఆర్ఎంఏ ఇన్సూరెన్స్ 1.3 బిలియన్ డాలర్ల విలువతో (82% వృద్ధి) మూడో స్థానంలో ఉన్నట్లు బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ తెలిపింది. మరోవైపు, విలువపరంగా చూస్తే చైనా కంపెనీల ఆధిపత్యం కొనసాగుతోంది. 33.6 బిలియన్ డాలర్లతో పింగ్ ఆన్ సంస్థ అగ్రస్థానంలో ఉండగా, చైనా లైఫ్ ఇన్సూరెన్స్ అలాగే సీపీఐసీ వరుసగా 3వ, 5వ స్థానాల్లో కొనసాగుతున్నాయి.

క్యూ3లో క్యాడ్ 10.5 బిలియన్ డాలర్లు



ముంబై: భారత్ కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) అక్టోబర్–డిసెంబర్ (క్యూ3) త్రైమాసికంలో 10.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇదే కాలంలో నమోదయిన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువతో పోల్చితే ఈ విలువ 1.2 శాతం. అంతక్రితం త్రైమాసికంతో పోల్చితే (విలువలో 11.4 బిలియన్ డాలర్లు, జీడీపీలో 1.3 శాతం) ఇది తక్కువ కావడం గమనార్హం. ఎగుమతుల్లో పురోగతి, వాణిజ్యలోటు తగ్గడం దీనికి కారణం.

యూనివర్సిటీకి 'మహీంద్రా' రూ.500 కోట్లు



న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా, ఆయన కుటుంబం హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయానికి రూ.500 కోట్లు సమకూరుస్తోంది. కొత్త విభాగాల ఏర్పాటుకు గాను 2028-29 వరకు ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. అలాగే యూనివర్సిటీలో భాగమైన ఇందిర మహీంద్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు ఆనంద్ మహీంద్రా సొంత నిధుల నుంచి రూ.50 కోట్లు వెచ్చించనున్నారు.

ఏపీలో ఇండోసోల్ ప్లాంటు రెడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ఉన్న ఇండోసోల్ సోలార్ ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన 500 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్ మాడ్యూల్స్ తయారీ ప్లాంట్ సిద్ధం అయింది. నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద 30 ఎకరాల్లో విస్తరించిన ఈ అత్యాధునిక కేంద్రంలో మార్చి 31 నుంచి ఉత్పత్తి ప్రారంభం అవుతుందని ఇండోసోల్ సీఈవో శరత్ చంద్ర మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభం అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 23,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇండోసోల్‌ను షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ప్రమోట్ చేస్తోంది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ-మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 14 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **విభాగాలు:** ఎంబెడెడ్ సిస్టమ్స్–హార్డ్‌వేర్, ఎంబెడెడ్ సిస్టమ్స్–సాఫ్ట్‌వేర్, పవర్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ డిజైన్, రేడియో ఫ్రీక్వెన్సీ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.04.2024
» **దరఖాస్తు హార్డ్‌కాపీలు పోస్టులో పంపడానికి చివరితేది:** 20.04.2024.
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 30 టెక్నీషియన్(గ్రేడ్2) పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. టెక్నీషియన్(గ్రేడ్2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్–07,ఎలక్ట్రీషియన్–06,మెషినిస్ట్–07,ఫిట్టర్–10.
» **అర్హత:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ఎలక్ట్రీషియన్/ఫిట్టర్/మెషినిస్ట్ ట్రేడ్స్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. ఏడాది పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 13.04.2024 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.20,480.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.04.2024
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

సెయిల్‌లో 108 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

జార్ఖండ్‌లోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్), బొకారో స్టీల్ ప్లాంట్‌లో.. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 108
» **ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్.
» **నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(బాయిలర్), అటెండెంట్ కమ్ టెక్నీషియన్(బాయిలర్), మైనింగ్ ఫోర్మాన్, సర్వేయర్, ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(మైనింగ్/ఎలక్ట్రికల్), మైనింగ్ ఫోర్‌మ్యాన్, అటెండెంట్ కమ్ టెక్నీషియన్ ట్రైనీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా,డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.05.2024
» **వెబ్‌సైట్:** https://sail.co.in

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, న్యూఢిల్లీలో 63 ఇంజనీర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 63
» **పోస్టుల వివరాలు:** ఇంజనీర్(ఆర్ఈ–సివిల్)–20, ఇంజనీర్ (ఆర్ఈ –ఎలక్ట్రానిక్స్)–29, ఇంజనీర్(ఆర్ఈ–మెకానికల్)–09, ఎగ్జిక్యూటివ్ (ఆర్ఈ–హెచ్ఆర్)–01, ఇంజనీర్ (ఆర్ఈ–సీడీఎం)–01, ఎగ్జిక్యూటివ్ (ఆర్ఈ–ఫైనాన్స్)–01, ఇంజనీర్(ఆర్ఈ–ఐటీ)–01, ఎగ్జిక్యూటివ్(ఆర్ఈ–కార్పొరేట్ కమ్యూనికేషన్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీ, సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.83,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.04.2024.
» **వెబ్‌సైట్:** https://ntpcrel.co.in

బీమా కంపెనీలో ఆఫీసర్

బీమా రంగం గత కొంతకాలంగా కొలువుల కామధేనువుగా మారుతోంది. పలు బీమారంగ సంస్థలు నిత్యం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ రంగ బీమా సంస్థ ది ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఓఐసీఎల్).. మొత్తం 100 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకౌంటింగ్ నుంచి లీగల్ వరకూ పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది! ఈ నేపథ్యంలో.. ఓఐసీఎల్‌లో ఏఓ పోస్ట్‌లు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 100 ఏఓ పోస్టుల భర్తీకి ఓఐసీఎల్ నోటిఫికేషన్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ఎంపికైతే నెలకు రూ.85 వేల వేతనం

మొత్తం 100 పోస్ట్‌లు

ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ తాజా నోటిఫికేషన్ ద్వారా ఆరు విభాగాల్లో 100 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్ట్‌లను భర్తీ చేయనుంది. వీటిల్లో అకౌంట్స్–20 పోస్ట్‌లు, యాక్చుయేరియల్–5 పోస్ట్‌లు, ఇంజనీరింగ్–15 పోస్ట్‌లు, ఇంజనీరింగ్ (ఐటీ)–20 పోస్ట్‌లు, మెడికల్ ఆఫీసర్–20 పోస్ట్‌లు, లీగల్–20 పోస్ట్‌లు ఉన్నాయి.

అర్హతలు

- ఆయా పోస్ట్‌లను అనుసరించి బీకాం/సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/ఎంబీఏ(ఫైనాన్స్)/ నిర్దేశిత బ్రాంచ్‌లతో బీటెక్ లేదా ఎంటెక్/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ (స్టాటిస్టిక్స్/మ్యాథమెటిక్స్/యాక్చుయేరియల్ సైన్స్)/ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** డిసెంబర్ 31, 2023 నాటికి 21–30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ.. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

వంద మార్కులకు ప్రిలిమినరీ

ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమినరీ పరీక్షను మూడు విభాగాల్లో 100మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 మార్కులకు ఉంటాయి. ప్రిలిమ్స్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్ష వ్యవధి ఒక గంట.

రెండో దశ మెయిన్

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు 20 మందిని చొప్పున (1:20 నిష్పత్తిలో) రెండో దశ మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష అయిదు విభాగాల్లో మొత్తం 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ 40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 మార్కులకు, ప్రొఫెషనల్ నాలెడ్జ్/సబ్జెక్ట్ నాలెడ్జ్ 40 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

డిస్క్రిప్టివ్ టెస్ట్

మెయిన్ పరీక్షలో భాగంగానే 30 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో 10 మార్కులకు లెటర్ రైటింగ్, 20 మార్కులకు ఎస్సే రైటింగ్ ఉంటాయి. డిస్క్రిప్టివ్ టెస్ట్‌కు కేటాయించిన సమయం 30 నిమిషాలు. ఇది అర్హత పరీక్ష మాత్రమే.

చివరగా ఇంటర్వ్యూ

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున ఎంపిక చేసి.. చివరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.



ఇంటర్వ్యూలో అభ్యర్థుల అకడమిక్ నేపథ్యం, సబ్జెక్ట్ నాలెడ్జ్, ఇన్సూరెన్స్ రంగంపై ఉన్న ఆసక్తి తదితర అంశాలను పరిశీలిస్తారు.

వెయిటేజీ విధానం

తుది విజేతలను ప్రకటించే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కులకు 80 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి.. తుది జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

సర్వీస్ బాండ్..ప్రొబేషన్

ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగంలో చేరేముందు సర్వీస్ అగ్రిమెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. సంస్థలో కనీసం నాలుగేళ్లపాటు విధులు నిర్వర్తిస్తామని తెలిపే విధంగా బాండ్ సమర్పించాలి. తుది నియామకాలు ఖాయం చేసుకున్న వారికి ఏడాది ప్రొబేషనరీ పీరియడ్ ఉంటుంది. ఈ సమయంలో వారు ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఆకర్షణీయ వేతనం

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయమైన వేతనం లభిస్తుంది. ప్రారంభంలోనే నెలకు రూ.85 వేల వేతనం అందుతుంది. మూల వేతనాన్ని రూ. 50,925 (పే స్కేల్ రూ.50,925 రూ.96,765)గా నిర్ధారించారు. దీనికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ వంటి ఇతర భత్యాలు లభిస్తాయి. వీటితోపాటు మెడికల్ ఇన్సూరెన్స్, ఎల్‌టీఎస్ వంటి సదుపాయాలు సైతం ఉంటాయి.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, ఏప్రిల్ 12
- రాత పరీక్షల తేదీలు: మే/జూన్‌లో నిర్వహించే అవకాశం
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/web/guest/careers

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

రీజనింగ్ ఎబిలిటీ

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన విభాగం.. రీజనింగ్. దీనికోసం సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో బెస్ట్ స్కోర్ కోసం హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు ఇన్సూరెన్స్ రంగంలో తాజా పరిణామాలు, స్టాక్ జీకే, ఆర్థిక సంబంధ పరిణామాల(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్,టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను సాధన చేయాలి. ఫలితంగా ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

అన్ని పోస్ట్‌లకు ఉండే విభాగం.. ప్రొఫెషనల్ నాలెడ్జ్. దీనికోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్‌పై ఫోకస్ చేయాలి. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

మెయిన్స్ దృక్పథం

అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచే మెయిన్ పరీక్ష దృక్పథంతో ప్రిపరేషన్ సాగించాలి. మూడు విభాగాలు ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ ఉన్నాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ ప్రశ్నల్లో క్లిష్టత స్థాయిలో వ్యత్యాసం ఉంటుంది. మెయిన్స్ దృక్పథంతో చదివితే ప్రిలిమ్స్‌లో సులభంగా విజయం సాధించే అవకాశం ఉంటుంది.

గత ప్రశ్న పత్రాలు

అభ్యర్థులు గత ప్రశ్న పత్రాల సాధన, మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం మేలు. గ్రాండ్ టెస్ట్‌ల సమాధానాలను సరి చూసుకోవడం ద్వారా తాము ఇంకా అవగాహన పొందాల్సిన అంశాలపై స్పష్టత లభిస్తుంది. అంతేకాకుండా మాక్ టెస్ట్‌లకు హాజరవడం వల్ల పరీక్ష హాల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.


RENAULT TRIBER
life on demand
VX-808-MA
discover now
ధర ప్రారంభం ₹5.99 లక్షలు*
5 నుండి 7 సీట్స్ వరకు
వైర్‌లెస్ చార్జర్
17.78 cm TFT ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్
*the above-mentioned price of ₹5 99 500 is for the base variant of the Triber and is exclusive of all local taxes. corporate / PSU / defence personnel / government employee / professional benefits applicable on each model are basis eligibility of the customer and based on submission of required proof by the customer. price valid on the date of purchase. for detailed terms and conditions, please visit www.renault.co.in
Renault recommends Castrol
renault.co.in